


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

30-9-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 240 పేజీలు: 10+4 వెల: 6.50
నిజామాబాద్
: fb.com/vaartha Digital

ఈ వారం గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

సోమవారం సరూర్‌నగర్‌లో 'గిన్నెస్ బతుకమ్మ' ఆడుతున్న మహిళలు

# గిన్నెస్ బతుకమ్మ

## రెండు రికార్డులతో విఖ్యాతి

### గల్లీనుంచి గ్లోబల్ స్థాయికి పూల పండుగ

### అతిపెద్ద ఫోక్‌డాన్స్‌గా గుర్తింపు

### ఐక్యతను చాటిన ఆడబిడ్డలు: మంత్రులు జూపల్లి, సీతక్క

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** గల్లీ నుంచి గ్లోబల్ స్థాయి వరకు తెలంగాణ బతుకమ్మ పేరు సాధించింది. తెలంగాణ బతుకమ్మ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకొని అరుదైన రికార్డును సాధించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ వేడుకల కార్యక్రమం సరూర్ నగర్ స్టేడియంలో సోమవారం విజయవంతం అయ్యింది. గత రెండు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషికి గిన్నిస్ బుక్‌వరల్డ్ రికార్డు >>2


సరూర్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మిస్ వరల్డ్ చాపల్, మంత్రి సీతక్క

# 5 దశల్లో 'స్థానికం'

## 9 నుంచి నామినేషన్లు షురూ

### తొలుత జడ్పీటీసి, ఎంపీటీసి

### తర్వాత మూడు దశల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు

### తక్షణమే రాష్ట్రమంతా 'కోడ్' అమలు

### డబ్బు రూ. 50 వేల మించి తీసుకెళ్తే సీజ్

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వెల్లడి


మీడియాతో ఎన్నికల కమిషనర్ కుముదిని

**హైదరాబాద్,సెప్టెంబర్ 29 ,ప్రభాతవార్త:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సోమవారం నోటిఫికేషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మీడియాకు తెలిపారు. మొత్తం 5 దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి 2 దశల్లో ఎంపిటిసి, జడ్పీటిసి, మిగత 3 దశల్లో గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించన్నుట్లు తెలిపారు. ఎంపిటిసిలకు అక్టోబర్ 23న జడ్పీటీసిలకు 27న రెండో విడత ఏన్నికల పోలింగ్ నిర్వహిస్తామన్నారు.గ్రామ పంచాయితీలకు తోలి విడతగా అక్టోబర్ 31,రెండో విడతగా నవంబర్ 4న మూడో విడుతగా నవంబర్ 8 నిర్వహిస్తామన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయితీలకు ఒట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. నవంబర్ 11న ఎంపీటీసి, జడ్పీటిసి ఓట్ల లెక్కింపు ఉంటుందని ఆమె తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని గ్రామ పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే.. కొన్ని స్థానాల్లో కోర్టువివాదాల కారణంగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. ముఖ్యంగా ములుగు, కరీంనగర్ జిల్లాల్లోని >>2

**ఎన్నికల వివరాలు :**

- ఎంపిటీసీ, జడ్పీటీసీ రెండు విడతలు
- ఎన్నికల తేదీలు అక్టోబర్ 23, 27
- ఓట్ల లెక్కింపు నవంబర్ 11

**గ్రామ పంచాయితీ ఎన్నికలు మూడు విడతలు**

- మొదటి దశ: ఎన్నికల తేదీ, ఫలితాలు అక్టోబర్ 31
- రెండో దశ: ఎన్నికల తేదీ, ఫలితాలు నవంబర్ 4
- మూడోదశ: ఎన్నికల ఫలితాల విడుదల నవంబర్ 8

# మరిన్ని గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు



### ఎన్‌హెచ్ 44కు సమాంతరంగా ఒకటి

### హైదరాబాద్- బెంగళూరు మధ్య 6 లేన్ల రహదారి

### రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే

**హైదదరాబాద్, సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** మాస్టర్ ప్లాన్ ఫర్ నేషనల్ హైవేస్ విజన్ 2047 లో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ నూతన జాతీయ రహదారి నిర్మించాలని మరోవైపు హైదరాబాద్–నాగపూర్ రోడ్డువిస్తరణకు పనులు చేపట్టడానికి కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్‌హైవే అథారిటి వేగంగా అడుగులు కదుపుతోంది.నాగపూర్ హైదరాబాద్ బెంగళూరు నగరాల మధ్య రాకపోకలను మరింతగా పెంచాలని కేంద్రం మూడేళ్ళ క్రితం నిర్ణయించింది. హైదరాబాద్ బెంగుళూర్ విస్తరణకు భూసేకరణ మినహా పెద్దగా ఇతర ఇబ్బందిలేకపోయినా, మహారాష్ట్రలోని నాగపూర్ వరకు వేగవంతమైన రవాణా మార్గాన్ని ఏర్పాటు చేయడంలో పులుల అభయారణ్యాలలతో సవాళ్లు ఎదురవుతున్నాయి. నాగపూర్– హైదరాబాద్– బెంగళూరు మధ్య ప్రస్తుతం నాలుగు వరుసల హైవే ఉంది. అదనంగా నూతన రహదారిని నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ప్రయాణ సమయాన్ని మరింతగా తగ్గించేలా ఈ మేరకు రహదారిని అందుబాటులోకి తీసుకురావాలన్నది వ్యూహం. తమిళనాడులోని కన్యాకుమారి నుంచి మొదలై జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ వరకు వెళ్లే 44వ జాతీయ రహదారి దేశంలో అతిపెద్ద మార్గం. రాష్ట్రంలో బీచుపల్లి, జడ్చర్ల, హైదరాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, నిర్మల్,గుడిహత్నూర్, ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర లోని నాగపూర్ మీదుగా వెళ్తుంది.వాహనాల రాకపోకలు బాగా పెరిగి ఈ రోడ్డు రద్దీగా మారిందని రాష్ట్ర ప్రభుత్వంతో కొద్దిరోజుల క్రితం జరిగిన సమావేశం కేంద్రం పేర్కొన్నట్లు తెలిపింది.కవ్వాల్ టైగర్ రిజర్వులో ప్రస్తుతం ఉన్న 44వ నేషనల్ హైవే విస్తరించినప్పుడే చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆరు వరసలుగా మళ్ళీ విస్తరణ చేపడితే ఈ రోడ్డుతో మహారాష్ట్ర నుంచి పెద్ద పులుల రాక నిలిచిపోతుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం కొంతకాలంగా రాష్ట్రంలోని ముఖ్యమైన రహదారి అయిన రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించాలని కేంద్రాన్ని ఎప్పటి నుంచో కోరుతోంది. ప్రస్తుత జాతీయ రహదారి 44పై ఉన్న నాగపూర్ హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే లు వేయడం వల్ల ఇవి తక్కువ మలుపులు ప్రయాణ సమయం, దూరం తగ్గుతాయి, హైదరాబాద్ బెంగళూరు నూతన మార్గాన్ని హైస్పీడ్, గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిగా నిర్మించాలని నిర్ణయించింది.



## భారతీయ సినిమాలపై 100% సుంకాలు

### ట్రంప్ పేల్చిన మరో బాంబు

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** భారత్‌పైనే కాకుండా తనకు వ్యతిరేక వైఖరితో ఉన్న దేశాలపై సుంకాలను బాదిపారేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. తన సొంత సోషల్‌మీడియా సంస్థట్రూత్‌లో సోమవారం ఆయన మరో సంచలన పోస్టుచేసారు. ఇకనుంచి విదేశాల్లో తీసే సినిమాలు అమెరికాలో ప్రదర్శిస్తే 100శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు.ఇప్పటికే భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్ ప్రకటించిన ఈ తాజా నిర్ణయంతో భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం పడనున్నది. అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై సుంకాలు అమలు చేయనున్నట్లు హెచ్చరించారు. వందశాతం సుంకాలను విధించనున్నట్లు ప్రకటించారు. విదేశీ సినిమాలపై వందశాతం సుంకాలు >>2

## 42% కోటా వివాదం

# సిజె బెంచికి ఇవ్వండి

### సామాజిక న్యాయం కోసం అన్ని పార్టీలు కట్టుబడి ఉన్నాయి: మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి


గాంధీభవన్‌లో మీడియాతో మంత్రులు పొన్నం, వాకిటి

**హైదరాబాద్,సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో బలహీనవర్గాలకు సామాజిక న్యాయా అందించేందుకు కాంగ్రెస్ తోపాటు, బిజెపి బిఆర్ ఎస్ సిపిఎం, సిపిఐ, జనసమితి అన్ని పార్టీలు, కుల సంఘాలు కట్టుబడి ఉన్నాయని 42 శాతం రిజర్వేషన్లు కొనసాగించాడానికి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్‌కి వివాదం అప్పగించాలని తెలంగాణ రవాణశాఖ, బిసి సంక్షేమశాఖ, మంత్రి పొన్నం ప్రభాకర్,పశుసంవర్ధకం,క్రీడలు యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గాందీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా కుల సర్వే నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ , సబ్ కమిటీ వేసి కేబినెట్ లో చర్చించి శాసన సభలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు తో బిల్లు ఆమోదం పొందిందని గుర్తుచేశారు. గవర్నర్ ఆమోదం తర్వాత రాష్ట్రపతికి పంపినా అక్కడ ఆమోదంలభించలేదని దీనితో దేశం మొత్తం ఎంపీలతో కలిసి దిల్లీలో ఒత్తిడి కోసం అనే కార్యక్రమాలు తీసుకున్నామని మంత్రులు వివరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ఎవరికి అన్యాయం జరగదని వారు అన్నారు. ప్రామాణిక లెక్కల ప్రకారం ప్రజల అభిప్రాయం ప్రకారం ఇది అమలు చేయడం జరిగిందని చెప్పారు. 8 వ తేది కోర్టు వాదనలు వింటామనీ తెలిపారు. రాజకీయ పార్టీలు సుమోటో గా ఉండేలా మద్దతు ఇవ్వాలి. శాసన సభలో ఏకగ్రీవంగా మద్దతు తెలిపన పార్టీలు ఈనెల 8 వ తేది నుంచి జరుగబోయే వాద ప్రతివాదనలు సందర్భంగా హైకోర్టుకు అఫిడవిట్లు ఇవ్వాలని కోరారు. మంత్రులు కొండా సురేఖ,వాకిటి శ్రీహరి అన్ని పార్టీల అధ్యక్షులను కలుస్తామని తెలిపారు. రాజకీయ భేషజాలు పోము 10 ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు ఇచ్చినప్పుడు 50 కాప్ ఎత్తివేయడం జరిగిందని ఆయన తెలిపారు. అప్పుడే 50 శాతం పరిమితులు దాటిపోయాయి 9 వ తేది నుండి నోటిఫికేషన్ రాగానే నామినేషన్ లు స్టార్ట్ అవుతాయని మంత్రులు వివరించారు. బిజెపి బిసిసెల్ జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్ ను బహిరంగంగా అడుగుతున్న రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉన్న బిల్లు ఆమోదింపజేయాలని అనివారు అన్నారు. తెల్పండిసామాజిక న్యాయం పై రామచంద్ర రావు లాంటి వారు వ్యతిరేకిస్తున్న బిజెపి బిసిలు కలిసిరావాలని ఆయన కోరారు.



### ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు:

## మొదటి రోజు ముగిసిన విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు29:** పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలకు సంబంధించిన కేసుపై మొదటి రోజు స్పీకర్ విచారణ ముగిసింది. సోమవారం తన చాంబర్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి ఈ విచారణ కొనసాగింది. విచారణకు ఫిరాయింపు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి తోపాటు వారి తరఫు న్యాయవాదులు హాజరయ్యారు. వీరితో పాటు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు వీరి తరఫున న్యాయవాదులు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిటిషన్ దారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులకు మధ్య క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం స్పీకర్ ఈ విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో పలు ఆంక్షలు విధించారు. అక్టోబర్ >>2

# భారీ సినీపైరసీ గుట్టురట్టు


సోమవారం హైదరాబాద్‌లో చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ తదితర సినీ ప్రముఖులతో కలిసి సమీక్ష చేస్తున్న సివి ఆనంద్

### 500 సినిమాలు అక్రమంగా రికార్డు చేసిన ముఠా

### డిజిటల్ శాటిలైట్లు హ్యాక్ చేసి పైరసీ తయారీ

### ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఐసి వెబ్‌సైట్ హ్యాక్

### సిటీ కొత్వాల్ ఆనంద్ వెల్లడి

### చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ తదితర సినీ ప్రముఖులతో సిపి సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఈ స ందర్భంగా ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేయగా వీరి వద్ద నుంచి సినిమా పైరసీకి వాడిన పలురకాల ఉపకరణాలను, సెల్‌ఫోన్లను జప్తు చే శారు. దీనికి సంబంధించిన వివరాలను సిటీ పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్ సోమవారం మీడి యాకు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ ఐదవ తే దీన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, యాంటీ వీడియో పైరసీ సెల్ తరఫున అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా ఈ ముఠా గుట్టురట్టయ్యిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది మే తొమ్మిదవ తేదీన విడుదలైన సింగిల్, హిట్ థర్డ్ కేస్ సినిమాలు పైరసీకి గురైనట్లు ఆ ఫిర్యాదులో వుందని, ఈ రెండు సినిమాలు మొదటి రోజునే పైరసీకి గురైనట్లు తమ విచారణలో తేలిందని ఆయన తెలిపారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేస్తే థియేటర్లలోనే పైరసీ జరిగిందని నిర్ధారణ అయిందని ఆనంద్ తెలిపారు. దీంతో పాటు కుబేరా సినిమా కూడా పైరసీ అయ్యి ందని ఆయన తెలిపారు. ఈ ఘటనపై నాలుగు నెలల పాటు విచారణ సాగించచగా బిహార్‌లోని గుల్జార్ బాగ్‌కు చెందిన అశ్విని కుమార్ (21), తమి ళనాడులోని కరూర్ జిల్లా వెలుస్వామిపురం నివాసి సిరిల్ ఇన్ఫండ్ రాజ్ అమలదాస్ (32), ఇదే రాష్ట్రంలోని ఈరోడ్‌కు చెందిన సుధాకరన్ (31), వన స్థలిపురంలోని జాన కిరణ్ కుమార్ (29), గోవాకు చెందిన అర్సలాన్ అహ్మద్ (23)లు సూత్రధారులుగా తేలింది. ఈ ఐదుగురు మరికొందరితో క లిసి కొత్తగా విడుదలైన సినిమాలను మొదటి రోజునే థియేటర్లకు వెళ్లి హై ఎంట్ కెమెరా సెల్‌ఫోన్ల ద్వారా రికార్డింగ్ చేస్తారని, ఆ తరువాత వీటిని ఇతర ప్రాంతాలలో వుండే తమ అనుచరులకు పంపి టెలిగ్రామ్ ఛానల్స్, టొరెంట్స్‌ద్వారా నిమిషాల వ్యవధిలో >>2

### సహారా ఆస్తుల అమ్మకానికి

## సుప్రీంలో పిటిషన్!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** సహారా గ్రూప్ కంపెనీల భవిష్యత్తుకు సంబంధించి కంపెనీ పాలసీ మేకర్స్ ఈ గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహారాష్ట్రలోని అంబీ వ్యాలీ, లక్నోలోని సహారా సిటీతో సహ వివిధ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించడానికి అనుమతి కోరుతూ సహారా ఇండియా కమర్షియల్ కార్పొరేషన్ లిమిటెడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 14న విచారణ జరిగే అవకాశం ఉంది. న్యాయవాది గౌతమ్ అవస్థి దాఖలు ఈ పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబర్ 6 నాటి >>2


సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో కెటిఆర్

## 'స్థానిక' ఎన్నికల్లో

# మాదే గెలుపు

### అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ బాకీ పడింది: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు29:** తెలంగాణలో ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీదే గెలుపని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమ పార్టీ పూర్తి సన్నద్ధతతో ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు బాకీ పడిందని, వారి మోసాన్ని ప్రజల ముందు ఉంచేందుకే బాకీ కార్డులు తీసుకొచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తనదైన శైలిలో విమర్శలు చేశారు.కాంగ్రెస్ పాలనపై గ్రామాల్లోని రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉన్నాయని, ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఏ ఎన్నికలు ఎదురైనా బీఆర్ఎస్ విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలోని సబ్బండవర్ణాలు తిరిగి కేసీఆర్‌నే ముఖ్యమంత్రిగా >>2



క్రికెటర్ తిలక్ వర్మకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న అభిమానులు

## తిలక్ వర్మకు ఘనంగా స్వాగతం
### భారత్ టీంకు అభినందనలు తెలిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు29:** పాకిస్తాన్ తో జరిగిన ఆసియా క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్ లో అద్భుతమైన ప్రతిభ కనపరిచి ఇండియా ను గెలిపించిన తెలంగాణ ముద్దు బిడ్డ తిలక్ వర్మ కు బేగంపేట విమానాశ్రయం లో సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, సాట్ ఎం.డీ సోనీ బాలదేవి ఘనంగా స్వాగతం పలికారు. ఆసియా కప్ విజేత గా నిలిచిన భారత్ టీం కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. పాకిస్తాన్ తో జరిగిన ఫైనల్ మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠ రేపిందన్నారు. ఈ అద్భుత విజయం సాధించడం లో కీలక పాత్ర పోషించిన తిలక్ వర్మ అంతర్జాతీయ స్థాయి క్రికెట్ లో మన తెలంగాణ రాష్ట్రాని కి గొప్ప పేరు.. గౌరవం తెచ్చారని అభినందనలు తెలిపారు.

## ఆర్‌టిసి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వై నాగిరెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 29:** తెలంగాణ రోడ్డురవాణ సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) నూతన వైస్ చైర్మన్, అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి వై.నాగిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బస్ భవన్‌లోని ఎండీ కార్యాలయంలో పూర్వపు ఎండీ విసి సజ్జనార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారని ప్రజాసం బంధాల అధికారి తెలిపారు. ఎండిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నాగిరెడ్డిని ఆర్‌టిసిలోని పలుసంఘాల నేతలుకలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## సినీపైరసీ గుట్టురట్టు

>> పైరసీ సిడీల తయారు చేస్తున్నా రని ఆయన వెల్లడించారు. హై ఎండ్ కెమెరా సెల్‌ఫోన్లను తమ ప్యాంట్ జేబులో లేదా పాప్ కార్న్ ప్యాకెట్లలో వుంచి థియేటర్లలోకి తీసుకువెళతా రని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం అధునాతన యాప్‌ను నిందితులు వాడుతున్నారని ఆయన చెప్పారు. కాపీ రైట్ రక్షణ పొందిన సినిమాలను టొరెంట్లు, వెబ్ సైట్ల ద్వారా వీరు కాపీ చేయడంతో పాటు పంపిణీ చేస్తున్నారని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం టొరెంట్ వెబ్‌సైట్లు, టెలిగ్రాం ఛా నెల్స్, అక్రమ స్ట్రీమింగ్ వేదికలను వాడుతున్నారని ఆయన తెలిపారు. దీని తరువాత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్ నిర్వాహకులు తమ వేదిక లను వీటి ప్రచారానికి వాడుకునేందుకు అవకాశం ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితులు వ్యక్తిగత గుర్తింపును దాచడానికి వర్చువల్ మెషిన్లను ఉపయోగించి వైబ్‌సైట్‌లను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో ఒక నిందితుడైన సిరిల్ రాజ్ ఒక సర్వర్ హోస్టింగ్ కంపెనీ నుంచి పారిస్ లొకేషన్ గల రెండు ప్రత్యేక వర్చువల్ యంత్రాలను కొనుగోలు చేసి పైరేసీ వాడాడని ఆనంద్ తెలిపారు. దీనిని అన్ని పైరసీ సిని మాలను నిలువ చేయడానికి వాడుతున్నాడని, ఇందుకోసం తమిల్ బ్లాస్టర్ వెబ్‌సైట్‌తో పాటు టెలిగ్రామ్ అప్లికేషన్, జి మెయిల్ ఖాతాలు, ప్రోటాన్ మెయిల్ ఖాతాలు, విఎం వేర్ అను యాప్‌ను వాడారని ఆయన తెలిపారు. దీంతో పాటు డిజిటల్ మీడియా కంపెనీల ప్రధాన సర్వర్లను హ్యాక్ చే యడం ద్వారా స్టూడియో కాపీల నుంచి హెచ్‌డి సినిమాలను అక్రమంగా చలామణి చేస్తున్నారని ఆయన వెల్లడించారు. వీటిని కూడా బెట్టింగ్ యా ప్, ఆన్‌లైన్ గేమింగ్ నిర్వాహకులతో కలిసి అమ్ముకున్నారని ఆయన చెప్పారు. తమ నేరకలాపాలు బయటకు తెలియకుం డా వుండేందుకు నేరగాళ్లు వేరు వేరు యూజర్ ఐడిలతో వేరు వేరు టెలిగ్రామ్ ఛానెళ్లకు ఉపయోగించారని, ఇక పైరసీ సిడిలకు సంబంధించిన చెల్లింపులన్నీ క్రిప్టో కరెన్సీ ద్వా రా జరిగాయని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం క్రిప్టో ప్లాట్ పాంలను వాడారని ఆయన వెల్లడించారు. ఈ కేసులో అశ్విని కుమార్ కీలక నిందితు డు కాగా ఇతను సినిమాలు థియేటర్లలో విడుదల కాకముందే హెచ్‌డి క్వాలిటీలో లీక్ చేయడంలో సిద్ధహస్తుడని తేలిందని ఆయన తెలిపారు. ఇత ను అనేక సంస్థల డిజిటల్ మిడియా కంపెనీల ప్రధాన సర్వర్లను హ్యాక్ చేసి హెచ్‌డి సినిమాలను కాపీచేసి ఇతర టెలిగ్రామ్ వినియోగదారులకు పం పేవాడని ఆనంద్ చెప్పారు. ఈ క్రమంలో పైరసీ సినిమా గ్రూపులకు సంబంధించిన హెచ్‌డి మూవీస్ ఫిల్మీజ్‌యాప్, వరల్డ్ 4 ఫ్రీ అనే చట్ట వ్యతిరే కమైన సంస్థల్లో చేరాడని ఆయన తెలిపారు. మిగతా నలుగురు నిందితులు ఇతని సహచరులేనని ఆయన తెలిపారు. తమతో పాటు పైరసీలకు పా ల్పడే ఇతర ఆపరేటర్లతో కలిపి వ్యాపారం పెంచుకుంటున్నారని ఆయన తెలిపారు. సినిమాలను థియేటర్లో రికార్డు చేయడానికి ఒక్కో దానికి 150 రూపాయలను ఏజెంట్లకు ఇస్తుంటారని ఆనంద్ తెలిపారు. ఈ ముఠా 2020 నుంచి సుమారు 500 సినిమాలను పైరసీ చేసినట్లు తేలిందని ఆయ న తెలిపారు. దీనివల్ల ప్రధాన నిందితుడు రెండు కోట్ల రూపాయలను సంపాదించాడని కమిషనర్ తెలిపారు. దక్షిణాది భాషలతో పాటు తెలుగులో ఈ ముఠా 300కు పైగా సినిమాలను పైరసీ చేసినట్లు నిర్ధారణ అయ్యిందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోనే వంద సినిమాలను ఈ ముఠా పై రసీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ ముఠా నుంచి సినిమాలను పైరసీ చేసేందుకు వాడిప హై ఎండ్ సెల్‌ఫోన్లతో పాటు డిస్క్‌లు, లాప్‌టాప్‌లు, పెన్ డ్రైవ్‌లు, మెమరీ కార్డులు ఇంకొన్ని ఉపకరణాలను జప్తు చేసినట్లు ఆయన తెలిపారు.

కాగా సినిమాల పైరసీ వల్ల నిర్మాతల కష్టం వృధా అవుతుందని, దీనివల్ల మొత్తం చిత్రసీమ నష్ట పోతోందని ఆనంద్ తెలిపారు. 2023లో దేశ వ్యాప్తంగా చిత్ర పరిశ్రమ 22,400 కోట్ల రూపాయలను పైరసీ వల్ల నష్ట పోయిందని, ఇది చాలా తీవ్రమైన విషయమని ఆయన అన్నారు. 2024 లో తెలుగు సినీ పరిశ్రమ 3700 కోట్ల రూపాయలను నష్ట పోయిందని, వీటన్నింటిని దృష్టిలో వుంచుకుని పైరసీపై ఫిర్యాదు అందిన వెంటనే రం గంలో దిగి భిన్న కోణాల్లో విచారించి పెద్ద ముఠాను పట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ కేసులో 44 మంది అనుమానితులను విచారించిన త రువాత అసలు నిందితుల ఆచూకీ తెలిసిందని ఆనంద్ తెలిపారు. మరికొందరు పట్టుబడాల్సి వుందపి ఆయన తెలిపారు. తెలుగుకు సంబంధించి చాలా సినిమాలను అత్తాపూర్‌లోని మంత్ర థియేటర్‌లో సెల్‌ఫోర్ ద్వారా రికార్డ్ చేశారని, ఇందుకోసం పైరసీ చేసేందుకు అనువైన సీట్‌ను ముందు గానే బుక్ చేసుకునే వారని తమ విచారణలో తేలిందని ఆయన తెలిపారు. ఈ మఠా బోజ్‌పూరి, హిందీ సినిమాలను కూడా పైరసీ చేసిందని ఆయ న తెలి పారు. ఈ ముఠాకు చెందిన సిరిల్ సుధాకరన్‌కు నాలుగు బెట్టింగ్ యాప్ కంపెనీలు నెలకు తొమ్మిది లక్షల రూపాయలు జీతంగా ఇచ్చేవని ఆయన తెలిపారు. ఇతను ప్రతీనెల 15 సినిమాల ను పైరసీ చేసి బెట్టింగ్ యాప్ కంపెనీలకు పంపుతున్నాడని ఆయన తెలిపారు.

## శ్వేత సౌధం స్వర్ణమయం..
### ట్రంప్ విడియో వైరల్

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌ను 24 క్యారెట్ల బంగారు తాపడాలతో అలంకరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీస్, కేబినెట్ రూమ్‌లో భారీగా స్వర్ణ అలంకరణలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అందమైన భవనంగా పేరుపొందిన శ్వేతసౌధం ఇకపై అత్యుత్తమమైన భవనంగా ఇక్కడికి వచ్చిన విదేశీ నేతలను విస్తుపోయేలా చేస్తుందని తెలిపారు. కార్యాలయంలో అలంకరిస్తున్న మేలిమి అలంకరణల నాణ్యత, సౌందర్యం చూసి ఏ విదేశీ నాయకుడైనా ఆశ్చర్యపోతారన్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేయనున్న స్వర్ణ అలంకరణలకు సంబంధించిన విడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. విడియోలో బంగారు పూతతో ఉన్న డజన్ల కొద్దీ డిజైన్లు కనిపిస్తున్నాయి. వైట్‌హౌస్‌లో స్వర్ణ తాపడాలు చేయించడానికి ఉపయోగించిన బంగారం ఖర్చును ట్రంప్‌నే స్వయంగా భరించినట్లు వైట్‌హౌస్ ప్రతినిధి ఇటీవల పేర్కొన్నారు. అయితే ఎంత మొత్తంలో బంగారాన్ని వినియోగిస్తున్నారనే విషయాన్ని వెల్లడించలేదు. ఇప్పటికే ఓవల్ ఆఫీస్‌లో పలుచోట్ల స్వర్ణ తాపడాలు ఉన్నాయి. మిగిలిన చోట్ల కూడా బంగారంతో అలంకరించాలనే తన కోరికను ట్రంప్ పలుమార్లు బయటపెట్టారు.

## మాదే గెలుపు

>> కోరుకుంటున్నాయని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరి, కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తాము ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోయారన్న భ్రమల్లో కాంగ్రెస్ నేతలు ఉన్నారని కానీ ప్రజలకు అన్నీ గుర్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలను గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభయహస్తం ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. ఈ బాకీ కార్డే కాంగ్రెస్ పతనాన్ని శాసిస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడాపేర్చలేదని, కనీసం ఉన్న రోడ్లను కూడా సరిగా నిర్వహించడం లేదని విమర్శించారు.

### వారం - వర్జ్యం

30-09-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
అష్టమి సా.6.02
మూల ఉ.6.17
వర్జ్యం : సా.4.36-6.19
దు.ఉ.8.22-9.10, 2)రా.10.47-11.35
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భూ వివాదాలు తీరుతాయి

**వృషభం:** రాజకీయ, కళా రంగాల వారికి యోగదాయకం. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మిథునం:** గతం కన్నా వృద్ధి బాగుంటుంది. అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం :** ఆరోగ్యం వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం:**ఇంటాబయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యాపారాలలో లాభాలు.

**కన్య :** కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు. భూ వివాదాలకు దూరంగా ఉండండి

**తుల :** అమ్మకాలు కొనుగోలు సంబంధించిన వ్యవహారాలు స్తబ్దతగా ఉంటాయి.

**వృశ్చికం:**జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు.

**ధనుస్సు:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** ఆర్థికంగా కొంత వెనుకబాటు కనబడిన కనీస అవసరాలకు లోటు ఉండదు.

**కుంభం:**మిత్రలతోటి చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగులకు అనుకూలం.

**మీనం :** వివాదాస్పదమైన అంశాలను వదిలివేయడం మంచిదని గ్రహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 5 దశల్లో 'స్థానికం'

>> సుమారు 27 గ్రామ పంచాయతీలకు, 14 ఎంపీటీసీ స్థానాలకు హైకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం ఎన్నికలు జరగడం లేదని ఎస్ఈసీ తెలిపారు. మొత్తం 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డులు, 5,749 ఎంపీటీసీ స్థానాలు, మరియు 656 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామీణాభివృద్ధికి అత్యంత ముఖ్యమైనవి. ఎంపికైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం, గ్రామాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పారిశుద్ధ్యాన్ని నిర్వహించడం వంటి కీలక విధులను వీరు నిర్వహిస్తారు. ఈ ఎన్నికల ద్వారా గ్రామాల్లో రాజకీయ భాగస్వామ్యం పెరుగుతుంది. ఇటీవల ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం వలన, వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకులు కూడా పరిపాలనలో చురుకుగా పాల్గొనే అవకాశం లభించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంత ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించనున్నాయి.

**కోడ్ అమలు... రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే సీజ్**

ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. కోడ్ ముగిసే వరకు రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లడంపై ఆంక్షలున్నాయి. సరైన పత్రాలు లేని నగదును అధికారులు సీజ్ చేసి, ఐటీ అధికారులకు సమాచారం అందిస్తారు. ప్రజలు తగిన ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో మొత్తం ఐదు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియ నవంబర్ 11తో ముగుస్తుంది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆంక్షలు ఉంటాయి. ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు రవాణా అరికట్టేందుకు అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తారు. ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని, అనవసర ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నగదుకు సంబంధించిన తగిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్ల వంటి ముఖ్యమైన అవసరాలకు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు తప్పనిసరిగా సరైన ఆధారాలు వెంట ఉంచుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. అధికారులకు బ్యాంకు లావాదేవీల్లో నగదు డ్రా చేసిన అకౌంట్ పుస్తకం లేదా ఏటీఎం చీటి, వ్యాపార లావాదేవీల్లో వస్తువులు లేదా ధాన్యం విక్రయించిన డబ్బు అయితే దానికి సంబంధించిన బిల్లులు, ఆస్తి లావాదేవీల్లో భూమి విక్రయించిన సొమ్ము అయితే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు, వ్యాపారం లేదా సేవల ద్వారా వచ్చిన డబ్బు అయితే లావాదేవీల పూర్తి వివరాలు సమర్పించాల్సి ఉంటుంది.

## సహారా ఆస్తులు అమ్మకానికి సుప్రీంలో పిటిషన్!

>> టర్మ్ షీట్‌లో పేర్కొన్న నిబంధనలు, షరతులపై గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది సహారా గ్రూప్.

పెండింగ్‌లో ఉన్న సహారా గ్రూప్ కేసుల్లో దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తులో కోర్టు ఎప్పటికప్పుడు జారీ చేసిన వివిధ ఆదేశాలకు అనుగుణంగా అనుమతి పొందిన తర్వాత ఎస్ఐసీసీఎల్, సహారా గ్రూప్ కొన్ని చరాస్తులు, స్థిరాస్తుల అమ్మకాలను చాలా కష్టంతో చేయగలిగాయని తెలిపింది. ఈ నిధులను సెబీసహారా రీఫండ్ ఖాతాలో జమ చేశారు. మొత్తం రూ.24,030 కోట్ల ప్రిన్సిపల్ మొత్తంలో సహారా గ్రూప్ తన చరాస్తులు, స్థిర ఆస్తుల అమ్మకం, లిక్విడేషన్ ద్వారా సుమారు రూ.16వేల కోట్లు సేకరించి, సెబీసహారా రీఫండ్ ఖాతాలో జమ చేసింది అని తెలిపింది. ఎస్టేట్ బ్రోకరేజ్ కంపెనీల సేవలను ఉపయోగించినప్పటికీ సహారా గ్రూప్ ఆస్తులను లిక్విడేట్ చేయడం, విక్రయించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అసమర్థతను ఎత్తి చూపుతూ సెబీసహారా రీఫండ్ ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని చాలా కష్టంతో, దరఖాస్తుదారు, సహారా గ్రూప్ ప్రయత్నాల ద్వారా జమ చేశామని ఎస్ఐసీసీఎల్ తెలిపింది. నవంబర్ 2023లో సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ మరణం తర్వాత గ్రూప్ తన ఏకైక నిర్ణయాధికారిని కోల్పోయిందని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. ఆయన తన జీవితకాలంలో గ్రూప్ తరఫున అన్ని నిర్ణయాలు తీసుకున్నారని దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు సహారా గ్రూప్ రోజువారీ వ్యాపార కార్యకలాపాలు, నిర్వహణలో పాల్గొనలేదని అయితే పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాలనే కుటుంబ సభ్యుల కోరికను దృష్టిలో ఉంచుకుని సహారా గ్రూప్ ఆస్తులను సాధ్యమైనంత ఎక్కువ ధరకు విక్రయించాలని ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, సహారా గ్రూప్ బాధ్యతలను తీర్చాలని, ప్రస్తుత ధిక్కార చర్యలను ముగించాలని నిర్ణయించినట్లుగా పిటిషన్‌లో పేర్కొంది. వాటాదారుల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా సహారా గ్రూప్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఐసీసీఎల్ తెలిపింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ఆచరణీయమైన ఆఫర్లు లేకపోవడం, అనేక పెండింగ్ వ్యాజ్యాల కారణంగా ఈ ప్రయత్నాలు ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వలేదని ఇది సమష్టిగా కొనుగోలుదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని, ఆస్తుల మార్కెట్ సామర్థ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేసిందని తెలిపింది. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు, సహారా గ్రూప్, ఇతర సీనియర్ అధికారులపై బహుళ దర్యాప్తు సంస్థలు విచారణలు ప్రారంభించడం ద్వారా ప్రయత్నాలు మరింత క్లిష్టంగా మారాయని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. తాము పేర్కొన్నవన్నీ సమాంతర, సమన్వయం లేని చర్యలు పెట్టుబడిదారులు, డిపాజిటర్ల మనసులో గందరగోళం, విరుద్ధమైన కథనాలు, అవసరమైన అనుమానాలను సృష్టించడమే కాకుండా సహారా గ్రూప్ తన ఆస్తులను డబ్బు ఆర్జించడానికి, కోర్టు ఆదేశాలను పాటించడానికి చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుంటున్నాయని పిటిషన్‌లో పేర్కొంది.



సరూర్‌నగర్‌లో గిన్నెస్ అవార్డులతో మంత్రులు జూపల్లి, సీతక్క తదితరులు

# గిన్నెస్ బతుకమ్మ

>> సాధించడం పట్ల మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. 63 అడుగుల ఎత్తు 11 అడుగుల వెడల్పు 7 టన్నుల బరువుతో తీరొక్క పూలతో బతుకమ్మను ఏర్పాటు చేశారు. బతుకమ్మ చుట్టూ ఎనిమిది సర్కిల్లో మహిళలు బతుకమ్మ ఆడారు. 1354 మంది మహిళలు ఒకేసారి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆటలతో, పాటలతో అలరించారు. గతంలో 474 మందితో 11 మీటర్ల ఎత్తు బతుకమ్మ రికార్డు ఉండగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో 1354 మంది మహిళలు ఒకేసారి బతుకమ్మ ఆడగా 63 అడుగుల ఎత్తుతో తీరొక్క పూలతో బతుకమ్మను ఏర్పాటు చేయడంతో గిన్నిస్ వరల్డ్ బుక్కులో తెలంగాణ బతుకమ్మ రికార్డును సాధించింది. అదేవిధంగా లార్జెస్ట్ తెలంగాణ ఫోక్ డాన్స్ గా గుర్తింపు పొందింది. బతుకమ్మ ఆడేందుకు స్టేడియంకు వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే స్టిక్కరింగ్ ఉన్నవారికి మాత్రమే లోపటికి అనుమతించడంతో చాలామంది మహిళలు గేటు బయటే ఉండాల్సి వచ్చింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కౌ ష్ణారావు బయట ఉన్న మహిళలను కూడా లోపటికి పంపించాలని పోలీసులకు సూచించారు. కాగా బతుకమ్మ వేడుకలలో మంత్రి సీతక్క బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. తెలంగాణ సాంస్కౌతిక కళాకారిణి విమలక్క తన బృందంతో బతుకమ్మ పై పడిన పాట అందరిని ఆకట్టుకుంది. విమలక్క బతుకమ్మ పాట పాడుతుండగా ఆమెతో మంత్రి సీతక్క కూడా గొంతు కలిపి పాట పాడారు.

**గల్లీలో ఉన్న గరిట తిప్పిన మహిళలు లక్ష్యాన్ని సాధిస్తారు: మంత్రి సీతక్క**

గల్లీలో ఉన్న గరిటె తిప్పిన మహిళలు అన్ని రంగాలలో అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బతుకమ్మను గల్లీ నుంచి గ్లోబల్ వరకు తీసుకువెళ్లిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఏ విషయంలోనైనా లక్ష్యసాధన కోసం ఆకాశాన్ని చీల్చుకొని పోయే శక్తి ఒక్క మహిళకే ఉందన్నారు. గత రెండు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రణాళిక బద్ధంగా తీసుకున్న కార్యక్రమానికి వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రకౌతి పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం కౌషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ బతుకమ్మకు ప్రపంచస్థాయి అరుదైన రికార్డును సాధించగలిగామన్నారు.

**ఆడబిడ్డల ఐక్యతకు నిదర్శనం బతుకమ్మ: మంత్రి జూపల్లి**

ఆడబిడ్డల శక్తి ఐక్యతకు బతుకమ్మ నిదర్శనమని మంత్రి జూపల్లి కౌష్ణారావు పేర్కొన్నారు. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని తీరొక్క పూలతో మహిళలు బతుకమ్మ ఆడుతున్నారని తెలిపారు. బతుకమ్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పామన్నారు, ప్రకౌతిని, పూలను ప్రేమించే సంస్కౌతి తెలంగాణకు ఉందన్నారు. బతుకమ్మ వేడుకల విజయవంతనికి కౌషిచేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. బహుజన బతుకమ్మ పేరిట కళాకారుని విమలక్క పాడిన పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సాధించిన తెలంగాణ బతుకమ్మ సర్టిఫికెట్ను గిన్నిస్ బుక్ రికార్డు అధికారి శైలేష్ వేదికపై మంత్రులు సీతక్క, జూపల్లి కౌష్ణారావుకు అందజేశారు. గతంలో కంటే ఎత్తు, వెడల్పు, బరువుతో కూడిన బతుకమ్మ ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కువమంది మహిళలతో బతుకమ్మ ఆట ఆడి వరల్డ్ రికార్డు సృష్టించారని గిన్నిస్ బుక్ రికార్డు అధికారి శైలేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు బండ్రు శోభారాణి, నేరెళ్ల శారద, మల్ రెడ్డి రామ్ రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శోభన్ రెడ్డి, పర్యాటకశాఖ అధికారి క్రాంతి, గాయని గీతామాధురి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల తేదీల వివరాలు

| | |
|---|---|
| **ఎంపిటీసీ, జడ్పీటీసీ మొదటి విడత:** | |
| నామినేషన్ల స్వీకరణ: | అక్టోబర్ 9 |
| స్వీకరణకు చివరి తేదీ: | అక్టోబర్ 11 |
| పరిశీలన: | అక్టోబర్ 12 |
| ఉపసంహారణ: | అక్టోబర్ 15 |
| ఎన్నికల తేదీ : | అక్టోబర్ 23 |
| ఓట్ల లెక్కింపు: | నవంబర్ 11 |
| **ఎంపిటీ, జడ్పీటిసి ఎన్నికలు రెండో విడత** | |
| నామినేషన్ల స్వీకరణ: | అక్టోబర్ 13 |
| స్వీకరణకు చివరి తేదీ: | అక్టోబర్ 15 |
| పరిశీలిన: | అక్టోబర్ 16 |
| నామినేషన్ల ఉపసంహారణ: | అక్టోబర్ 19 |
| ఎన్నికల తేదీ: | అక్టోబర్ 27 |
| ఓట్ల లెక్కింపు: | నవంబర్ 11 |
| **గ్రామపంచాయితీ మొదటి విడత** | |
| నామినేషన్ల స్వీకరణ: | అక్టోబర్ 17 |
| స్వీకరణ చివర తేదీ: | అక్టోబర్ 19 |
| పరిశీలన: | అక్టోబర్ 20 |
| ఉపసంహారణ: | అక్టోబర్ 23 |
| ఎన్నికలు, ఫలితాలు: | అక్టోబర్ 31 |
| **గ్రామ పంచాయితీ ఎన్నికలు 2 విడత** | |
| నామినేషన్ల స్వీకరణ: | అక్టోబర్ 21 |
| చవరి తేదీ: | అక్టోబర్ 23 |
| పరిశీలన: | అక్టోబర్ 24 |
| ఉపసంహారణ: | అక్టోబర్ 27 |
| ఎన్నికలు, ఫలితాలు: | నవంబర్ 4 |
| **గ్రామం పంచాయితీ ఎన్నికలు 3వ విడత** | |
| నామినేషన్ల స్వీకరణ: | అక్టోబర్ 25 |
| చవరి తేదీ: | అక్టోబర్ 27 |
| పరిశీలన: | అక్టోబర్ 28 |
| ఉపసంహారణ: | అక్టోబర్ 31 |
| ఫలితాల విడుదల: | నవంబర్ 8 |

## ముగిసిన విచారణ

>> 1న మరో నలుగురి పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంబంధించిన విచారణ జరగనుంది. బిఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌కు బిఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నెలలు గడుస్తున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ.. సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం కీలక ఆదేశాల జారీ చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తాము పార్టీ మారలేదంటూ అఫిడవిట్ల పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులూ వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు నాలుగు రోజులు ఎమ్మెల్యేల విచారణ కొనసాగనుంది. దీనిలో భాగంగా మొదటి రోజు విచారణ ముగిసింది. కాగా, విచారణ అనంతరం స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా..? లేదా సుప్రీంకోర్టును మరికొంత సమయం కోరుతారా..? అనేది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## భారతీయ సినిమాలపై 100% సుంకాలు

>> అమలుకానున్నాయి. 'మా సినిమా నిర్మాణ వ్యాపారాన్ని అమెరికా నుంచి ఇతర దేశాలను ఓ శిశువు నుంచి మిఠాయిని తొలగించినట్లుగా దొంగిలించాయని ఆయన ఆరోపించారు. బలహీనమైన, అసమర్థ గవర్నర్‌తో ఉన్న కాలిఫోర్నియా ముఖ్యంగా తీవ్రంగా దెబ్బతింది అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఈ దీర్ఘకాల, ఎప్పటికీ అంతం కాని సమస్యను పరిష్కరించడానికి తాను అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై 100శాతం సుంకం విధించనున్నట్లు పేర్కొన్నారు. విదేశీ సినిమాలతో అమెరికన్ సినిమా పరిశ్రమకు 'జాతీయ ముప్పు'గా ట్రంప్ భావిస్తూ ట్రంప్ మే ఇలాంటి ప్రకటన చేశారు. ఇదిలా ఉండగా.. గతంలో ట్రంప్ అమెరికాలో షూటింగ్ జరుపుకోని సినిమాలపై ఏకంగా వందశాతం సుంకాలు విధించనున్నట్లు గతంలో ప్రకటించారు. పలువురు నిర్మాతలతో హాలీవుడ్ నష్టపోతుందన్న ట్రంప్ విదేశాల్లో చిత్రీకరణ జరిపి అమెరికాలో రిలీజ్ అయ్యే చిత్రాలపై వెంటనే 100 శాతం సుంకాలను విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంటే వాణిజ్యమంత్రికి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా చలన చిత్ర పరిశ్రమను పునరుద్ధించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సమయంలో ట్రంప్ ప్రకటించారు. అయితే, చాలాదేశాలు అమెరికన్ స్టూడియోలు, చిత్రనిర్మాతలను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ఇది అమెరికా ఆర్థిక, జాతీయ భద్రతకు ముప్పు కలిగించడమేనని ట్రంప్ అన్నారు. అమెరికన్ సినిమా ఇండస్ట్రీ చాలా వేగంగా తగ్గుతోందని మళ్లీ అమెరికా గడ్డపై సినిమాల షూటింగ్ జరగాల్సి న రోజులు రావాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో సినిమా, టెలివిజన్ నిర్మాణం హాలీవుడ్ నుంచి యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలకు తరలిపోతున్నాయి.

**WARORA-KURNOOL TRANSMISSION LIMITED**
Warangal New S/s, Zaffergadh Mandal, Jangaon, Telangana- 506 252.
(Tel: +911204247182), CIN: U40300GJ2015PLC156122
**NOTICE FOR EXTENSION**
Warora-Kurnool Transmission Limited invites bids against enquiry no. **MDF/OPGW/25-26/0925** for the following package: **"Appointment of an agent to monetize dark fiber in the Optical Ground Wire infrastructure under a unified initiative"**
The due date for submission has been extended from 30.09.2025, 11.00 Hrs. to 15.10.2025, 11.00 Hrs. Bidders are advised to visit the Tenders section of www.zrc-in.com regularly for updates, addenda, or corrigenda. No separate notification shall be issued in this regard. The bid documents will be made available to interested bidders via e-mail- tenders@zrc-in.com.

# కరూర్ ఘటనపై నిజనిర్ధారణకు ఎన్డీయే కమిటీ

కరూర్, సెప్టెంబరు 29: తమిళనాడులోని కరూర్ లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ర్యాలీలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటన రాజకీయ రంగు పులుముకుంది. ఎన్నికల ప్రచారం కోసం నిర్వహించిన విజయ్ ర్యాలీపై మరోపక్క ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. విజయ్‌తోపాటు ఆయన సహాయకులు ఇద్దరు, పార్టీ ప్రధాన కార్యదర్శులపైనా కేసులు నమోదు చేసి సమగ్ర దర్యాప్తుచేస్తామని డిఎంకె ప్రభుత్వం ప్రకటించింది. మరోపక్క కేంద్రంలోని ఎన్డీయే కూడా దృష్టి సారించింది.

ఈ దుర్ఘటనకు దారి తీసిన పరిస్థితులు, వాస్తవాలను వెలికితీసేందుకు 8 మంది ఎంపీలతో కూడిన ఉన్నతస్థాయి నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని నాయకత్వం వహించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం ఈ కమిటీని ప్రకటించారు. ఈ బృందంలో మిత్రపక్షాలైన టీడీపీ, శివసేన పార్టీల ఎంపీలకు కూడా స్థానం కల్పించారు. టీడీపీ తరఫున ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, శివసేన నుంచి శ్రీకాంత్ షిండే సభ్యులుగా వ్యవహరించనున్నారు.

వీరితో పాటు కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, తేజస్వి సూర్య, బ్రిజ్ లాల్, అపరాజిత సారంగి, రేఖా శర్మ వంటి బీజేపీకి చెందిన సీనియర్ ఎంపీలు కూడా ఈ కమిటీలో ఉన్నారు. కరూర్ లో జరిగిన విజయ్ సభకు భారీగా జనం తరలిరావడంతో తొక్కిసలాట జరిగి, సుమారు 40 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో, ఎన్డీయే ఏర్పాటు చేసిన ఈ బృందం త్వరలోనే కరూర్ లో పర్యటించనుంది. క్షేత్రస్థాయిలో పర్యటించి, బాధితులు, స్థానిక అధికారులతో మాట్లాడి సమగ్ర వివరాలు సేకరించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందచేయనుంది.

## టివికె చీఫ్ విజయ్ ఇంటికి బాంబు బెదరింపు

### విద్యుత్ సరఫరా నిలిపివేయాలని టివికె పార్టీయే కోరింది: విద్యుత్ శాఖ

**విజయ్ ఇంటికి బాంబు బెదరింపులు**

కరూర్‌ర్యాలీలో జరిగిన తొక్కిసలాట వల్ల 41 మంది మృతిచెంది 50 మందికిపైగా మృతిచెందిన సంఘటన తమిళనాట రాజకీయపార్టీల్లో ఉద్రిక్తతలకు చోటిచ్చింది. మరోపక్క టివికెచీఫ్ విజయ్‌కి బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. నీలంకరైలోని విజయ్ నివాసానికి సోమవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో చెన్నై పోలీసులు అలర్ట్ అయ్యారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో టీవీకే చీఫ్ నివాసానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ విస్తృత తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులూ, పేలుడు పదార్థాలూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తొక్కిసలాట ఘటన అనంతరం విజయ్‌కి బాంబు బెదరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. కరూర్ జిల్లాలో టీవీకే ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట అంశం రాజకీయపరంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీని వెనుక కుట్ర కోణం ఉందని, అంతేకాదు కొద్దిసేపు కరెంటు కూడా పోయిందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై తమిళనాడు విద్యుత్ బోర్డు స్పందించింది. విజయ్ ర్యాలీ సందర్భంగా తాత్కాలికంగా విద్యుత్ నిలిపివేయాలని టీవీకే పార్టీ నుంచి తమకు లేఖ అందిందని తమిళనాడు విద్యుత్ బోర్డు చీఫ్ ఇంజినీర్ రాజలక్ష్మి తెలిపారు. ఈనెల 27న ఈరోడ్ రోడ్డు లోని వేలుచామిపురం వద్ద భారీ జనసమూహం ఉంటుందని పేర్కొంటూ టీవీకే నుంచి లేఖ అందినట్లు చెప్పారు.

# సద్దుల బతుకమ్మకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 29: ప్రకృతిని.. పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తీరొక్క పూలతో తయారు చేసిన ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆట పాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు తెలంగాణ సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని అన్నారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు రాష్ట్రమంతటా అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. బతుకమ్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి, సరూర్ నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో ప్రభుత్వం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుందని సిఎం అన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని .. చెరువులు, కుంటలను పదిలంగా కాపాడి భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందిస్తుందని.. అందుకే అంబర్‌పేట్ లో బతుకమ్మ కుంటను పునరుద్ధరించిందని గుర్తుచేశారు.

# డిజిపి జితేందర్ నేడు పదవీవిరమణ

## 14 నెలల సర్వీసులో వినూత్న పథకాల అమలు

### ఎస్‌హెచ్‌ఓలతో నేరుగా వరుస భేటీలు

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త: రాష్ట్ర డిజిపి జితేందర్ మంగళ వారం పదవీవిరమణ చేయనున్నారు. గత యేడాది జూలై 10న డిజిపిగా నాటి డిజిపి రవి గుప్తా స్థానంలో నియమించబడడం తెలిసిందే. అప్పటి నుంచి 14 నెలలపాటు డిజిపి పదవీలో కొనసాగిన జితేందర్ స్వల్పవ్యవధిలో వినూత్న ఆలోచనలతో పోలీసు శాఖను పరుగుతీయించారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా స్టేషన్ హౌస్‌ఆఫీసర్లతో డిజిపి జితేందర్ అనేకమార్లు తన కార్యాలయంలో భేటీ అయి ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. ఇదే సమయంలో అన్ని జిల్లాల్లోనూ డిజిపి పర్యటనలు చేబట్టి అక్కడి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతల నిర్వహణ, నేరాల నివారణకు సంబంధించి అనేకసార్లు సమావేశాలు నిర్వహించి అధికారులను పరుగులు తీయించారు. కాగా డిజిపిగా జితేందర్ చివరిరోజు మంగళ వారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తన కార్యాలయంలోనే ఉంటారని సమాచారం. సాయంత్రం నాలుగు లేదా ఐదు గంటల సమయంలో జితేందర్‌కు ఘనంగా డిజిపి కార్యాలయ అధికారులతోపాటు సీనియర్ ఐపిఎస్ అధికారులు ఘనంగా వీడ్కోలు ఇవ్వనున్నారు. ఇదే సమయంలో పూలతో అలంకరించిన జీపులో డిజి కార్యాలయ గేటు వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఈ జీపును తాళ్లతో పోలీసు ఉన్నతాధికారులు లాగుతారు. మామూలుగా అయితే డిజిపిగా పదవీ విరమణ చేసిన అధికారి స్థానంలో కొత్త డిజిపి అదేరోజున పదవీస్వీకారం చేయడం ఆనవాయితీ. కానీ చాలాకాలం తరువాత కొత్త డిజిపిగా నియమితులైన నిఘా విభాగం బాస్ బత్తుల శివధర్‌రెడ్డి అక్టోబరు 1న బాధ్యతలు చేపట్టనున్నారు. అప్పటి వరకు ఇన్‌ఛార్జి డిజిపిగా మరో సీనియర్ ఐపిఎస్ అధికారి వ్యవహరించనున్నారు.

# అభివృద్ధి మంత్రంతోనే ముందుకువెళ్తున్న ఎన్డీయే

## ఢిల్లీలో బిజెపి కార్యాలయ ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దేశంలో సుపరి పాలన అందిస్తోందని, అభివృద్ధి, వారసత్వం అనే మంత్రంతో ముందుకు సాగుతోందని ప్రధాని మోడీ అన్నారు. భావితరం జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలకు సామాన్య ప్రజలకు చేరాలా చూడాలని పార్టీ కార్యకర్తలను ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. సోమవారం దిల్లీలో బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన తమ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం అధికారం కోసం కాదు, సేవ కోసం ఉంది. పార్టీ కార్యాలయాలు ఈ భావనను సజీవంగా ఉంచుతాయి. మా పార్టీ, మా ప్రభుత్వం దేశం, ప్రజల భద్రతకు ప్రాధా న్యత ఇచ్చింది. అవినీతికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరాటం చేస్తూ, దేశాన్ని మోసాల నుంచి, భారీ కుంభకోణాల నుంచి విముక్తి చేశామని ప్రధాని మోడీ అన్నారు. ప్రభుత్వం సామాన్య ప్రజల పొదుపును పెంచడంపై దృష్టి సారించింది. అందుకే జీఎస్టీ 2.0తో ప్రజలపై పన్నుల భారం తగ్గించాం. 2014లో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రూ.2 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉంటే, పన్ను విధించేవారు. కానీ ఇప్పుడు రూ.12 లక్షల ఆదాయంపై కూడా పన్ను సున్నా అని మోడీ అన్నారు. 2014కు ముందు ఒక సాధారణ కుటుంబం ఒక సంవత్సరంలో తన రోజువారీ అవసరాల కోసం వార్షికంగా రూ.1 లక్ష ఖర్చు చేస్తే, అందులో దాదాపు రూ.25వేలు పన్ను రూపంలో చెల్లించాల్సి వచ్చేది. కానీ మేము వచ్చిన తరువాత జీఎస్టీని ప్రవేశపెట్టాం. దీనితో వస్తు, సేవల ధరలు తగ్గాయి. ఇకపై ఏడాదికి రూ.1 లక్ష ఖర్చు చేస్తే పన్నుల భారం కేవలం రూ.5000 రూ.6000 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను సామాన్య ప్రజలకు చేరాలా చూడాలని పార్టీ కార్యకర్తలను కోరుతున్నానని మోడీ కోరారు. దేశ రాజధానిని మినీ ఇండియాగా ప్రధాని మోడీ అభివర్ణించారు. అందుకే ఇక్కడి ప్రజలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే ప్రతి పండుగలను జరుపుకోవాలని సూచించారు. ఢిల్లీతో బీజేపీ సంబంధాలు ప్రజల మనోభావాలు, నమ్మకంపై ఆధార పడి ఉన్నాయని మోడీ అన్నారు. జన్‌సంఘ్ రోజుల నుంచి తమ పార్టీ దిల్లీ నగరం కోసం పని చేస్తోందని ఆయన అన్నారు. భారతీయ జనతా పార్టీ స్థాపించి ఇప్పటికి 45 సంవత్సరాలు పూర్తయ్యింది. అటల్‌బిహారీ వాజ్‌పేయీ, అద్వాణి, నానాజీ దేశ్‌ముఖ్, రాజమాత విజయరాజే సింధియా, మురళీ మనోహర్ జోషి లాంటి అసంఖ్యాక వ్యక్తుల ఆశీస్సులు, కృషితోనే ఈ పార్టీ



ముందుకు సాగింది. 1951 అక్టోబర్‌లో నాటిన బీజేపీ పార్టీ అనే విత్తనం ఇప్పుడు మహా మర్రి చెట్టుగా మారింది. ఆ సమయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నాయకత్వంలో జనసంఘ్ స్థాపించబడింది. అప్పుడు దిల్లీ జనసంఘ్‌కు వైద్య గురుదత్ మొదటి అధ్యక్షుడుగా పనిచేశారు. ఇప్పుడు మనం కొత్త కలలు, కొత్త తీర్మానాలు చేసుకోవాల్సిన సమయం. బీజేపీ కార్యకర్తలకు నా హృదయపూర్వక అభినందనలు. మన బీజేపీ ప్రభుత్వం ఉన్నది అధికారం కోసం కాదు. ప్రజాసేవ కోసం. మన పార్టీ కార్యాలయాలు ఈ భావ నను సజీవంగా ఉంచుతాయని ప్రధాని మోడీ అన్నారు.

# సిటీ కొత్వాల్‌గా సజ్జనార్ నేడు పదవీస్వీకారం

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త: హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమితులైన విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ మంగళ వారం ఉదయం బాధ్యతలు చేబట్టనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్‌లో గల కమిషనర్ కార్యాలయంలో కొత్వాల్ ఆనంద్ నుంచి సజ్జనార్ బాధ్యతలను స్వీకరిస్తారు. అనంతరం సిటీ పోలీసు అధికారులతో భేటీ అవుతారు.

# బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్ తేదీలు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త: బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్ తేదీలు పొడగిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్ గడువు తేదీ సెప్టెంబర్ 30 వరకు ఉండగా వాటిని అక్టోబర్ 5వరకు పొడగించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ, సినీ రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఇందుకు సంబంధించిన బహుమతి ప్రధాన కార్యక్రమం అక్టోబర్ 9న శిల్పకళావేదికలో జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 8125834009ను సంప్రదించాలని కోరారు.

# నేడు మరో రూ.4 వేల కోట్ల రుణం

## ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్ల వేలం

### వార్షిక రుణ ప్రణాళికలో 92 శాతం సేకరణ

### ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని పెంచాలని కోరిన సర్కార్

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త : తెలంగాణ సర్కార్ వచ్చే వారం మరో రూ.4 వేల కోట్లు రుణం సేకరించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్ ఇండెంట్ పెట్టింది. ఈ నెల 30వ తేదీన రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో ఆన్‌లైన్ వేదికగా ఈ-కుబేర్ ప్లాట్‌ఫామ్‌లో జరగనున్న వేలంలో రూ.4 వేల కోట్లను సమీకరించనుంది. దీంతో ఈ నెలలో తెలంగాణ మార్కెట్ రుణాలు రికార్డు స్థాయిలో రూ.16 వేల కోట్లకు చేరుకోనున్నాయి. రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఒకే నెలలో ఇంత పెద్ద మొత్తంలో రుణం తీసుకోవడం ఇదే అత్యధికం. ఇక ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ పరిమితిలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 92 శాతం మేర రుణాలు సేకరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం ఆరు నెలల్లో ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకూ రూ.49,900 కోట్లు అప్పుగా తీసుకుంది. దీంతో కేంద్రం నిర్ణయించిన వార్షిక పరిమితి రూ.54,009 కోట్ల కింద, 2025-26లో మిగిలిన ఆరు నెలలకు గాను రాష్ట్రానికి కేవలం రూ.4,109 కోట్ల రుణం మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇంకా మరో 6 నెలలు మిగిలి ఉండగా ఆయా నెలల్లో సేకరించాల్సిన రుణాల పరిస్థితి ఏమిటనేది సర్కార్ ముందు పెద్ద సవాల్ కానుంది. ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం)కు లోబడి రుణాలు సేకరించాలనే నిబంధన ఉండగా, అదనపు రుణాలు సేకరించేందుకు కేంద్రం ఎంత వరకూ అనుమతిస్తుందనేది ఆర్థిక శాఖలో అంతర్మథనం జరుగుతోంది. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలసి తమకు ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని పెంచాలని విజ్ఞప్తి చేసింది. కాగా రోజు రోజుకు సర్కార్ ఖజానాకు ఆదాయం తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరులైన జీఎస్టీ, ల్యాండ్ రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, సేల్ టాక్స్, ఎక్సైజ్ ఆదాయం గడిచిన నాలుగు నెలల్లో పెరగకపోగా తగ్గుతూ వస్తుండటం సర్కార్‌కు మరింత గుదిబండగా మారింది. ప్రస్తుత 2025-26లో ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలలకు రాష్ట్ర ఖజానాకు 74,955 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరింది.

# బిసి రిజర్వేషన్ల చట్టం ఆమోదానికి గవర్నర్‌ను ఒప్పించండి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలిసిన జాజుల బృందం

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త: అసెంబ్లీలో బిల్లు, చట్టం చేసిన బిసి రిజర్వేషన్లు 42 శాతం చట్టాన్ని ఆమోదింప చేసేలా గవర్నర్‌ను ఒప్పించేలా బిజెపి నేతలు చూడాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని సోమవారం బిసి సంక్షేమ సంఘం నేతలు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావును కలిసి అందజేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని రాష్ట్ర గవర్నర్‌కు పంపి నెల రోజులు గడుస్తున్నప్పటికీ, నేటి వరకు ఆమోదించ లేదన్నారు. దీని వలన బిసి రిజర్వేషన్లలకు రిజర్వేషన్ వ్యతిరేకుల మూలంగా నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. అలా జరగకుండా ఉండాలంటే రాష్ట్ర గవర్నర్ బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడానికి బిజెపి పార్టీ తరఫున జోక్యం చేసుకొని తక్షణమే గవర్నర్‌తో బిజెపి ప్రతినిధుల బృందం భేటీ కావాలని శ్రీనివాస్ గౌడ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావుకు విజ్ఞప్తి చేశారు. బిసి రిజర్వేషన్లు పెంచడానికి రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బిల్లుకు, అదేవిధంగా అసెంబ్లీలో చేసిన చట్టానికి బిజెపి పార్టీ భేషరతుగా మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అసెంబ్లీలో చేసిన చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపితే బిసి రిజర్వేషన్ల చట్టానికి రాజ్యాంగ చట్టబద్ధత దొరుకుతుందన్నారు. అందుకోసం బిజెపి పార్టీ తరఫున ప్రతినిధుల బృందం తక్షణమే కలిసి గవర్నర్‌పై ఒత్తిడి పెంచి బిసి రిజర్వేషన్లకు ఆమోదం తెలిపేలా కృషి చేయాలన్నారు. బిసి రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్9ని విడుదల చేసిందని, ఈ జీవోను సవాల్ చేస్తూ రెడ్డి జాగృతికి చెందిన కొంతమంది వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని హైకోర్టులో బిసి రిజర్వేషన్ల కేసు విచారణ సందర్భంగా గవర్నర్ ఆమోదం లేకుండా జీవో నెంబర్9 ఎలా విడుదల చేశారని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిందని పేర్కొన్నారు. బిసి సంఘాలు ఇచ్చిన వినతిని రాష్ట్ర పార్టీ కోర్ కమిటీలో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకొని గవర్నర్‌ను కలిసే ప్రయత్నం చేస్తామని, బిసి రిజర్వేషన్ల చట్టం అమలు జరగడానికి తమ పార్టీ తరఫున కృషి చేస్తామని బిసి ప్రతినిధి బృందానికి రామచందర్ రావు హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శుల బిల్లులు రూ.104 కోట్లు విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల కోసం ఒకేసారి భారీ మొత్తంలో నిధులను విడుదల చేసింది. పంచాయతీ కార్యదర్శుల బిల్లుల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం రూ. 104 కోట్లు విడుదల చేసింది. దీంతో పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అయ్యాయి. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో ఈ ఎప్పుడూ లేని విధంగా ఒకే విడతలో ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేసింది. ఈ చర్యతో పంచాయతీ కార్యదర్శులపై ఉన్న ఒత్తిడి తగ్గి ఊరట లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెంటనే స్పందించి రూ. 104 కోట్లు విడుదల చేశారు. ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేయడం పంచాయతీ వ్యవస్థ పటిష్టతకు దోహదం చేస్తుంది' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.


**WARORA-KURNOOL TRANSMISSION LIMITED**
Warangal New S/s, Zaffergadh Mandal, Jangaon, Telangana- 506 252.
(Tel: +911204247182), CIN: U40300GJ2015PLC156122

**NOTICE FOR EXTENSION**

Warora-Kurnool Transmission Limited invites bids against enquiry no. **MDF/OPGW/25-26/0925** for the following package: **"Appointment of an agent to monetize dark fiber in the Optical Ground Wire infrastructure under a unified initiative"**
The due date for submission has been extended from 30.09.2025, 11.00 Hrs. to 15.10.2025, 11.00 Hrs. Bidders are advised to visit the Tenders section of www.zrc-in.com regularly for updates, addenda, or corrigenda. No separate notification shall be issued in this regard. The bid documents will be made available to interested bidders via e-mail- tenders@zrc-in.com.



WONDER HOME FINANCE Zindagi Ki Perfect Shuruaat
**Wonder Home Finance Limited**
(U65999RJ2017PLC059619)
**Registered Office:** 620, 6th Floor, North Block, World Trade Park JLN Road, Malviya Nagar, Jaipur, Rajasthan 302017
**Contact:** 0141-3110201, +91 80556 00700
**Email:** hello@wonderhfl.com | **Website:** www.wonderhfl.com

**బ్రాంచ్ ఆఫీస్ తరలింపు కోసం పబ్లిక్ నోటీసు**

వండర్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (WHFL) ప్రజలకు తెలియజేయుచున్నది ఏమనగా, 1వ అంతస్తు, B-6-3-653, ఎన్జీఓల కాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070 లో ఉన్న మా కార్యాలయం 2025 డిసెంబర్ 31 నుండి శాశ్వతంగా మూసివేయబడుతుంది. ఆపరేషనల్ రీయలైన్మెంట్ కారణంగా, మా శాఖ క్రింది కొత్త చిరునామాకు మార్చబడుతుంది: ప్లాట్ నం. 491, రోడ్ నం. 6, వైదేహినగర్, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070, 2025 డిసెంబర్ 31 నుండి అమల్లోకి వస్తుంది. ఋణ సంబంధిత సేవల కోసం మా వెబ్సైట్ www.wonderhfl.com సందర్శించండి. ఏవైనా సహాయం లేదా వివరణ కోసం మా కస్టమర్ కేర్ హెల్ప్లైన్ 1800-102-1002 కు కాల్ చేయండి లేదా Hello@wonderhfl.com / customer.care@wonderhfl.com కు ఇమెయిల్ చేయండి

అధీకృత అధికారి
తేదీ: - 30.09.2025 వండర్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్.


# ప్రజాకేంద్రీకృత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

## వీడ్కోలు సభలో డిజిపి జితేందర్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త: పోలీసు వ్యవస్థ పటిష్టంగా వుండి ప్రజల మన్ననలు పొందాలంటే ప్రజా కేంద్రీకృత పోలీసింగ్ (సిటీజన్ సెంట్రిక్ పోలీసింగ్)కు ప్రాధాన్యతను ఇవ్వాలని డిజిపి జితేందర్ అన్నారు. మంగళవారం నాడు పదవీ విరమణ చేయనున్న డిజిపి జితేందర్‌కు సోమవారం డిజిపి కార్యాలయంలో మినిస్ట్రియల్ స్టాఫ్ అసోసియేషన్ వీడ్కోలు సభను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమ ంలో డిజిపి మాట్లాడుతూ రాష్ట్ర డిజిపిగా 14 నెలల పాటు పనిచేసినందుకు గర్వపడుతున్నానని, విధి నిర్వహణలో తాను ప్రజా కేంద్రీకృత పోలీసి ంగ్‌కు ప్రాధాన్యతనిచ్చానని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీసులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం వల్ల చాలా వరకు సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అయ్యాయని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే ఇండియా జస్టిస్ రిపోర్టు ప్రకారం తెలంగాణ పోలీసు



దేశంలో నే మొదటి స్థానంలో వుందని, ఇది మనందరికి గర్వకారణమని ఆయన అన్నారు. ఇది భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. తెల ంగాణలో పోలీసులు అకుంటిత దీక్షతో పనిచేస్తూ అన్ని కేటగిరిల్లో మెరుగైన ఫలితాలను అందుకోవడం గర్వంగా వుందని ఆయన తెలిపారు. శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ మాట్లాడుతూ డిజిపి జితేందర్ నుంచి అనేక విషయాలను తాను నేర్చుకున్నానని తెలిపారు. విధినిర్వహణలో క్యూ ఆర్ కోడ్, ఫీడ్ బ్యాక్ వంటి పలు పథకాలు డిజిపి జితేందర్ హయాం లో విజయ వంతంగా అమలై అందరి మన్న నలను అందుకుందని ఆయన తెలి పారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోన్ ఐజి చంద్ర శేఖర్ రెడ్డి, ఐజిపిలు రమేష్, రమేష్ నాయుడు, శ్రీనివాసులు, డిఐజి తఫ్సీర్ ఇక్బాల్, సిఐడి ఎస్‌పి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పోలీసు అకాడెమీలో నేడు డిజిపికి ఘనంగా వీడ్కోలు సభ**

ఇదిలావుండగా డిజిపిగా పదవీ విరమణ చేస్తున్న జితేందర్‌కు మంగళవాకం ఉదయం శివార్లలోని హిమాయత్‌సాగర్‌లో గల రాష్ట్ర పోలీసు అకాడమిలో సాయుధ పోలీసులతో ఘనంగా వీల్కోలు కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో నూతర డిజిపి శివధర్ రెడ్డితో పాటు పోలీసు అకాడ మి డైరక్టర్ అభిలాష్ బిస్త్ సహా సీనియర్ పోలీసు అధికారులు పాల్గొననున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలకు కేంద్రం నిధులు

## 712 పిఎంశ్రీ స్కూళ్లకు రూ. 71.20 లక్షలు విడుదల

### డిఇఒలకు ఆదేశాలు జారీ చేసిన పాఠశాల డైరెక్టర్ నవీన్‌నికోలస్

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త: రాష్ట్రంలోని పిఎంశ్రీ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రాష్ట్రంలోని 712 పిఎంశ్రీ పాఠశాలల్లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడానికి ఒక్కో పాఠశాలకు రూ. 10వేలను ఖర్చు చేయడానికి అనుమతిస్తూ పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ డిఈవోలకు జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. తెలంగాణలో పెద్ద పండుగకు జరుపుకోవడమే కాకుండా.. 9 రోజులపాటు జరిపే పూల పండుగైన బతుకమ్మ సంబరాలకు మొదటిసారిగా కేంద్రం నిధులు విడుదల చేసింది. ప్లానింగ్ అప్రూవల్ బోర్డు(పిఏబి)లో అప్రూవల్ చేసిన అనంతరం నిధులను విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలోని పిఎంశ్రీ పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబురాలను నిర్వహించనుంది. 712 పిఎంశ్రీ పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను నిర్వహించి.. అనంతరం బిల్లులను తీసుకోవాలని డిఈవోలకు డైరక్టర్ సూచించారు. రూ. 10 వేల్లో రూ. 3000 పూల అలంకరణకు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ. 2000, సాంప్రదాయ దుస్తులు, సాధనాల కోసం రూ. 1500, డాక్యుమెంటేషన్ ఇతర అవసరాలకు రూ. 1500, స్నాక్స్ కోసం రూ. రూ. 2000 ఖర్చు చేయాలని సూచించారు.

# గోవాలో పిఆర్‌సిఐ గ్లోబల్ కాన్‌క్లేవ్

## పాల్గొన్న గోవా గవర్నర్, సిఎం ప్రమోద్ సావంత్

హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త : గోవా, పంజిమ్‌లో పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 19వ గ్లోబల్ కాన్‌క్లేవ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు, గోవా సిఎం ప్రమోద్ సావంత్ విచ్చేశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పరిపాలన, అవార్డును హైదరాబాద్ పిఆర్‌సిఐ(పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా) చాప్టర్ దక్కించుకుంది. జాతీయ స్థాయిలో మోస్టు వ్యాల్యుబుల్ లీడర్ అవార్డును ప్రకాశ్‌జైన్ అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం డిఎస్‌సిఐ, నాస్కామ్ సంయుక్తంగా నడుస్తున్న సైబర్ సెక్యూర్టీ అసెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు ప్రతిష్టాత్మక చాణక్య అవార్డు లభించింది. ఈ అవార్డులను హైదరాబాద్ పిఆర్‌సిఐ ఛైర్మన్ షకీల్ అహ్మద్‌కు, జిపి జైన్‌కుమార్ మెమోరియల్ అవార్డును ఇంటిగ్రల్ పబ్లిక్ రిలేషన్స్‌కు గోవా సిఎం ప్రదానం చేశారు.





అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.

- మహాత్మా గాంధీ

# చేతికందినా నోటికందలేదు!


జి.ఎస్.టి 2.0తో అద్భుతాలు సృష్టించాల నుకున్న కేంద్ర ప్రభుత్వ వ్యూహానికి ఆదిలోనే హంసపాదు పడింది. కేవలం 5 శాతం, 18 శాతంగా రెండేరెండు శ్లాబ్‌లలో జనరల్ సేల్స్‌టాక్స్ పద్ధతి నిజంగానే అటు వ్యాపారస్తులకు కానీ వినియో గదారులకు వీలైన సహేతుక విధానం. గతంలో ఎన్నోరకాల పన్నులతో సుంకాలతో విసిగి వేసారిన వినిమయదారులు ఈసారి జిఎస్‌టి నూతన విధానంతో కాస్త తేలికపడ్డారనే చెప్పాలి. దీపావళి నుంచి జిఎస్‌టి శ్లాబులతో వస్తున్నట్లు ప్రకటించి ఆఘమేఘాల మీద అమల్లోకి తెచ్చేసరికి, దానిని పర్యవేక్షించే యంత్రాంగం సిద్ధంగా లేకపోవడంతో జిఎస్‌టి సౌకర్యాలు ప్రజలకు పూర్తిస్థాయి లో అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వ ప్రయత్నాల లోపం వలన కేంద్రం ఆశించిన మేరకు జిఎస్‌టి 2.0 అక్కరకు రాలేదనే చెప్పాలి. చాలా నిత్యావసర వస్తువుల దుకాణాల్లో పాత సరుకుల చెలామణీ కాకుండా కొత్త సరుకులు తెప్పించుకోలేం కదా. పాత సరుకులకు పాత పన్నులు చెల్లించే తెచ్చాం కనుక పాత రేట్లకే ఇవ్వగల మని తగ్గింపులేమీ ఉండవని 'నో' చెప్పేస్తున్నారు. హతాశులై తిరిగిరావడం వినియోగదారుల వంతయ్యింది. తదుపరితరం వస్తుసేవల పన్నుల సంస్కరణలతో ఇప్ప టికిప్పుడు వినియోగదారులకు చౌకధరలకు సరకులు అందుతాయని, దాంతో వారు సంతుష్టులౌతారని ప్రధాని మోడీ అంచనా. కానీ క్షేత్రీయంగా చూస్తే అలాంటి ఆచూకీ ఏదీ కనబడడం లేదు. వాహనాలు, బైకులకు అయితే అవి లెక్కించుకునేందుకు అతి తేలికే కనుక వాటి మీద గతంలో వాహనం ఒక్కింటి అదనంగా చెల్లించిన జిఎస్‌టి భాగాన్ని తిరిగి డీలర్లకు జమ చేసే ఆలోచనా విధానంపై ఒప్పందం ఉన్నందున వాహనాలు, బైకుల మీద పెద్ద మొత్తంలోనే రాయితీ లభించింది. తక్కువ ధరకే వాహనాలు లభిస్తున్నాయి. తాజాగా ఈ కామర్స్ షాపుల్లో జిఎస్టీ తగ్గించి విక్రయాలు చేస్తున్నందున 25శాతం అమ్మకాలు పెరిగాయి. తక్కువ ధరకే వాహనాలు లభిస్తున్నాయి. కిరాణా సరుకుల విషయంలో ఎలాంటి 'చౌక' పాలు కనపడలేదు. దాంతో ప్రజలు జిఎస్టీ తగ్గింపు సౌకర్యం అందిపుచ్చుకోలేకపోయారు. జిఎస్‌టి పొదుపు ఉత్సవాలు సంతోష సంబరాలు పేరిట తగ్గింపుల నజ రానా కేవలం కార్లకే పరిమితమయ్యాయి. కిరాణా తది తర షాపులపై రూ.12లక్షల దాకా వచ్చే ఆదాయంపై పన్నులు మినహాయించినందున జిఎస్‌టికి సంస్కరణలు ప్రతి దుకాణాదారునికి లాభించాయని ప్రధాని మోడీ స్పష్టించారు. 2017లో ప్రారంభించిన జిఎస్‌టి సంస్కరణలతో ఒకే దేశం, ఒకే పన్ను పేరిట పన్నులను పునర్వి భజన చేశామని చెప్పారు. గతంలో రకరకాల పన్నులు సుంకాల వల్ల వ్యాపారులకు వినియోగదారులకు పన్నుల భారం పడేది. ఈ రీత్యా ప్రస్తుతం 2శ్లాబులే ఉంచారు. పన్నుల విధానం మీద ఏర్పడుతున్న అవరోధాలను తొలగించుకున్నారు. పన్ను సంస్కరణలతో సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమలు సైతం ప్రయోజనం పొందుతాయి. వస్తూత్పత్తి మనమే చేసుకుంటాం కనుక జిఎస్‌టి సంస్కరణలు బాగా వినియోగపడడంతో లబ్ధి చేకూరుతుంది. గతంలో 12 శాతం పన్నుశ్లాబ్‌లగా ఉన్న 99శాతం వస్తువులను 5 శాతం పన్ను శ్లాబులోకి మార్చినట్లు తెలిపారు. ఫలితంగా ఆయా వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయనిప్రధాని దేశ ప్రజలందరికీ నచ్చచెప్పారు. క్షేత్రస్థాయిలో జిఎస్టీ అమలు చూసినప్పుడు కొత్తస్టాకు, పాత స్టాకు, పాత ధర, కొత్త ధర, పాత పన్ను, కొత్త పన్నులు. అనే అంశాలు వినియోగదారుని గందరగోళపరిచాయి. జిఎస్టీ రెండో అంకంతో రెండే శ్లాబుల పన్నుల విధానం స్వాగతించదగినవే. అధిక పన్ను రేటు శ్లాబ్‌లోకి చాలా వస్తువులే వెళ్లాయి. ఇలా తగ్గిన పన్నుభారం వినిమయదారునికి ఉద్దీపనగానేభావించాలి. ఎన్నో ప్రధానమైన వినియోగ వస్తువులు తక్కువ పన్ను విధానంలోకి మారడం వలన ఆయా ప్రభుత్వాలకి రాబడి తగ్గిపోయింది. ఆ రాబడిలోటును కేంద్ర ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమై నందున రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్కరణలకు అంగీకరించాయి. పెట్రోలు, విద్యుత్ వంటివి జిఎస్టీ పరిధిలోకి రాలేదు. దీని వలన ఏ వర్గాల నుంచీ ఎలాంటి ఆందోళనలు లేకున్నాహడావుడిగా ప్రవేశ పెట్టిన జిఎస్టీ విధానం ఇప్పుడిప్పుడే ప్రజలకుఅందుబాటులోకి వస్తోంది. చేనేతను జిఎస్‌టి తగ్గింపులోకి తీసుకురాకపోవడం వల్ల ఆయావర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఉండగా అమలు చేస్తున్నట్లు ప్రకటించి, తక్షణ సౌకర్యం పొందగలరని ఆశపెట్టిన అంశాలకు సంబంధించి వినియోగదారులు అసంతృప్తిగా ఉన్నారు. వ్యాపారుల అధిక లాభాలను నియంత్రణ చేసే అధికార యంత్రాంగం కదలిరాకపోవడంతో పాత స్టాకున్నంత వరకు పాత ధరకేనన్న భావనతో వ్యాపారం సాగిస్తున్నారు. అమలులో కాస్త అటు ఇటుగా ఉన్నాసంక్షేమ బాటలకు అడుగులు పడడం మంచిదే. ఒకపక్క జిఎస్‌టి పొదుపు ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ సెప్టెంబరు 22 నుంచి కొన్ని వస్తువులకు మాత్రం 'ఆదా' ధరలకే లభిస్తున్నాయి. నిత్యావసర వస్తువులు సరుకుల ధరల విషయంలో వ్యాపారులెవరైనా అధికంగావసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని అధికారులు హడావుడి చేయడమే తప్ప ప్రత్యేకించి చెక్ చేస్తున్న సందర్భాలేవీ కనపడటం లేదు. దీనికితోడు అక్టోబరు 16న ప్రధాని మోడీ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు తెలుగు రాష్ట్రాలలో జిఎస్టీ సంస్కరణోద్యమాన్ని ముందుకు తీసు కెళ్లేందుకు ఆయా ప్రాంతాల్లో పర్యటించడడం ఉత్సాహం కలిగించే విషయం.

సువాసన వెదజల్లే అత్తరులు, తళతళ మెరిసే అలంకారాలు, సంపదలు వీటన్నిటి కన్నా ఉత్తమ సంస్కారమే మంచి సంపద, మంచి అలంకారం.



అరిస్టాటిల్

పనిచేసే తత్త్వమూ, పని పట్ల విశ్వాసమూ విజయానికి మూలకారణాలు.



హెన్రీఫోర్డ్

# ప్రజావాక్కు



## సినిమా టిక్కెట్ ధరలు తగ్గించాలి

ఇటీవలి కాలంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొత్త సినిమాలు విడుదలైన తొలి మూడు రోజుల పాటు టికెట్ ధరలనుపెంచడం ఒకప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈవిధానం నిర్మాతలకు లాభదాయకమై ఉంటే, సామాన్య ప్రేక్షకులపై తీవ్రమైన భారాన్ని మోపుతోంది. నేటి తరం పెద్ద బడ్జెట్ సినిమాల నిర్మాణ వ్యయం భారీగా పెరగడంతో, తొలి వారాంతంలో అధిక ధరలు వసూలు చేసి పెట్టుబడి త్వరగా తిరిగిపొందాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. అధిక టికెట్ ధరల వలన తొలి రోజు కలెక్షన్లు భారీగా నమోదై, సినిమా బ్లాక్‌బస్టర్‌గా ప్రచారం పొందుతుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబం నాలుగు టికెట్లు కొనుగోలుచేయాలంటే, అధిక ధరలు భారంగా మారతాయి. ఫలితంగా వారు సినిమా చూడకపోవచ్చు లేదా ఓటీటీ విడుదల కోసం వేచి చూడవచ్చు. ఈ పరిస్థితి థియేటర్ యజమానులకు కూడా కష్టాలు తెస్తోంది

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## మండుతున్న లద్దాక్

లద్దాక్ తన అస్తిత్వంనిలుపుకోవడం కోసం మండుతోంది. తన వనరులపైన తన ఆధిపత్యం నిలుపుకోవడం కోసం మండుతోంది. తెలంగాణ ఏమో ఇతరుల ఆధిపత్యంకు వ్యతిరేకంగా కొట్లాడితే లద్దాక్ ఏమో తన స్వేచ్ఛ కోసం పోరాడుతుంది. కేంద్రం చేతిలో బంధి కావడం ఇష్టం లేక కొట్లాడుతోంది స్వేచ్ఛ వాయువులు పిల్చిన ఆ నెలలోకి అభివృద్ధి పేరుతో ఆధిపత్య ధోరణులు రాకూడదని పోరాడుతోంది. అభివృద్ధి సమ్మిళితంగా ఉండాలి అని ప్రాథమిక రంగం కేంద్రంగా అభివృద్ధి ఉండాలి.

- భారత అవినాష్, జనగామ

## గ్రామీణ వైద్యులకు శిక్షణ అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపి పిఎంపీల గ్రామీణ వైద్యులకు తెలంగాణ ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించి గుర్తించాలి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆర్ఎంపి పిఎంపీలకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీచేసి తరగతులు సైతం ప్రారంభించారు. కోర్టువివాదాల కారణంగా ఆగిపోయింది.

- ముడితనపెల్లి ప్రభాకర్, భూపాలపల్లి జిల్లా

## క్రమశిక్షణ పాటించాలి

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రకృతి ప్రకోపాన్ని నిరోధించడం అసాధ్యం. కాని మానవ తప్పిదాలను తప్పించుకోవచ్చు. అయితే ప్రజలలో క్రమశిక్షణలోపిస్తే అదిప్రమాదాలకు, విషాదాలకు దారి తీస్తుంది. ఈలోపాలవల్ల ఎన్నో ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. కన్నవారికి కన్నీళ్లు మిగులుస్తున్నాయి. ఈ నెల 27న తమిళ సూపర్ స్టార్, తమిళ వెట్రి కజగమ్ అనే నూతన పార్టీని ప్రారంభించిన విజయ్ జోసెఫ్ తమిళనాడు లోని కరూర్‌లో తనమెగా మీటింగ్ పెట్టిన సందర్భంలో వేలకు పైగా అభిమానులు గుమ్మిగూడారు. ఒకపద్ధతి ప్రకారం పాటించవలసిన క్రమశిక్షణ లోపం ద్వారా తొక్కిసలాట జరిగి ఇప్పటికీ 39 మంది మరణించగా మరో50మందికి పైగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. పరిహారాలు ఇస్తారు. పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేరెవరు. ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాగాన్ని బాధ్యతను పాటించని ప్రజలు మాత్రమే తిట్టి పోస్తారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## బతుకమ్మ పాటలనే పాడుకుందాం

ప్రకృతిలోని పూలను బతుకమ్మగా పేర్చి భక్తితో గౌరమ్మను కొలుసుకుంటూ చారిత్రాత్మక కథలను తీరొక్క పాటలుగా అల్లి గుండ్రంగా బతుకమ్మ సుట్టూ అమ్మలక్కలు సేరి సప్పట్లు కొడుతూ ఆడే ఆట బతుకమ్మ ఆట.. గిప్పుడేమో బతుకమ్మ కాడా పొంతనలేని గేయాలేట్టి..మన ఆచార సాంప్రదాయాలను మంటగలుపుతున్నారు. ఈ బతుకమ్మ పాటల్లో ఎంతో అంతరార్థం దాగి ఉందనే విషయాన్ని తెల్వకపాయే. ఎన్నో ఒడిదుడుకులతో సాగిన కుటుంబం మానవీయ విలువలతో దాగి ఉండేటి పాటలు ఒగ్గేసి ఇష్టం అచ్చినట్లు సౌండ్ బాక్స్‌ల్లో పాటలు పెట్టి ఎగురుతున్నారు. ఇకనైనా బతుకమ్మ పాటలను పాడుకొని ఆడుకుందాం మానవ బంధాలను పెంచుకుందాం.

-కాల్వ నిఖిత, సిద్దిపేట

## జనావాసాలకు దూరంగా మద్యం షాపులు

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జన వాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడు వివిధ జంక్షన్‌లోకి వచ్చేజనం ఆమార్గం గుండా వస్తారు. మద్యం సేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరుల తో ఘర్షణలు శృతిమించి కొట్టుకుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. ఇకపై కొత్త షాప్ లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

-బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

# 'ప్రాథమిక విద్య'కు గాంధీజీ పరిష్కారాలే శరణ్యం

**గాంధీజీ ప్రతిపాదించిన విద్యా విధానాన్ని స్వాతంత్ర్యం సమపార్జనంతరం అమలుపరిస్తే ఏనాడో మన దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించి అభివృద్ధి చెందిన దేశాల సరసననిలిచేది. విద్యార్థుల్లో విలువలు అభివృద్ధి చెంది నేటి విషసంస్కృతి విస్తరించేది కాదు. పని విద్య అమలుపరచడం ద్వారా పిల్లలకు పనిపట్ల గౌరవం సమకూరేది. నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడేది చదువుతో పూర్తిప్రయోజనం పొందేవారు 'మాతృ భాషలోనే ప్రాథమిక విద్యా బోధన' అని నిర్దుష్టంగా సిఫారసు చేసినందున కొనసాగుతున్న వివాదానికి ఏనాడో పరి ష్కారం చేకూరేది. స్వాతంత్ర్యానంతరం ప్రాథమిక విద్యారంగ ప్రాముఖ్యత గుర్తించి ఎన్నో కమిషన్లు కమిటీలు వేసినా మరెన్నో సిఫార్సులు చేసిన మౌలిక సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నవి.**



కొల్లు మధుసూదన రావు

స్వాతంత్ర్యం సముపార్జించుకొని 78 సంవత్సరాలు గడిచినా బ్రిటిష్ వారు రూపొందించిన విద్యా విధానమే నేటికి కొనసాగుతున్నది. విద్యారంగానికి మూలమైనది ప్రాథమిక వ్యవస్థ. అది పటిష్టవంతంగా ఉన్నప్పుడే యావత్ విద్యారంగం ఆదర్శవంతంగా, అభ్యుదయకరంగా ఉంటుంది. కానీ ప్రధానమైన సమస్యలు నేటికీ కొనసాగడం విచారకరం. బ్రిటిష్ విద్యా విధానానికి ప్రత్యామ్నాయంగా మహాత్మా గాంధీజీ 1937లో బేసిక్ ఎద్యుకేషన్ 'నయీ తాలీమ్' అనే నూతన విద్యావిధానాన్ని ప్రతిపాదించారు. ఈ వ్యవస్థను ప్రత్యక్షంగా అమలుచేయని కారణాన ప్రాథమిక విద్యా రంగంలో అతి మౌలికమైన, ప్రధానమైన సమస్యలు నేటికీ కొనసాగడం అత్యంత దురదృష్టకరం. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో 6 నుండి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ, ప్రాథమిక హక్కు అందించాల్సిన బాధ్యత రాజ్యంపై ఉందని పేర్కొనినా, ఉచిత నిర్బంధ విద్యాహక్కుకు బాలల హక్కు చట్టం 2009లో 35 ఆఫ్ 2009 రూపొందించినా అమలులో ఘోరంగా విఫలమయ్యాం. భారతదేశ అక్షరాస్యత రేటు 2023-24లో 80.9 మాత్రమే, ఇంకా మనదేశంలో 19.1 నిరక్షరాస్యులుగానే కొనసాగుతున్నారు. సాక్షర భారతం సాకారం చేసుకోలేకపోయాం. మనకన్నా అతి చిన్న వెనుకబడిన దేశాలు అండోర, గ్రీన్ లాండ్, నార్వే, లక్సెంబర్గ్, నార్త్ కొరియా, యుక్రైన్, యుజిబికిస్థాన్ మొదలగునవి సంపూర్ణ అక్షరాస్యత సాధించడమైనది. మన దేశంలో చదువుకున్నందువల్ల పూర్తి ప్రయోజనం కలగడం లేదని, బతుకు తెరువు చూపడం లేదని. జీవనోపాధికి తోడ్పడడం లేదని, నిత్య జీవితానికి ఉపయోగపడడం లేదనే భావనతో పిల్లలు వివిధ దశలలో చదువుకు స్వస్తి చెప్పి నిరుద్యోగులుగానే కాదు నిష్ప్రయోజకులుగా సమాజానికి భారంగా రూపొందుతున్నారు. మానవ జీవితం అత్యంత ఉన్నతమైనది, ఉద్దేశపూర్వకమైనది. భారతీయ సంస్కృతి సామాజిక నిబంధనలతో కూడిన వేల సంవత్సరాల ఆచారాలు, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాల సమ్మేళనం. ఇది జన్మనిచ్చిన తల్లిదండ్రులు, పెరిగిన ప్రాంతం, ఎదిగిన వాతావరణంలో అలవడుతుంది. ఒక వ్యక్తి భావనతో కూడి విలువల ప్రాధాన్యత వ్యక్తమవుతుంది. వారి ప్రవర్తన సంబంధాలు పెంపొందించి జీవితంలో ఉపయోగపడతాయి. విద్యార్థులకు అలవడాల్సిన విలువలు సత్యము, సత్ప్రవర్తన, శాంతి, ప్రేమ, అహింస, నిజాయితీ, సమైక్యత, సహకారం, క్రమశిక్షణ, సృజనాత్మకత, సేవా దృక్పథం మొదలగునవి. బాల్యంలోనే విలువలు అంకురిస్తాయి. తల్లిదండ్రులు సహాయకుల్ని చూసి, విని తెలుసుకొని ఎదుగుతాయి. ప్రస్తుతం విష సంస్కృతి విస్తరిస్తోంది. పిల్లలు నైతిక విలువలు కోల్పోయి విద్వేషాలు, వివక్షతలతో, క్రమశిక్షణరాహిత్యం, అవినీతి అక్రమాలు, అసత్యానికి అలవాటు పడి నీతీ బాహ్య చర్యలకు పాల్పడుతున్నారు, నేరస్తులుగా మారుతున్నారు. అత్యధిక తల్లిదండ్రులకు ఒకే సంతానంతో అల్లారుముద్దుగా పెంచుతున్నారు. పిల్లల కోరికలుఎటువంటివైనా తీర్చుతున్నారు. ఇప్పుడు పిల్లల ప్రపంచాన్ని ట్యాబ్ లు టి.విలు ఆక్రమిస్తున్నాయి. ఆన్లైన్‌కు అడిక్ట్ అవుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు, పోర్న్ సైట్లల అశ్లీలాన్ని చూసి పిల్లల మనసులో విషం నింపుకొని, రేప్‌లు, హత్యలు దొంగతనాలకు, బ్యాంకు దోపిడీలలో పాల్గొంటూ పిల్లలు నేరస్తులుగా రూపొందుతున్నారు. పిల్లలకు సంస్కృతి, నైతిక విలువలు ఇప్పుడు పాఠశాలలోనే ప్రారంభించాల్సి వస్తుంది. దీనికి



తల్లిదండ్రులు సహకారం అందించాలి. నైతిక విలువలు పెంపు జరగాల్సింది పాఠశాలలోనే, బోధించాల్సింది ఉపాధ్యాయులు. విలువలు అంటే వ్యక్తికి ప్రయోజనం కలిగించేలా ఇతరులకు హాని కలగకుండా ఉండాలి. గాంధీజీ ప్రతిపాదించిన ఆదర్శ, ఆచరణాత్మక విద్యప్రబోధనలు, నిర్బంధ సార్వత్రిక విద్య, మాతృభాషలోనే ప్రాథమిక విద్య, అక్షరాస్యత మాత్రమే కాదు స్వావలంబన, విద్య విలువల్ని పెంపొందించాలి, విద్య ద్వారా బాధ్యత గల పౌరునిగా పిల్లల్ని రూపొందించాలి, పిల్లల శారీరక, మానసిక ఆత్మవిశ్వాసం అభివృద్ధికి తోడ్పడాలి. పని, విద్యా ద్వారా ఉత్పాదిక కార్యక్రమంలో పని అనుభవం చేకూర్చి భావి జీవితానికి తోడ్పడాలి. విద్యా స్వావలంబనకు అవకాశం కల్పించి స్వతంత్రంగాను జీవనభృతి సాధించేలా ఉండాలి. మన విద్యా విధానంలో గాంధీజీ ప్రతిపాదించిన విధానాలు ప్రత్యక్షంగా అమలు చేయలేదు కానీ భారతీయ విద్యా రంగంలో అమలుపర్చిన విధానం పద్ధతులను గణనీయంగా ప్రభావితం చేశాయి. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు సర్వ శిక్ష అభియాన్, సమగ్ర శిక్షఅభియాన్, బాలల హక్కుచట్టం 2009 మొదలగు కార్యక్రమాలు చేపట్టినా సంపూర్ణంగా సాధించకుండానే నిలిపివేశారు. భారత స్వాతంత్ర్యం కఠినమైన ప్రస్థానంలో ఉంది. సమాజంలో అన్ని విలువలు అణగారిపోతున్నవి గతంలో పాఠశాలల్లో మోరల్ పిరియడ్లు వారానికి ఒకటి రెండు ఉండేవి. వాటిలో నీతి కథలు చెప్పేవారు. పాఠ్యాంశాలల్లో సుమతి, వేమన మొదలగు నీతిశతకాల పద్యాలు బోధించేవారు వాటి ద్వారా నీతి బోధన జరిగేది భావి పౌరుల్ని ఉత్తమ విలువలతో రూపొందించాలి. రోజురోజుకి విలువలు దిగజారుతున్న తరుణంలోఉపాధ్యాయులు క్రియాశీల పాత్ర వహించాలి. నైతిక విలువలను పిల్లలు నీతి కథలు ద్వారానేర్చుకుంటారని టొరంటో విశ్వవిద్యాలయం పరిశోధనలో వెల్లడించడమైనది. మన దేశ నైతికసంపద పంచ తంత్రం 50 భాషలకు అనువదించబడింది. వీటిద్వారా సంస్కారమంతమైనసంపద, సంస్కృతి పలు దేశాల్లో ప్రాచుర్యంపొంది, సంరక్షణకు ఇది తోడ్పడుతుంది. వీటిని మన పాఠ్యాంశాల్లో చేర్చాలి. పాఠశాల స్థాయిలో నీతి బోధనకు ప్రతిరోజు ఒక పీరియడ్ కేటాయించాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన కొత్త ఆవిష్కరణలు, నైపుణ్యాలు విధానాలను విద్యారంగంలో కూడా వినియోగించుకోవాలి. స్మార్ట్‌ఫోన్, డిజిటల్ టి.వి, కృత్రిమ మేధ, ప్రోగ్రామింగ్ మొదలగునవి సద్వినియోగం చేసుకుంటే సౌలభ్యం, సౌకర్యం, సౌగమ్యం, సౌముఖ్యం పరిజ్ఞానం మొదలగునవి సమకూరుతాయి. కానీ పిల్లలు సెల్‌ఫోన్, టి.వి. మొదలగు వాటిని దుర్వినియోగం చేయడంతో దుష్ప్రవర్తన, హింస, క్రమశిక్షణారాహిత్యం, చెడు విలువలు, దురాశ, దుర్మార్గానికి, దొంగతనానికి, హత్యలకు పాల్పడడం జరుగుతుంది. పిల్లలు సెల్‌ఫోన్లు, ట్యాబ్లు వినియోగించకుండా కాపాడాలి లేదా పర్యవేక్షణలో వినియోగించేలా చూడాలి. దీనికి తల్లిదండ్రుల సహకారం స్వీకరించాలి. గాంధీజీ ప్రతిపాదిం చిన పని విద్యను ప్రత్యక్షంగా అమలు చేయకపోయినా కేంద్ర ప్రభుత్వం నియమించిన వివిధ కమీషన్లు, కమిటీలు కొఠారి కమిషన్ (6466) ఈశ్వరీ బాబు పటేల్ కమిటీ (1977) మాల్కం ఆదిశేషయ్య కమిటీ (1977) వి.ఆర్.రెడ్డి కమిటీ (1980) పని విద్యకు ప్రాముఖ్యత కల్పించాలని, పాఠ్యాంశాల్లో భాగంగా ఉండాలని, వారానికి 6 గంటలు కేటాయించాలని సిఫార్సు చేసినా, సిఫార్సులు కాగితాలతో పరిమితం అయ్యాయి కానీ అమలుకు నోచుకోలేదు. గాంధీజీ ప్రతిపాదించిన విద్యావిధానాన్ని స్వాతంత్ర్యం సమపార్జనంతరం అమలుపరిస్తే ఏనాడో మన దేశంసంపూర్ణ అక్షరాస్యత సాధించి అభివృద్ధి చెందిన దేశాల సరసననిలిచేది. విద్యార్థుల్లో విలువలు అభివృద్ధి చెంది నేటి విషసంస్కృతి విస్తరించేది కాదు. పని విద్య అమలుపరచడం ద్వారా పిల్లలకు పనిపట్ల గౌరవం సమకూరేది. నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడేది చదువుతో పూర్తిప్రయోజనం పొందేవారు "మాతృ భాషలోనే ప్రాథమిక విద్యా బోధన' అని నిర్దుష్టంగా సిఫా రసు చేసినందున కొనసాగుతున్న వివాదానికి ఏనాడో పరి ష్కారం చేకూరేది. స్వాతంత్ర్యానంతరం ప్రాథమిక విద్యారంగ ప్రాముఖ్యత గుర్తించి ఎన్నో కమిషన్లు కమిటీలు వేసినా మరెన్నో సిఫార్సులు చేసిన మౌలిక సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నవి. గాంధీజీ ప్రతిపాదించిన విద్యా విధానం నిర్దిష్టంగా, నిర్మాణాత్మకంగా అమలు పరిస్తే మౌలిక సమస్యలల్ని పరిష్కృతమై అత్యంత కీలకమైన ప్రాథమిక విద్యారంగం సమాజ సంరక్షణకు అభివృద్ధికి తోడ్పడి భాసిల్లే అవకాశం సమకూరుతుంది. ●

# రీసర్వే పారదర్శకం కావాలి

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల రీ సర్వే ప్రారంభించి ఐదేళ్లకు పైగా అవుతున్నా ఇంకా పూర్తిస్థాయిలో ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం ఒక ముఖ్య సమస్యగా కనిపిస్తోంది. ఈ కార్యక్రమం ప్రభుత్వ ఉద్దేశ్యం ప్రకారం సాగి ఉంటే, భూముల యజమానులు ఆన్‌లైన్‌లో సులభంగా తమ రికార్డులు పొందగలిగేవారు. కానీ వాస్తవ పరిస్థితి ఏమిటంటే, చాలా మంది రైతులు ఇంకా ప్రతిసారి పంట రుణం రీన్యువల్ చేయాలంటే లేదా భూమి లావాదేవీలు జరపాలంటే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాలలో రీ సర్వే పూర్తయ్యాక అధికారులు రైతులకు రసీదులు ఇచ్చి, ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిర్దిష్ట సమయంలో రాతపూర్వకంగా తెలియచేయాలి. చాలా గ్రామాల్లో రైతులు ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదు. అంటే రికా ర్డులు పూర్తిస్థాయిలో ఖరారయ్యాయి. అయితే ఈ రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల ప్రజలకు ఉపయోగం తక్కువగానే మిగిలింది. ప్రస్తుత పరిస్థితిలో ఒక రైతుపంట రుణం రీన్యువల్ చేసుకోవాలంటే తహసీల్దార్ దగ్గరికి వెళ్లి రాతపూర్వకంగా వన్ బి పొందాలి. ఇది ఒక విధంగా ప్రభుత్వ డిజిటలైజేషన్ ఉద్దేశ్యానికి విరుద్ధం. ముందుగా ప్రజలు మీ సేవ లేదా మీభూమి ద్వారా సులభంగా రికార్డులు పొందగలిగారు. ఇప్పుడు రీ సర్వే పూర్తయ్యాక కొత్త రికార్డులు సరిగా అప్‌డేట్ కానందువల్ల ఆ సౌలభ్యం లేకుండాపోయింది. భూమి యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్లో ముఖ్యమైనది సమయం, డబ్బు వృథాకావడం. ప్రతిసారి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లడం రైతులపై అదనపు భారమవుతోంది. ఇది గ్రామీణ ప్రజానీకానికి పెద్ద సమస్యగా మారింది. పంట పనులు చూసుకోవడమో, ఇతర కూలి పనుల కోసం వెళ్ళడమో చేయాల్సిన రైతులు ఇలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం అనవసరమైన ఇబ్బంది. రీ సర్వే అనేది చాలా ముఖ్యమైన సంస్కరణ. దశాబ్దాలుగా కొనసాగుతున్న భూముల వివాదాలు, అశుద్ధ రికార్డులు, పక్కా హద్దులు లేని సమస్యలు తొలగించడానికి ఇది గొప్ప ప్రయత్నం. ప్రజలకు ఖచ్చితమైన హక్కుపత్రాలు ఇవ్వ



డం, భూమి వివాదాలను తగ్గించడం ఈకార్యక్రమంప్రధాన లక్ష్యం. కానీ పూర్తి చేసిన రికార్డులను తక్షణమే ఆన్‌లైన్‌లో ఉంచకపోతే ఈ ప్రయోజనం రైతులకు చేరదు. ప్రజల అంచనాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఒకసారి రీ సర్వే పూర్తయ్యాక ఎలాంటి అభ్యంతరాలు లేవంటే, ఆ రికార్డులు వెంటనే అందుబాటులో ఉండాలి. రైతులు తాము యజమానులమని నిరూపించుకోవడానికి మళ్లీ మళ్లీ అధికారులను సంప్రదించాల్సిన అవసరం ఉండకూడదు. ఇది మాత్రమే కాకుండా, కొత్తగా భూములు అమ్ముకోవాలనుకున్నా లేదా పంట రుణాలు తీసుకోవాలనుకున్నా సులభతరం కావాలి. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసి, రికార్డులు అందుబాటులో ఉంచితే రైతులపై నమ్మకం పెరుగుతుంది. లేకపోతే ప్రభుత్వం చేసిన రీ సర్వే పేరు మీద కొత్త సమస్యలు మాత్రమే వచ్చాయని ప్రజలు భావిస్తారు. కాబట్టి ఆలస్యాలు తగ్గించి పూర్తి అయిన గ్రామాల రికార్డులను వెంటనే ఆన్‌లైన్‌లో ఉంచడం అత్యవసరం. ఈసమస్య పరిష్కారం కోసం అధికారులు కొన్ని చిన్న చర్యలు తీసుకుంటే పెద్ద మార్పు వస్తుంది. గ్రామాల వారీగా రీ సర్వే పూర్తి అయిన వెంటనే ఆ గ్రామానికి సంబంధించిన వన్ బి, అడంగళ్, ఎల్పీ నంబర్లు, పటాలు అన్నీ మీ సేవ లేదా మీభూమి లాంటి వెబ్‌సైట్లలో అప్డేట్ చేయాలి. అలాగే బ్యాంకులకు కూడా ఈ డిజిటల్ రికార్డులు చెల్లుబాటు అయ్యేలా మార్పులు చేయాలి. ప్రభుత్వం ఈ సమస్యను ఒక అవకాశంగా తీసుకుంటే రైతులకు మాత్రమే కాకుండా మొత్తం వ్యవసాయ రంగానికి కూడా ఊరటనిస్తుంది. డిజిటల్ రికార్డులు అందుబాటులోకి రావడంవలన భవిష్యత్తులో వివాదాలు తగ్గుతాయి, భూమి విలువ పెరుగుతుంది. పంట రుణాలు తేలికగా లభిస్తాయి. ఇవన్నీ కలిపి గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తాయి. గ్రామీణ ప్రజానీకం కూడా ఈ అంశంలో చైతన్యం కలిగి ఉండాలి. రీ సర్వే పూర్తయినా రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించకపోతే అధికారులు దగ్గర ప్రశ్నించాలి, ఫిర్యాదులు చేయాలి. పత్రికలలో, సమావేశాలలో, సంఘాల ద్వారా ఈ సమస్యను ప్రస్తావించాలి. అప్పుడు మాత్రమే ఈ వ్యవస్థ వేగంగా పనిచేస్తుంది. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వానికి ఇది పెద్ద సవాలు. ఒకవైపు పారదర్శకతను చూపించాలి, మరోవైపు రైతుల నమ్మకాన్ని పొందాలి. ఈ రెండు లక్ష్యాలను సాధించడానికి అత్యవసరంగా అవసరమైనది పూర్తి చేసిన రికార్డులను వెంటనేప్రజలకు అందుబాటులో ఉంచడం. రీ సర్వే విజయవంతమయ్యిందని చెప్పుకోవాలంటే ఇది తప్పనిసరిగా జరగాలి. ●

# రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ: మహత్తర ఘట్టం

రామ కిష్టయ్య సంగన భట్ల

స్వతంత్ర భారతదేశంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఒక రాజకీయ, సాంస్కృతిక, పరిపాలనా ప్రస్థానమే కాక, దేశ సమాఖ్య నిర్మాణానికి పునాది వేసిన చారిత్రాత్మక పరిణామం. బ్రిటిష్ పాలనలో ఏర్పడిన ప్రావిన్సులు, సంస్థానాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేవు. ఆ విభజనలో పార్ట్ ఏ లోని అస్సాం, బీహార్, బొంబాయి, తూర్పు పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాస్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి బ్రిటీష్ ప్రావిన్సులు, పార్ట్ బిలోని సంస్థానాలు, పార్ట్ సిలోని చిన్న ప్రాదేశిక పాలనాయూనిట్లు, పార్ట్ డి వంటి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతాలు అన్నీ సామ్రాజ్య అవసరాలఆధారంగా కూర్చబడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ప్రజలలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకై డిమాండ్లు పెరిగాయి. కాంగ్రెస్ పార్టీ 1920లో నాగపూర్ సమావేశంలోనే భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటును సమర్థించింది. అయితే దేశ విభజనలో జరిగిన రక్తపాతం, వలసల కల్లోలం దృష్ట్యా నెహ్రూ, పటేల్ వంటి నాయకులు కొత్త రాష్ట్రాల ఏర్పాటులో జాగ్రత్త వహించారు. 1948లో ఏర్పాటు చేసిన ధార్ కమిషన్, తదనంతరం నెహ్రూ, పటేల్, పట్టాభి సీతా రామయ్యలతో కూడిన జేవీపీ కమిటీలు భాషా ప్రాతిపదిక సరికాదని, ఇప్పుడే రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించడం సమంజసం కాదని తేల్చాయి. కానీ ప్రజల ఆకాంక్షలు ఆగలేదు. తెలుగు ప్రాంత ప్రజలు తమ రాష్ట్రం కోసం గళమెత్తారు. పొట్టి శ్రీరాములు 1952లో ఆంధ్రరాష్ట్రం కోసం చేపట్టిన నిరాహార దీక్షలో 58 రోజుల తరువాత ప్రాణత్యాగం చేయడం ఉద్యమాన్ని ఉధృతం చేసింది. ఆ త్యాగ ఫలితంగా 1953 అక్టోబర్ 1న మద్రాస్ నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఇది స్వతంత్ర భారత దేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం. ఈ పరిణామం ఇతర భాషా ప్రాంతాలకూ స్ఫూర్తినిచ్చింది. మహారాష్ట్ర కోసం మరాఠీలు, గుజరాత్ కోసం గుజరాతీలు, పంజాబ్ కోసం సిక్కులు, మైసూరు కోసం కన్నడిగులు ఉద్యమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 1953 డిసెంబర్ 29న రాష్ట్రాల పునర్వ్య



వస్థీకరణ కమిషన్‌ను నియమించింది. న్యాయమూర్తి ఫజల్ అలీ అధ్యక్షతన, సభ్యులు పణిక్కర్, కుంజ్రూ పాల్గొన్న ఈ కమిషన్ 1955 సెప్టెంబర్ 30న నివేదిక సమర్పించింది. ఇందులో పార్ట్ ఎ, బి, సి వర్గీకరణలు రద్దు చేయాలని, సంస్థానాల ప్రత్యేక హక్కులు తొలగించాలని, చిన్న రాష్ట్రాలను విలీనం చేయాలని, భాషా, భౌగోళిక, ఆర్థిక అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రాల కొత్త రూపకల్పన జరగాలని సూచించింది. ఈ నివేదిక ఆధారంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ఆమోదించి, ఏడో సవరణ రాజ్యాంగంలో అమలులోకి తెచ్చింది. 1956 నవంబర్ 1న 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. ఈ పునర్వ్యవస్థీకరణలో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ కలసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు ప్రజల్లో సాంస్కృతిక, భాషా గౌరవాన్ని బలపరిచింది. స్థానిక సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన పాలన సాధ్యమైంది. కానీ ఈ ప్రక్రియలో ప్రాంతీయత, విభజన వాదనలు కూడా పుంజుకున్నాయి. బొంబాయి రాష్ట్ర విభజనలో మహారాష్ట్ర గుజరాత్, పంజాబ్ విభజనలో భాషామత సమస్యలు, అస్సాం విభజనలో ఈశాన్య గుర్తింపు కోసం ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రజాస్వామ్య పటిష్టతకు దోహదపడింది. రాష్ట్రాలు వరుసగా ఏర్పాటులో మహారాష్ట్ర, గుజరాత్ 1960లో, నాగాలాండ్ 1963లో, హర్యానా 1966లో, మణిపూర్, త్రిపుర, మేఘాలయం 1972లో, సిక్కిం 1975లో, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ 1987లో, గోవా అదే ఏడాది, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ 2000లో, తెలంగాణ 2014లో ఏర్పడ్డాయి. 2019లో ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారింది. ప్రస్తుతానికి దేశం 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉంది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఒక నిరంతర ప్రక్రియ. ఇది ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ అవసరాలు, రాజకీయ పరిణామాలు కలగలసిన జీవం. భాషా గౌరవం, స్థానిక అభివృద్ధి, పాలనా సమర్థత వంటి లాభాలు లభించినప్పటికీ వనరుల పంచిక, ప్రాంతీయ వాదనలు వంటి సవాళ్లు కూడా ఎదురయ్యాయి. అయినప్పటికీ ఫజల్ అలీ కమిషన్ నివేదిక, 1956 చట్టం, పొట్టి శ్రీరాముల త్యాగంవంటి ఘట్టాలు భారతప్రజాస్వామ్య చరిత్రలో అచెంచలంగా నిలిచిపోయాయి. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రజల భాషాసాంస్కృతిక వ్యక్తిత్వానికి, సమాఖ్య ఐక్యతకు అద్దం పట్టిన చారిత్రక ఘట్టమని చెప్పాలి. ●

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## ఢాకా నియోజకవర్గంలో 80 వేల
# ముస్లిం ఓట్లు తొలగింపు..

### బిజెపి స్థానిక నాయకుల నుంచే సిఇఒకు ఫిర్యాదులు





**పాట్నా, సెప్టెంబరు 29:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓట్‌చోరీ నినాదం మరింతగా ఊపందుకుంది. ఎన్నికల్లో ఒకే ఒక్క నియోజకవర్గంలో ఉన్న ముస్లిం ఓటర్లను భారీ సంఖ్యలో తొలగించాలని బిజెపినుంచే ఎన్నికల సంఘానికి డిమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఆధారాలతోసహా విపక్షాలు ఎన్నికల సంఘానికి నివేదించాయి. తూర్పుచంపారన్ జిల్లాలోని ఢాకా నియోజకవర్గంలో సుమారు 80వేల మంది ముస్లిం ఓటర్లను జాబితాలనుంచి తొలగించారన్న దుమారం రేగింది. ఇందుకు సంబంధించి ఈ ఓట్లు తొలగించాలని బిజెపి పాట్నాలోని రాష్ట్ర కార్యాలయంనుంచే లేఖ వచ్చిందని ఎన్నికల సిఇఒకు ఈ లేఖను పంపిస్తూ వారంతా భారతీయ ముస్లింలు కాదని, బోగస్ ఓట్లని తొలగించాలని డిమాండ్‌చేసినట్లు తేలింది. కాషాయపార్టీ బూత్ స్థాయి ఏజెంట్ ధీరజ్‌కుమార్, బిజెపి ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకకుడు పవన్‌కుమార్‌జైస్వాల్‌లనుంచి కూడా ఈసికి ఇవే డిమాండ్లు వచ్చాయని తేలింది. ఓటర్ల జాబితానుంచి 130 మంది ముస్లింల ఓట్లు తొలుత తొలగించారు. ముసాయిదా జాబితా ప్రకటించేందుకు ముందే ఈ తొలగింపు జరిగింది. బీహార్‌లో నిర్వహించిన సర్‌మరింత వివాదాస్పదం అయిందనడానికి ఇదే ఉదాహరణ. ఆగస్టు 19 నుంచి ఈ ఓట్ల తొలగింపు యధేచ్ఛగా సాగిందని విపక్షాలు ఆరోపించాయి. ఢాకాలోని బూత్ స్థాయి ఏజెంట్ తాను ఇచ్చిన ఆధారాలన్నీ సమగ్ర పరిశీలన తర్వాతనే చేసామని ప్రజాప్రాతినిధ్య చట్టం 1950కింద అవసరమైతే శిక్షార్హం ఉన్న సెక్షన్ 31గురించి కూడా తనకు తెలుసునని అన్నారు. ధీరజ్‌కుమార్ ఒక్కరే 78,384ముస్లిం ఓట్లు తొలగించాలని సిఇఒకు ఫిర్యాదులు చేసారు. ఫిర్యాదుతోపాటు వారి పేర్లు ఎపిక్ నంబర్లు కూడా ఇచ్చారు. ఆ తర్వాత బిజెపి స్టేట్ ఆఫీస్‌నుంచి కూడా సిఇఒకు లేఖ వెళ్లింది. ఈ మొత్తం ఓటర్లను తొలగించాలని వీరంతా భారతీయ పౌరులు కాదని తెలిపింది. బీహార్ ఎన్నికల మేనేజ్‌మెంట్ విభాగం తిరుహత్ ప్రమండల్ ప్రభారి నుంచి లోకేష్ అనే పేరుతో ఈ లేఖ వచ్చింది. అయితే తర్వాత ఆరాతీస్తే లోకేష్ అనవారి పేరు పార్టీ ఆఫీసులోనే ఎవ్వరూ లేరని తేలింది. అయితే బిఎల్ఎ దాఖలుచేసిన లేఖను మాత్రం బిజెపి నాయకులు కొట్టివేయలేక పోతున్నారు. ఢాకా ఎమ్మెల్యే పవన్ జైస్వాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే 80వేల ముస్లిం ఓట్లను తొలగించే కుట్రలు చేసారని ఫుల్వారియా పంచాయత్ సర్పంచ్ ఫిరజ్ ఆలమ్ పేర్కొన్నారు. అలాగే బిజెపి ఫిర్యాదులో చందన్‌బారా గ్రామంలో కూడా ఐదువేల ఓట్లు తొలగించాలని సూచించారు. ఢాకా నియోజకవర్గం ఇండోనేపాల్ సరిహద్దులో ఉంది. వాస్తవానికి కాంగ్రెస్ పట్టున్న ఈ ప్రాంతంలో తర్వాత ఆర్జేడి పట్టుసాధించింది. ఆతర్వాత బిజెపి చేతుల్లోకి వెళ్లింది.

## హోంవర్క్ చేయలేదని విద్యార్థిని తలకిందులుగా వేలాడదీసి చిత్రహింసలు

**పానిపట్, సెప్టెంబరు 29:** హర్యానా రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది.



హోమ్‌వర్క్ చేయలేదన్న కారణంతో ఓ చిన్నారిని కిటికీకి తలకిందులుగా వేలాడదీసి చితకబాదారు. ఈ అమానవీయ ఘటన పానిపట్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటు చేసుకుంది. ముఖిజా కాలనీకి చెందిన ఓ కుటుంబం తన ఏడేళ్ల బాలుడిని స్థానిక ప్రైవేట్ పాఠశాల లో చేర్పించింది. రెండో తరగతి చదువుతున్న ఆ చిన్నారి హోమ్‌వర్క్ పూర్తి చేయకపోవడంతో ప్రిన్సిపాల్ రీనా ఆగ్రహం వ్యక్తం చేసింది. స్కూల్లో డ్రైవర్‌గా పనిచేస్తున్న అజయ్ అనే వ్యక్తికి చిన్నారిని శిక్షించమని ఆదేశించింది. ప్రిన్సిపాల్ ఆదేశాలతో సదరు డ్రైవర్ బాలుడిని తాళ్లతో పాఠశాల కిటికీకి తలకిందులుగా వేలాడదీశాడు. అనంతరం చిన్నారిని దారుణంగా కొట్టాడు. అంతటితో ఆగని అజయ్ చిన్నారిని కొడుతున్న దృశ్యాలను తమ ఫ్రెండ్స్‌కు వీడియో కాల్ చేసి మరీ పైశాచిన ఆనందాన్ని పొందాడు. ఈ తతంగాన్ని అక్కడే ఉన్న వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా అదికాస్తా ప్రస్తుతం వైరల్‌గా మారింది. అంతేకాదు, పాఠశాల ప్రిన్సిపాల్ రీనా స్వయంగా చిన్న పిల్లల్ని కొడుతున్న వీడియో కూడా బయటకు వచ్చింది. ఈ వీడియోలు బయటకు రావడంతో స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది. పలుసార్లు పిల్లలను శిక్షగా టాయిలెట్లను కూడా శుభ్రం చేయిస్తున్నారని పలువురు ఆరోపించారు. ఈ అమానవీయ ఘటనపై బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మోడల్ టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. పలు సెక్షన్ల కింద ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై కేసు నమోదు చేశారు.




## మెలోనీ ఆత్మకథకు మోడీ ముందుమాట
### మన్ కీబాత్ శీర్షిక నుంచి ప్రేరణ పొందిన పుస్తకం
### ప్రధాని మోడీ ట్వీట్... సోషల్ మీడియాలో వైరల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడికి ప్రపంచ దేశాధినేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, నరేంద్రమోడి మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. పలు అంతర్జాతీయ వేదికలపై వీరు ఇరువురూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ అందరినీ ఆకర్షిస్తుంటారు. తాజాగా ఇటలీ ప్రధానమంత్రి మెలోని జీవిత 'ఐయామ్ జార్జియా– మై రూట్స్, మై ప్రిన్సిపల్స్' పేరిట మెలోనీ ఆత్మకథ రాసింది. అందులో ఆమె తన చిన్ననాటి జ్ఞాపకాలు, రాజకీయ, వ్యక్తిగత జీవితం, తల్లిదండ్రులు.. ఇలా తన జీవితంలో జరిగిన సంఘటనలను పొందుపరిచారు. అంతేకాదు, తాను ఎదుర్కొన్న సవాళ్లు, ఎన్నికల ప్రచార సమయంలో గర్భిణిగా, సింగిల్ పేరెంట్‌గా ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ ఆత్మకథ 2021లో తొలిసారి మార్కెట్‌లోకి వచ్చి బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఇటీవలే అమెరికాలో కూడా ఇది విడుదలైంది. ఇప్పుడు భారత్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు మెలోనీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెతో ఉన్న స్నేహబంధంతో ప్రధాని మోడి, మెలోనీ పుస్తకంలో ముందుమాట రాశారు. ఈ సందర్భంగా మెలోని ఆత్మకథను 'హర్ మన్ కీ బాత్' గా ప్రధాని అభివర్ణించారు. ఈ పుస్తకంలో ముందుమాట రాయడం తనకు గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. ఈ జీవిత చరిత్రకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తుందని మోడి ఆశాభావం వ్యక్తం చేశారు. తన రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' శీర్షిక నుంచి ప్రేరణ పొందిన పుస్తకం ఇది అని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్ట్ వైరల్ కావడంతో మెలోడీ మూమెంట్ మరోసారి తెరపైకి వచ్చింది. మెలోని పుస్తకాన్ని రూపా పబ్లికేషన్స్ ప్రచురించింది. జార్జియా మెలోని ఆత్మకథ భారతీయ ఎడిషన్ త్వరలో దేశంలో అందుబాటులోకి రానుంది.

## గ్యాంగ్‌రేప్‌పై వాయవ్యబంగ్లాదేశ్‌లో హోరెత్తిన నిరసనలు



**చిట్టగాంగ్, సెప్టెంబరు 29:** బంగ్లాదేశ్‌లో ఓ గిరిజన బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం స్థానికంగా జాతుల మధ్య చిచ్చు రాజేసింది. ఆదివాసీ తెగలకు, వలస వచ్చిన బెంగాలీ వర్గాలకు మధ్య చెలరేగిన తీవ్ర ఘర్షణల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, సైనికులు, పోలీసులు సహా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. భారీగా భద్రతా బలగాలను మోహరించినా హింస అదుపులోకి రాకపోవడంతో ఆగ్నేయ బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. భారత్‌మయన్మార్ సరిహద్దుల సమీపంలోని చిట్టగాంగ్ కొండ ప్రాంతమైన ఖగ్రాఛారి జిల్లాలో మంగళవారం ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ గిరిజన బాలిక ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా సామూహిక అత్యాచారానికి గురైంది. అర్ధరాత్రి సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గుర్తించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శనివారం నుంచి నిరసనలు ఉధృతం చేసి, టైర్లు కాల్చి, చెట్లను అడ్డంగా వేసి రహదారులను దిగ్బంధం చేశాయి. దీంతో ఆదివారం నాటికి ఈ ఆందోళనలు హింసాత్మక ఘర్షణలుగా మారాయి. ఖగ్రాఛారి జిల్లా కేంద్రంలో మొదలైన అల్లర్లు క్రమంగా ఇతర ప్రాంతాలకూ వ్యాపించాయి. ఇరు వర్గాల వారు ఒకరి వ్యాపార సముదాయాలపై, ఇళ్లపై మరొకరు దాడులు చేసుకుంటూ నిప్పు పెట్టారు. దీంతో జిల్లా కేంద్రానికి 36 కిలోమీటర్ల దూరంలోని గుయిమారా ప్రాంతంలో పరిస్థితి చేయిదాటింది. అక్కడ జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అహ్సన్ హబీబ్ మీడియాకు తెలిపారు. మృతదేహాలను ఖగ్రాఛారి సదర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. మృతులు ఏ వర్గానికి చెందినవారో అధికారులు వెల్లడించలేదు. ఈ ఘర్షణల్లో 13 మంది సైనికులు, ముగ్గురు పోలీసులు కూడా గాయపడినట్లు హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం ఖగ్రాఛారి పట్టణంలో, సమీప ప్రాంతాల్లో సెక్షన్ 144 విధించింది. సైన్యం, సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్), పోలీసులు గస్తీ కాస్తున్నప్పటికీ, ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయ పడుతున్నారు. అక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొందని స్థానిక జర్నలిస్టులు తెలిపారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్ హోం శాఖ, తక్షణమే దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది. ప్రజలందరూ సంయమనం పాటించాలని కోరింది. కాగా, బాలికపై అత్యాచారం కేసులో సైన్యం సహాయంతో ఓ బెంగాలీ యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు, కోర్టు ఆదేశాలతో ఆరు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు.



## అహల్యనగర్‌లో ఐలవ్ మహ్మద్ ముగ్గులు
### పోలీసులతో నిరసనకారుల వాగ్వాదం
### 30 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ముంబయి, సెప్టెంబరు 29:** మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో ఒక రోడ్డుపై వేసిన రంగోలిలో ఐలవ్ మహ్మద్ అని రాయడంతో తీవ్ర ఉద్రిక్తతలకు తావచ్చింది. కొంతమంది నిరసనకారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని అదుపుచేసేందుకు పోలీసులు స్వల్ప లాఠీఛార్జికూడా చేయాల్సి వచ్చింది. వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసి 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ శాంతిని భగ్నంచేసేందుకు కొందరు ఈ కుట్రలకు పాల్పడినట్లుగా ఉందని, సమగ్ర దర్యాప్తుచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసుల వివరాలప్రకారం అహ్మద్‌నగర్‌లో ఒక రోడ్డుపై వేసిన రంగోలిలో ఐలవ్ మహ్మద్ అని రాసారు. నవరాత్రి వేడుకల సందర్భంగా వేసిన రంగోలిలో కొందరు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసారని ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా రంగోలిల్లో వ్యాఖ్యలున్నాయన్నారు. ఆ కులస్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేసారని, ఒక వ్యక్తిని అరెస్టుచేసామని, అయితే నిరసనకారులు శాంతించక హైవేను బ్లాక్‌చేయడంతో పోలీస్ చర్యకు దిగాల్సి వచ్చిందన్నారు. మతఘర్షణలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవని మహారాష్ట్ర సీఎం హెచ్చరించారు. ప్రస్తుతం తాను ప్రయాణంలో ఉన్నాన,ఇ వివరాలు తెలుసుకుని సగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇలాంటి చర్యలకు కొందరు దిగారని, వాటిని కూడా అణిచివేసామని గుర్తుచేసారు. అంతకుముందు యూపిలో ఈ స్లోగన్ వెలుగులోకి వచ్చింది. యుపిలోని కాన్పూర్‌లో ఐలవ్ మహ్మద్ అన్న నినాదాలతో బోర్డులు వేలాడదీయడంతో అక్కడ ఎఫ్ఐఆర్ నమోదు చేసి 24మందిని అరెస్టుచేసారు. ఈద్‌మిలాద్ ఉన్‌నబీ ఊరేగింపు సందర్భంగా ఈ సంఘటన జరిగింది. హిందూ సంస్థలు ఈ తీరును తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది కేవలం రెచ్చగొట్టే వైఖరి మాత్రమేనని అన్నారు. ఇదే అదునుగా ఐలవ్‌ముహమ్మద్ పోస్టర్లు దేశంలో పలుచోట్ల వెలిసాయి.

## కన్సల్టెంట్‌గా రూ.241కోట్లు సంపాదించా: ప్రశాంత్‌కిశోర్




**పాట్నా, సెప్టెంబరు 29:** ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్ సురాజ్ నిధుల గురించి బీజేపీ ఎంపీ సంజయ్ జైస్వాల్ ప్రశ్నించారు. షెల్ కంపెనీల ద్వారా ఆయన కోట్లు సేకరించారని ఆరోపించారు. 'నష్టాల్లో నడుస్తున్న కంపెనీలు ప్రశాంత్ కిషోర్‌కు మాత్రమే కోట్ల రూ పాయలు ఎందుకు ఇస్తాయి కాంగ్రెస్ పాలనలో(కేంద్రంలో) ప్రతి గ్రామస్తుడికి 'స్కామ్' అనే పదం తెలిసినట్లే, ప్రశాంత్ కిషోర్ ద్వారా రౌండ్‌ట్రిప్పింగ్ అంటే ఏమిటో అందరికీ తెలుస్తుంది' అని అన్నారు. ప్రశాంత్ కిషోర్ ఈ వ్యాఖ్యలపై స్పందించారు. పార్టీ నిధులు పారదర్శకంగా, క్లీన్‌గా ఉన్నాయని తెలిపారు. పలు సంస్థలకు తాను కన్సల్టెంట్‌గా పనిచేసి మూడేళ్లలో రూ.241కోట్లు సంపాదించినట్లు తెలిపారు. 'నేనురూ.31కోట్లు జీఎస్టీగా, రూ.20 కోట్లు ఆదాయపు పన్నుగా చెల్లించా. రూ. 98కోట్లు చెక్ చెల్లింపు ద్వారా జన్‌సురాజ్‌కు విరాళంగా ఇచ్చా'అన్నారు. పార్టీ ఖాతాలకు చెల్లింపులన్నీ చెక్కుల ద్వారా జరిగాయని తెలిపారు. ఇతర వనరుల నుంచి కూడా విరాళాలు అందినట్లు చెప్పారు. మరోవైపు సొంత రాష్ట్రమైన బీహార్‌ను మార్చాలన్న లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చి నట్లు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. 'నేను డబ్బు సంపాదించడానికి బీహార్ రాలేదు. నా దగ్గర ఉన్న ప్రతి రూపాయి ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్నది. ఈ వ్యవస్థ మారే వరకు పదేళ్ల పాటు నేను బీహార్‌లోనే ఉంటా' అని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తన పార్టీ పోటీ చేస్తుందని ఇప్పటికే ఆయన స్పష్టం చేశారు.

# రాహుల్ ఛాతీలో బుల్లెట్ దించుతా!


### బిజెపి నేత వివాదాస్పద వ్యాఖ్యలు
### అమిత్ షాకు కెసి వేణుగోపాల్ లేఖ
### బిజెపి- ఆర్‌ఎస్‌ఎస్‌పై నేతల ఆరోపణలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** 'రాహుల్ గాంధీని ఛాతిలో బుల్లెట్ దించి చంపుతా' అంటూ ఏబీవీపీ కేరళ మాజీ చీఫ్, బీజేపీ అధికార ప్రతినిధి ప్రింటు మహదేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరువనంతపురంలో ఓ టీవీ చర్చా వేదికలో ప్రింటు మహదేవ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి బహిరంగంగా హత్య బెదిరింపులు రావడం దేశ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. టీవీ చర్చా వేదికలో మహదేవ్ చేసిన వ్యాఖ్యలు పొరపాటున వచ్చినవి కావని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని పేర్కొన్నారు. 'ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేతలకు ఇచ్చిన అత్యంత భయంకరమైన, దారుణమైన హత్య బెదిరింపు. అధికార పార్టీకి చెందిన అధికార ప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాహుల్ గాంధీ ప్రాణాలకు తక్షణ ముప్పు కలిగించడమే కాకుండా, రాజ్యాంగాన్ని, శాంతిభద్రతలను కూడా బలహీనపరుస్తుంది' అని వేణుగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ భద్రతకు సంబంధించి సీఆర్‌పీఎఫ్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖ కూడా మీడియాకు లీక్ కావడం వెనుక ఉన్న ఉద్దేశాలపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. 'బీజేపీ సృష్టించిన విద్వేషపూరిత వాతావరణం కారణంగానే వారి నేతలు ఇలాంటి బెదిరింపులకు పాల్పడేంత ధైర్యం చేస్తున్నారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది' అని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. వీటిపై ప్రభుత్వం తక్షణం స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే, ఈ హింసను మీరు ప్రోత్సహిస్తున్నట్లుగానే భావించాల్సి ఉంటుందని అమిత్ షాకు రాసిన లేఖలో వేణుగోపాల్ స్పష్టం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీకి ఇలాంటి బెదిరింపులు రావడం ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన దాడిగా అభివర్ణించారు. రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని ప్రింటు మహదేవ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. బీజేపీ– ఆర్‌ఎస్‌ఎస్‌పై తన దాడిని తీవ్రతరం చేసింది. సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోతున్న వారు, వారి దొంగతనం బయటపడిన వారు ప్రతిపక్ష నాయకుడి నోరు మూయించడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపణలు గుప్పించింది. మహదేవ్ వ్యాఖ్యలు హేయమైనవి, హత్య బెదిరింపు అని కాంగ్రెస్ మీడియా సెల్ ఇన్‌చార్జి పవన్ ఖేరా ధ్వజమెత్తారు. తక్షణమే అతడిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 'సర్'తో ప్రజల హక్కులకు హాని కలిగించొద్దు
### ఎన్నికల సంఘాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



**తిరువనంతపురం, సెప్టెంబరు 29:** ప్రతిపాదిత ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ (ఎస్ఐఆర్)పై సందేహాలను వ్యక్తం చేస్తూ, ప్రజల హక్కులకు హాని కలిగించే చర్యలకు ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఓటర్ల జాబితాను న్యాయంగా, పారదర్శకంగా సవకరించాలని కోరింది. ఓటర్లకు నిర్దేశించిన అర్హత నిబంధనలపై కేరళ అసెంబ్లీ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అలాగే పౌరసత్వాన్ని మతం ఆధారితంగా చేయడానికి ప్రయత్నించే పౌరసత్వ చట్టాన్ని పునరుజ్జీవించజేయడానికి ప్రయత్నిస్తున్న విభాగాలు ఎస్ఐఆర్‌ని ఏవిధంగా ఉపయోగిస్తారని, ఇది ప్రజాస్వామ్యానికి అది పెద్ద సవాల్ అని తీర్మానం పేర్కొంది. మైనారిటీ వర్గాలు, మహిళలు, పేద కుటుంబాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ప్రవాస భారతీయుల ఓటింగ్ హక్కులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న క్రమంలో.. ఆ రాష్ట్రంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) కలిసి అందుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానానికి ప్రతిపక్ష కూటమి మద్దతు తెలిపింది. దాంతో తీర్మానం ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందింది. ఎన్నికల జాబితాలో ప్రత్యేక అత్యవసర సవరణ అనేది దేశంలో నేషనల్ పాపులర్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్) అమలుకు వెనుక ద్వారం లాంటిదని తీర్మానంలో పేర్కొంది. కాగా కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడ్డాయని, ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో అధికార బీజేపీకి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తోందని దేశంలోని విపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు.



## రూ. లక్షకోట్లు దాటేస్తున్న ఐపిఒలు..

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 29:** భారత ఐపీఓ మార్కెట్ 2025లో సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతోంది. ఇప్పటికే కంపెనీలు భారీగా నిధులు సమీకరించగా, అక్టోబర్‌లో రానున్న రెండు పెద్ద ఐపీఓలతో ఈ ఏడాది కార్పొరేట్‌రంగంలో లక్ష కోట్ల రూపాయల మైలురాయిని అధిగమించనున్నాయి. ఇది భారత ప్రైమరీ మార్కెట్ల చరిత్రలో మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 74 మెయిన్‌బోర్డ్ కంపెనీలు ఐపీఓల ద్వారా సుమారు రూ. 85,000 కోట్లను సమీకరించాయి. అక్టోబర్ నెలలో రానున్న రెండు కీలక ఐపీఓలు ఈ మైలురాయిని అధిగమించేందుకు తోడవుతున్నాయి. టాటా క్యాపిటల్ సంస్థ రూ.16,000 కోట్ల భారీ ఐపీఓతో అక్టోబర్ 6 నుంచి 8 వరకు మార్కెట్లోకి రానుంది. అదేవిధంగా, వీవర్క్ ఇండియా కూడా రూ. 3,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో అక్టోబర్ 3నుంచి 7 మధ్య తన ఐపీఓను ప్రారంభించనుంది. ఈ రెండు ఆఫరింగ్‌లతో కలిపి 2025లో మొత్తం నిధుల సమీకరణ రూ. లక్ష కోట్లు దాటనుంది. గతంలో 2021, 2024 సంవత్సరాల్లో మాత్రమే ఐపీఓ మార్కెట్ ఈ ఘనతను సాధించింది. 2021లో 63 ఐపీఓల ద్వారా రూ. 1.19 లక్షల కోట్లు సమీకరించగా, 2024లో 91 ఐపీఓలు కలిసి రూ. 1.6 లక్షల కోట్లు రాబట్టాయి. ఈ ఏడాది ఆ రికార్డులు కూడా బద్దలయ్యే అవకాశాలున్నాయి. ఎల్‌జీ ఇండియా కూడా అక్టోబర్ ప్రథమార్ధంలో రూ. 15,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతుండటంతో, సమీకరణలు మరింత పెరుగుతాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, గ్రో, ఫైన్ ల్యాబ్స్ వంటి మరిన్ని పెద్ద సంస్థలు కూడా ఈ ఏడాది చివరి నాటికి మార్కెట్లోకివచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కేవలం మెయిన్‌బోర్డ్ ఐపీఓలే కాకుండా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్ఎంఈ) విభాగం కూడా ఈఏడాది అద్భుతమైన పనితీరు కనబరుస్తోంది. 2025లో ఇప్పటివరకు 207 ఎస్ఎంఈ ఐపీఓలు రూ. 9,129 కోట్లు సమీకరించి, గత వార్షిక రికార్డులన్నింటినీ అధిగమించాయి. ఒక్క సెప్టెంబర్ నెలలోనే 53 కంపెనీలు రూ. 2,309కోట్లు సేకరించడం ఈ విభాగానికి సంబంధించి ఆల్‌టైమ్ రికార్డు.

## సంక్షిప్తంగా..

### నేను ఎక్కడికి పారిపోను : నేపాల్ మాజీ పిఎం ఓలి




**కఠ్మాండూ, సెప్టెంబరు 29:** ఇటీవల నేపాల్‌లో జరిగిన జెన్–జెడ్ ఆందోళనల నేపథ్యంలో నేపాల్ మాజీ ప్రధాని కెపి శర్మ ఓలి దేశం వీడి వెళ్లనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై ఓలీ స్పందిస్తూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను దేశం విడిచి ఎక్కడికీ పారిపోనన్నారు. ఎటువంటి ఆధారంలేని ఈ ప్రభుత్వానికి దేశాన్ని అప్పజెప్పి తాను పారిపో తానని అనుకుంటున్నారా? అని పార్టీ యువ విభాగాన్ని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం తన భద్రత, అధికారిక హక్కులను రద్దుచేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని దేశంలోనే ఉండి తన రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తానని ఓలీ అన్నారు. దేశంలో శాంతిభద్రతలు, రాజ్యాంగ పాలనను తిరిగి పునరుద్ధరించడానికి కట్టుబడి ఉన్నాన న్నారు. సుశీలా కార్కి నేతృత్వంలోని పరిపాలనకు ఎటువంటి చట్టబద్ధత లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల తీర్పుతో కాకుండా విధ్వంసం శక్తుల ద్వారా అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఇప్పటికి కూడా తనకు బెదిరింపు సందేశాలు వస్తున్నాయన్నారు. నిరసనకారులు తన నివాసాన్ని ధ్వంసం చేయడంతో ప్రస్తుతం గుండు ప్రాంతంలోని అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.

### పాక్‌కు వ్యతిరేకంగా పిఒకెలో భారీ ఆందోళన




**ముజఫరాబాదల్, సెప్టెంబరు 29:** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో అక్కడి ప్రజలు భారీ ఆందోళనలు చేపట్టారు. అవామీ యాక్షన్ కమిటీ (ఎఎసి) నేతృత్వంలో కొనసాగుతున్న ఈ నిరసనలను మరింత ఉధృతం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా తమను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతున్నట్లు నిరసనకారులు తెలిపారు. 70 యేళ్లకుపైగా పిఒకెలోని ప్రజలకు ప్రాథమిక హక్కులు కూడా కల్పించలేదని అవామీ కమిటీ నేత షౌకత్ నవాజ్ మీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఒకెలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని, తమ 38 డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'షటర్–డౌన్.. వీల్–జామ్' పేరుతో అవామీ యాక్షన్ కమిటీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పిఒకెలోని పలు ప్రాంతాల్లో పౌరులు పాక్ బలవంతపు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని నినాదాలు చేస్తూ రోడ్లపైకి వచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్ల విషయంలో చర్చలు జరపడానికి ముందుకు రావాలని అవామీ యాక్షన్ కమిటీ కోరింది. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే నిరసనలను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది.

### అసోం బిటిసి ఎన్నికల్లో బోడోపీపుల్స్ ఫ్రంట్ గెలుపు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు29:** అస్సాంలో అధికార బీజేపీకి గట్టి షాక్ తగిలింది. 2026లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ (బిటిసి) ఎన్నికల్లో కమలం పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. 40 స్థానాలకు గానూ ఆ పార్టీ కేవలం ఐదు స్థానాల్లోనే గెలుపొందింది. ది బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) 28 స్థానాల్లో గెలుపొంది అధికారం చేజిక్కించుకుంది. ఇప్పటివరకు బీజేపీ, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) కలిసి కౌన్సిల్ పాలనా పగ్గాలు చేపట్టాయి. తాజా ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన బీజేపీ.. అతిపెద్ద పార్టీగా లేదా కింగ్‌మేకర్‌గా నిలవాలని భావించింది. అయితే ఆ పార్టీ ఆశలపై ప్రజలు చావుదెబ్బ కొట్టారు.

### లారెన్స్‌బిష్ణోయ్ గ్యాంగ్‌ను 'ఉగ్ర'సంస్థగా ప్రకటించిన కెనడా



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 29:** మాఫియా గ్యాంగ్‌నడిపిస్తున్న లారెన్స్‌బిష్ణోయ్ ఆతడి గ్యాంగ్‌ను కెనడా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. కెనడా తన నేరస్మృతి చట్టాలనుఅనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నదని ప్రజాభద్రతా మంత్రి గ్యారీ ఆనంద సంగారీ సోమవారం ప్రకటించారు. హత్యలు, దోపిడీలు,ఆయుధాలు, డ్రగ్స్ స్మగ్లింగ్‌తో ఢిల్లీలో నోటోరియస్‌గా మారిన లారెన్స్ బిష్ణోయ్ కెనడాలో ఉన్నట్లు భారత్ అనుమానించిన సంగతి తెలిసిందే. నగదు చోరీనుంచి వాహనాలు,ఆస్థుల ఆక్రమణ వంటివి అన్నింటినీ స్వాధీనంచేసుకుంటామని కెనడియన్ చట్టాలను అను సరించి గ్యాంగ్‌సభ్యులపై వివిధ నేరాలకింద ప్రాసిక్యూట్ చేస్తామని ప్రకటించింది.

## పోలీసు హౌసింగ్ బోర్డు కార్యాలయంలో ఘనంగా ఆయుధ పూజ

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డులో సోమవారం ఆయుధపూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు ఎండి ఎం. రమేష్ తమ విభాగంలోని ఆయుధాలకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పోలీసు శాఖలో ఆయుధ పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుండగా దీనిని పోలీసు హౌసింగ్ బోర్డు కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించకుండా ఎన్నికల నిర్వహణ సరికాదు

### మాజీ సర్పంచ్‌ల జెఎసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌ల బిల్లుల చెల్లించకుండా ఎన్నికలు నిర్వహించడం సరికాదని మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో సిఎం సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావును కలిసి సిఎం రేవంత్ రెడ్డికి తాను రాసిన బహిరంగ లేఖను అందజేశారు. 2019 నుంచి 24 వరకు గ్రామాభివృద్ది చేసిన సర్పంచుల బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు తగదని, ఇప్పటికే అనేకమంది సర్పంచులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూలు రిలీజ్ చేయడంతో బిల్లులు చెల్లించకుండా మరీ ఇబ్బంది దులు నెట్టేసిన పరిస్థితులు కనపడుతున్నాయని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామపంచాయతీల కార్యాలయాల కార్యదర్శులకు 104 కోట్లు రిలీజ్ చేయడం బాగానే ఉందన్న ఆయన సర్పంచులు మీకు ఏం పాపం చేశారని మామీద ఈ కక్ష సాధింపు అని లేఖలో ప్రశ్నించారు. ఇప్పటికైనా మీరు ఎన్నికలు నిర్వహించేలోపు మా బిల్లును చెల్లింపులో భరోసా కల్పించాలని, సీఎంను లేఖలో కోరారు.

## 47 మంది వ్యవసాయ విస్తరణాధికారులకు పదోన్నతులు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది వ్యవసాయ విస్తరణాధికారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రమోషన్లను కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. మల్టీ జోన్1 పరిధిలో పనిచేస్తున్న 29 మంది వ్యవసాయ విస్తరణాధికారులు, మల్టీ జోన్2 పరిధిలో పనిచేస్తున్న 18 మంది వ్యవసాయ విస్తరణాధికారులకు పదోన్నతి కల్పించారు. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయించింది.

## వడ్డీ వ్యాపారుల నుండి రైతులకు విముక్తి

### మనీ లెండింగ్ యాక్ట్ తెచ్చిన సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో వడ్డీ వ్యాపారుల దోపిడీ నుంచి రైతులను రక్షించేందుకు రాష్ట్ర సర్కార్ మనీ లెండింగ్యాక్ట్ తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఈ యాక్ట్ 1349ను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. పంట పెట్టుబడుల కోసం తప్పని సరి పరిస్థితుల్లో అన్నదాతలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. వడ్డీ వ్యాపారులు వేస్తున్న అధిక వడ్డీభారంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, దీంతో అసలు, వడ్డీ కలిపి చెల్లించలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని గతంలో రాష్ట్ర రైతు కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో వాటిని తీర్చలేని అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. రైతు కమిషన్ నివేదికలోని పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మనీలెండింగ్ యాక్ట్ అమలు కఠినంగా చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది.

## అశ్వారావుపేటలో కొత్తగా పామాయిల్ ఫ్యాక్టరీకి కృషి

### ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో, అందుకు అనుగుణంగా గెలల దిగుబడిని దృష్టిలో ఉంచుకొని అశ్వారావుపేట లో కొత్తగా ఫ్యాక్టరీ నిర్మాణానికి కృషి చేస్తామని తెలంగాణ కోపరేటివ్ ఆయిల్ సీడ్ (గ్రోయర్స్) ఫెడరేషన్ (టిజి ఆయిల్ ఫెడ్) ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. పామాయిల్ సాగు విస్తరణలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆయన ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట, అశ్వారావుపేట మండలం నారం వారి గూడెం ఆయిల్ పామ్ నర్సరీని, ఫ్యాక్టరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అప్పారావుపేట ఫ్యాక్టరీని పరిశీలించి ఉద్యోగులు, సిబ్బందితో రివ్యూ చేశారు. అనంతరం అశ్వారావుపేట ఫ్యాక్టరీలో గెలల క్రషింగ్ పవర్ ప్లాంట్ ను తనిఖీ చేసి వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కల్లూరుగూడెంలో కొత్తగా పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోందన్నారు.

# రోడ్లకు వరద నష్టాలపై అంచనాలు వేయండి

### టిమ్స్ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, ఐడిఒసిలను వేగంగా చేపట్టాలి

### అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించి వాటి తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల అంచనాలు రూపొందించాలని ఆర్అండ్‌బి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బి శాఖ పరిధిలోని పలు పనుల పురోగతిపై సోమవారం మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తుది దశకు చేరుకున్న ములుగు, వరంగల్, కరీంనగర్ జిల్లాల కలెక్టరేట్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేందుకు అధికారులు రేయింబవళ్లు కష్టపడాలన్నారు. నారాయణపేట, ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ల పనుల్లో వేగం పెంచాలని, ఆర్అండ్‌బి పరిధిలో నిర్మితం అవుతున్న ప్రతి భవన నిర్మాణాలు ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పునరుద్ఘాటించారు. నేషనల్ హైవేలు, పురోగతిలో ఉన్న ఫ్లై ఓవర్లపై ఆరా తీసిన మంత్రి... పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహిస్తానని, ముఖ్యమంత్రితో మాట్లాడి హ్యామ్ రోడ్లపై ఒక స్పష్టమైన విధానాన్ని తీసుకువస్తామని మంత్రి అధికారులతో అన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పూర్తి స్థాయి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, శాశ్వత పునరుద్ధరణ కోసం మళ్ళీ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని ఈఎన్‌సి మోహన్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు. ఈఎన్‌సి మాట్లాడుతూ .. 1062 ప్రాంతాల్లో, 1370 కి.మీ స్టేట్ రోడ్స్ దెబ్బతిన్నాయని, 68 రోడ్లు కోతకు గురికాగా, 38 తాత్కా లిక పునరుద్ధరణ చేసినట్టు.. ఓవర్‌ఫ్లో ఉన్న 520 గాను 478 చోట్ల తగ్గుముఖం పట్టాయన్నారు. 445 చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే, ఇప్పటికే 375 చోట్ల పునరుద్ధరణ చేసినట్టు తెలిపారు. సుమారు 306 కోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 72.49 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 1263.33 కోట్లు అవుతాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా టిమ్స్ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలు, ఇంటిగ్రేటెడ్ జిల్లా కలెక్టరేట్ల పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. టిమ్స్ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీల పనుల వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఈఎన్‌సి మోహన్ నాయక్, సిఈలు రాజేశ్వర్ రెడ్డి, బి.వి రావు, లక్ష్మణ్, ఎం.శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రావు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ప్రభుత్వం : మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** జర్నలిస్టులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియాఅకాడమి ఆడిటోరియంలో జర్న లిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మీడియా రంగంలో వృత్తిని కొనసాగిస్తూ అమరులైన జర్నలిస్టులకు జోహార్లు అర్పించారు. జర్న లిస్టులు సమాజంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తారన్నారు. అదేవిధంగా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు అని అన్నారు. చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించడం వలన ఆయా కుటుం బాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అదే విధంగా జర్నలిస్టులకు వృత్తి ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో ఇండ్లు లేని జర్నలి స్టులకు ఇండ్లను కేటాయించాలని, మరణించిన కుటుంబాలకు హెల్త్ కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి తెలియజేశారు.

సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ, మీడియా అకాడమి భవనం బహుళ అంతస్తులలో కొనసాగుతున్నందున అందులో శిక్షణ కోసం ఆడిటోరియం ఉండడంతో జర్నలిస్టులకు ఏ.ఐ., సోషల్ మీడియా, భాషపై పట్టు కోసం నిరంతరం జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సౌకర్యార్థం కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, 18 మంది మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల ప్రతి కుటుంబానికి ఒక లక్ష రూపాయలు, అయిదు సంవత్సరాల వరకు పెన్షన్ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రమాదాలు/ దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన ఆరుగురు వర్కింగ్ జర్నలిస్టులకు లక్ష రూపాయలు,ఒక జర్నలిస్టుకు యాభై వేలు, మొత్తం 24 లక్షల 50 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేయడం జరిగింది. ఇప్పటికే కొన్ని జిల్లాలలో శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు.

# జాతీయస్థాయి సాంస్కృతిక వారధిగా బతుకమ్మ సంబురాలు

### సాంస్కృతిక, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

### 29 రాష్ట్రాల నుండి హాజరైన మహిళా ప్రతినిధులు

### ఆట-పాట, నృత్యాలతో అంబరాన్నంటిన తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** భారతీయ సాంస్కృతిక, సంప్రదాయ వారసత్వంగా వందలయేళ్ల తరబడి వస్తున్న బతుకమ్మ పండుగ సంబరాలు జాతీయస్థాయి సాంస్కృతిక వారధిగా నిలుస్తుందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, పురావస్తుశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక జాతీయ వేదిక రవీంద్రభారతిలో గత 9రోజులుగా జరుగుతున్న బతుకమ్మ సంబరాలకు కల్చర్, లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్ (క్లిక్) అనే సంస్థ నిర్వహణలో వినూత్నరీతిలో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని మొత్తం 29 రాష్ట్రాల నుండి మహిళా ప్రతినిధులను ఆహ్వానించి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల గురించి పరిచయం చేయడం హర్షదాయకమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా ఒకరి సంస్కృతిని మరొకరు తెలుసుకోవడం, పరస్పర సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఈ సంబరాలు దేశంలో ఏదో ఒక ప్రాంతానికి పరిమితం అయినట్లు కనిపించినా అంతర్గతంగా చూస్తే అన్ని రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఉత్సవాలు ఏదో ఒక రూపంలో ఉంటాయని, వాటిని అందరూ తెలుసుకొని జరుపుకోవాలని జూపల్లి చెప్పారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన వెనువెంటనే ఇంతటి మహోన్నత కార్యక్రమాలు అద్భుతం, విజయవంతంగా నిర్వహించడం ఆయన కార్యదీక్ష, పట్టుదలకు నిదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి తెలుగురాష్ట్రాల నుండి కన్వీనర్లు వ్యవహరిస్తున్న జి.అన్నపూర్ణ, కె.వీణలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో దసరా నవరాత్రుల 9రోజులూ మట్టితో బొమ్మలుచేసి అందులో అమ్మవారిని ఆవాహనచేసి పూజిస్తే... తెలంగాణలో ప్రకృతిలోని పూలతో బతుకమ్మలలను చేసి వివిధ నామకరణలతో బతుకమ్మను పలురకాలుగా ఆరాధిస్తారని, రెండూ ప్రకృతికి సంబంధించిన పండుగలే అన్నారు. అన్నిరాష్ట్రాల్లోనూ అమ్మవారిని వారివారి సంస్కృతి సంప్రదాయాలనుబట్టి ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధించడం దేశవ్యాప్తంగా ఉందని తెలిపారు. అన్నిరాష్ట్రాల ప్రతినిధులు ఒక్కచోట కలిసి ఐకమత్యంతో చర్చించుకోవడం ఎంతో ఆనందం, స్ఫూర్తిదాయకంగా ఉందని ఆనందోత్సాహాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాసంస్థలకు చెందిన 60మందికిపైగా కూచిపూడి నృత్యకారిణులు పాల్గొని తమ నాట్య విన్యాసాలతో తన్మయుల్ని చేశారు.



పుష్పాలతో 29 రాష్ట్రాల మహిళా ప్రతినిధులను ఆహ్వానిస్తున్న క్లిక్ సంస్థ బాధ్యులు

# పిహెచ్‌డి కేటగిరీ-2లో 667 మందితో భర్తీ పూర్తి

### 12 ఫ్యాకల్టీల్లో అడ్మిషన్లు చేపట్టిన ఉస్మానియా యూనివర్సిటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో కేటగిరీ-2 పిహెచ్‌డి ఫలితాలను సోమవారం ప్రకటించింది. 12 ఫ్యాకల్టీలలో ఉన్న 667 పిహెచ్‌డి పరిశోధక విద్యా ఖాళీలు భర్తీ అయినట్టు యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి ప్రకటించారు. ప్రవేశ ప్రక్రియలో భాగంగా అర్హత ప్రమాణాల క్షుణ్ణమైన పరిశీలన, కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి), ప్రవేశ ఫలితాల ప్రకటన, అకడమిక్ మెరిట్, అందుబాటులో ఉన్న ఖాళీలు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా తుది షార్ట్‌లిస్టింగ్ కోసం వివరంగా నిర్వహించిన ఇంటర్వ్యూ దశ వంటి అనేక దశలు ఇందులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ల ప్రక్రియను పారదర్శకంగా, వృత్తిపరంగా నిర్వహించినందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అభినందించారు. 12 ఫ్యాకల్టీల డీన్‌లు, విభాగాల అధిపతులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌లు, ప్రిన్సిపాల్స్, సహాయక సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. వివిధ ఫ్యాకల్టీల నుండి 2,906 మంది అభ్య ర్థులు ఇంటర్వ్యూల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యా రు. సైన్స్ ఫ్యాకల్టీలో అత్యధికంగా 995 మంది అభ్య ర్థులు ఇంటర్వ్యూల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారు. ఆర్ట్స్ ఫ్యాకల్టీ నుండి 451 మంది, ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ నుండి 341 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. అత్యధికంగా 306 సీట్లు లభించాయి. ఆ తరువాత ఇంజనీరింగ్ ఫ్యాకల్టీకి 167 సీట్లు కేటాయించారు. ఆర్ట్స్‌లో 52 సీట్లు, కామర్స్‌లో 42 సీట్లు, ఎడ్యుకేషన్‌లో 17 సీట్లు, మేనేజ్‌మెంట్ 14 సీట్లు, ఓరియంటల్ లాంగ్వేజెస్ 13 సీట్లు, సోషల్ సైన్సెస్ 36 సీట్లు, ఇన్ఫర్మాటిక్స్ 4 సీట్లు, లా కోర్సులో 7 సీట్లు, ఫార్మసీలో 3 సీట్లు, టెక్నాలజీలో 6 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తం 667 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. తుది ఫలితాలు ఒయు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

# 'కాళేశ్వరం' సొమ్ముతో సభలు పెడుతున్న బిఆర్ఎస్

### బిజెపి నేత గువ్వల బాలరాజు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్న అవినీతి సొమ్ముతో బిఆర్ఎస్ జన గర్జన పేరుతో సభలు పెడుతుందదని బిజెపి నేత ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గువ్వల బాలరాజు మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అచ్చంపేటలో ఏం చెప్పారో ఎవరికి అర్థం కాలేదని సెటైర్‌లు వేశారు. బిఆర్ఎస్ నాకు ఏదో తక్కువయిందని బిజెపిలోకి రాలేదన్నారు. నేను మీ బండారం బయటపడితే ఒక్క అడుగు కూడా బయట పట్టలేరని అన్నారు. దుందుభి వాగులో ఇసుక రవాణాపై ఉద్యమం చేస్తామంటే బిఆర్ఎస్ ముందుకు రాలేదన్నారు. బిజెపి అధిష్టానంతో చర్చించి సిరిసిల్లలో సింహగర్జన చేస్తానన్నారు. రిజర్వేషన్లపై నిరుద్యోగ యువత వేసిన పిటిషన్ పై భిక్షాటన చేసైనా పెద్ద న్యాయవాదులతో న్యాయ పోరాటం చేస్తానన్నారు. ప్రజలకు అవసరం లేని పార్టీలను భూస్థాపితం చేయడమే నా ముందున్న లక్ష్యమన్నారు.



# పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు పరాభవం ఖాయం

### ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు పరాభవం తప్పదని నాగర్‌కర్నూల్ ఎంపి డా.మల్లు రవి అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందని వ్యాఖ్యా నించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లును ప్రవేశపెట్టి గవర్నర్ దగ్గరకు పంపించింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. మూడు నెలల వరకు బిల్లును క్లియర్ చేయకపోతే ఆమోదించినట్టుగానే భావించి ప్రభుత్వం అమలు చేయాలని సుప్రింకోర్టు స్పష్టం చేసిందన్నారు. తెలంగాణ హైకోర్టు అక్టోబర్ 30లోపే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చెప్పిందన్నారు.

ఈ నేపథ్యంలో 29వ తేదీన ఎన్నికల సంఘం లోకల్ బాడీ ఎలక్షన్ నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సంకల్పించారు. గతంలో ఎంతో మంది ఈ రిజర్వేషన్లపై రాజకీయాలు చేసినా అది కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే సాధ్యమైంది. రిజర్వేషన్ల విషయంలో ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించారు. అలా విమర్శించిన బిఆర్ఎస్ నేతలు తమ పశ్చాత్తాపాన్ని వ్యక్తపరచాలని డిమాండ్ చేస్తున్నామని మల్లు రవి డిమాండ్ చేశారు. ఈ సమయంలోనూ కూడా కెటిఆర్ అచ్చంపేట సమావేశంలో సిఎం గురించి ఇష్టానుసారంగా మాట్లాడారు. అధికారం నుంచి దిగిపోయినా, ప్రజలు ఛీకొట్టినా, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ముఖ్యమంత్రి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇప్పుడు సిఎం అమలు చేయని వాటిని ప్రజల ముందు పెడతామని అంటున్నారు. పెట్టిండి.. 10 ఏళ్లలో మీరు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని చెప్పారు. కానీ ఇవ్వలేదు. కానీ మేము ఒకటిన్నరేళ్లలో, నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్‌పై రాయితీ ఇస్తున్నాం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని. 65 వేల ఉద్యోగాలు టిజిపిఎస్‌సి ద్వారా ఇచ్చామన్నారు. తాము ప్రజలను మోసం చేయలేదన్నారు.

# నేడు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ 26వ స్నాతకోత్సవం

### ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, విద్యావేత్త ప్రేమ్‌రావత్‌లకు గౌరవ డాక్టరేట్లు

### డిగ్రీలో 35, పిజిలో 51 బంగారు పతకాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. స్నాతకోత్స వానికి ముఖ్యఅతిథిగా ఇగ్నో ఉపకులపతి ప్రొఫెసర్ ఉమా కాంజీలాల్ హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో ప్రజాకవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్నతోపాటు ప్రముఖ విద్యావేత్త ప్రేమ్‌రావత్‌లకు గౌరవ డాక్టరేట్లను అందజేయనున్నారు. డిగ్రీలో 35, పీజీలో 51 బంగారు పతకాలు, ఇద్దరు ఖైదీలకు బంగారు పతకాలను ఇవ్వనున్నారు. గవర్నర్, యూనివర్సిటీల ఛాన్సలర్ అయిన జిష్ణుదేవ్‌వర్మ స్నాతకోత్స వంలో పాల్గొంటారు. ముఖ్యఅతిథిగా ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూని వర్సిటీ (ఇగ్నో) న్యూఢిల్లీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమా కాంజీలాల్ హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారు. నేడు జరిగే 26వ స్నాతకోత్సవంలో 60,288 మంది అభ్యర్థులు డిగ్రీలు, డిప్లొమా సర్టిఫికెట్లు అందుకోనున్నారు. ప్రఖ్యాత కవి, గేయ రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తెలుగు సాహిత్య వ్యాప్తికి వారు చేసిన సేవలకుగాను, అదేవిధంగా ప్రఖ్యాత శాంతి విద్యాప్రచారకులు, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యకర విధానంలో పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంపొందించి, నేరాల శాతం తగ్గించడానికి కృషి చేస్తున్న విద్యా వేత్త ప్రేమ్ రావత్‌కి డాక్టర్ ఆఫ్ లెటర్స్ (హానరిస్ కాసా - గౌరవ డాక్టరేట్)తో సత్కరించనున్నారు. అండర్ గ్రాడ్యుయేట్‌లో 35,346 మంది, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో 24,942 మంది సర్టిఫికెట్స్ అందుకోనున్నారు. వివిధ జైళ్లలో విద్యభ్యసించిన 203 మంది ఖైదీ అభ్యర్థులు డిగ్రీలు పట్టాలు పొంద నున్నారు. ఇద్దరు ఖైదీలు గునకల్ యుగంధర్, యూజీలో.. దొప్పల్పూడి నాగరాజ కుమారి పిజిలో బంగారు పతకాలు అందుకోనున్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామిలు అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం సమావేశమయ్యారు. తెలంగాణ పోరాట యోధులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయడానికి ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోదరండరామ్ కోరారు. ఉద్యమకారులకు మేము ఇచ్చిన హామీలు అమలు చేసేలా కార్యాచరణ తీసుకుంటాం, మీ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం తెలిపారు.

తెలంగాణలో సామాజిక న్యాయం అమలుకోసం హైకోర్టులో రిజర్వేషన్ అమలుకు అఫిడవిట్ దాఖలు చేయాలని 42శాతం బిసిలకు రిజర్వేషన్ కల్పించేందుకు మీరు తొలిఅడుగు వేయాలని కోరారు.

# 12న విజయవాడలో ఒబిసిల జాతీయస్థాయి సదస్సు

### చట్టసభల్లో రిజర్వేషన్‌లు సాధిస్తాం: ఎంపి ఆర్.కృష్ణయ్య ధీమా

**హైదరాబాద్(సైఫాబాద్), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వే షన్‌లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అక్టోబరు 12న విజయవాడలో ఒబిసిల జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు సోమ వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దక్షిణ భారత బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన వేలాది మంది ఒబిసిలు పాల్గొంటారని చెప్పారు.

ముఖ్య అతిథులుగా నలుగురు కేంద్ర మంత్రులు, మేధావులు, ప్రొఫెసర్లు, 20 మంది వివిధ పార్టీలకు చెందిన ఎంపిలు పాల్గొంటారని తెలిపారు.

ఈ సదస్సు తరువాత హైదరాబాద్, బెంగళూరు, తమిళనాడు, ఢిల్లీలోనూ ఒబిసిల జాతీయ సదస్సులు నిర్వహించి ఒబిసిల సత్తా తెలియజేస్తామన్నారు. కుల గణన తరువాత అన్ని రంగాల్లో ముఖ్యంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగరంగాల్లో జనాభా ప్రాతిపదిక వాటా లభిస్తుందని, అన్ని కోణా ల్లో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మక మార్పు వస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో జబ్బాల శ్రీనివాస్, గుజ్జ సత్యం తదితరులు

# మావోయిస్టులపై కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు తీవ్రతరం

### సిపిఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఖండన

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** మావోయిస్టులతో చర్చలు లేవని, వారి అంతం చూస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మావో యిస్టులపై అమిత్ షా వ్యాఖ్యలు చాడ తప్పు పట్టారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో చర్చలు జరిపి ఆపరేషన్ కగారును వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యల పట్ల అభ్యంతర వ్యక్తం చేస్తూ .. దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదా? అని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టులు కానీ, కమ్యూనిస్టులు కానీ అంతరాలు లేని సమాజం రావా లనీ, సంపద అందరికీ చెందాలని కోరుకుం టారన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమం కూడా భూమికోసం భుక్తి కోసం స్వేచ్ఛ కోసం జరిగిందన్నారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించిన 78 సంవత్సరాలలో లక్షల కోట్లకు అంబానీ అదాని లాంటివారు పడగలెత్తారని.. కానీ తిండి లేక భిక్షాటన చేస్తున్న ప్రజలు చాలామంది ఉన్నారన్నారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత .. దేశంలో అంతరాలు మరింత పెరిగాయని, నిరుద్యోగం పెరిగిందని చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. కేంద్ర మంత్రి అమిత్ షా ఆపరేషన్ కగారు పేరుతో నక్సలైట్లను చంపడం పట్ల ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, ప్రగతిశీల శక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దేశానికి స్వాతంత్రం కూడా చర్చలు జరిపి తర్వాతనే సిద్ధించిందనీ .. అటువంటి నేపథ్యం లో మావోయిస్టుతో ఆర్థిక, సామాజిక చర్చలు జరిపి పరిష్కరించాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ముగ్గురు పిల్లలున్నవారు పోటీకి అనర్హులు

## ఎపిలో సడలింపు, తెలంగాణలో కొనసాగింపు

### ఆశావాహుల్లో తీవ్ర నిరాశ, సడలించాలని డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 29:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంది. అయితే, ఈ ఎన్నికల్లో పోటీ చేయాల నుకుంటున్న ఎంతోమంది ఆశావహులను ముగ్గురు పిల్లల నిబంధన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఎన్నికల ప్రకటనతో సంతోషించాలో, ఈ నిబంధన చూసి నిరాశ చెందాలో తెలియని గందరగోళంలో పలువురు నేతలు ఉన్నారు. షెడ్యూల్ విడుదలతో గ్రామాల్లో రాజకీయ సమీకరణాలు వేగవంతమయ్యాయి. అయితే, పోటీకి సిద్ధమవుతున్న వారిని పాత నిబంధన ఒకటి వెంటాడుతోంది. ప్రస్తుతం తెలంగాణలో అమల్లో ఉన్న పంచాయతీరాజ్ చట్టం ప్రకారం, ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. ఈ నిబంధన కారణంగా చాలా మంది నాయకులు పోటీకి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం ఈ నిబంధనను ఇప్పటికే రద్దు చేసింది. కానీ, తెలంగాణలో మాత్రం పాత నిబంధనే కొనసాగుతుండటం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో, ఈ ముగ్గురు పిల్లల నిబంధనపై ప్రభుత్వం ఏమైనా స్పష్టత ఇస్తుందా? అని ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఈ నిబంధనను సడలిస్తే ఎంతోమందికి అవకాశం లభిస్తుందని, లేకపోతే అనర్హత వేటు తప్పదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకోవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# సాగునీటి చెరువుల పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి

## సాగునీటి సంఘాల ఏర్పాటుకు సమాలోచనలు

### చిన్న సాగునీటి చెరువులు, కుంటలు, కాలువల భద్రతకు చర్యలు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంతంలో సాగునీటి చెరువులు, కుంటలు, కాలువల పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయా నుసారం సాగునీటి సంఘాల ఏర్పాటుపై సమాలోచనలు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. చెరువులు, కుంటలు, కాలువల భద్రత కోసం అన్ని విధాలుగా అధ్యయనం చేస్తున్నామని ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్ట పోవొద్దు అన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగా ప్రయోజనాలను కాపాడడంతో పాటు సాగునీటి అంశంలో ఎటువంటి అవాంతరాలు ఎదురు కాకుండా ఉండేందుకు వీలుగా సాగునీటి సంఘాల ఏర్పాటును పరిశీలనలోకి తీసుకున్నామన్నారు.

తాజగా సంభవించిన వర్షాలు ఉధృతికి చిన్న నీటిపారుదల శాఖా పరిధిలోని చెరువులు, కుంటలకు గండ్లు పడడం, కాలువలు తెగి పోవడం వంటి అంశాలతో పాటు కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచడం, సీతారామ, చనకాకొరటా, సీతమ్మ సాగర్, మోడీకుంట వాగు అనుమతులతో పాటు ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణపై సోమవారం సచివాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖా ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా నాథ్ దాస్, ఈఎన్‌సి లు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు లతో పాటు సిఈలు అజయ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్,పి.వి నాగేందర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం సాగునీటి సంఘాల ఏర్పాటు ఉండేలా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చిన్న సాగునీటి చెరువుల పరిరక్షణ నిమిత్తం సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసిన పక్షంలో క్రమ క్రమంగా భారీ నీటి తరహా ప్రాజెక్టులకు విస్తరించేందుకు దోహద పడుతుందన్నారు.

సాగునీటి సంఘంతో లష్కర్‌తో పాటు సిబ్బంది, నీటిపారుదల శాఖా ఆపరేషన్ మెయింటెనెన్స్ విభాగం సమన్వయం చేసుకుని పనిచేసేలా సమన్వయం చేయగలిగితే సత్ఫాలితాలు సాధించగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మొత్తం ఈ సంఘాలకు సంబంధిత డిప్యూటీ ఇంజినీర్ కన్వీనర్‌గా వ్యవరించేలా విధి విధానాలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 1997 నాటి నీటివనరుల అభివృద్ధి సంస్థ రూపొందించిన చట్టం ప్రకారమే సాగునీటి సంఘాలకు కాలువల నిర్వహణ,నీటి పంపిణీ, చెరువుల పరిరక్షణ బాధ్యత ఉంటుందని, నిబంధనలకు అనుగుణంగా సాగునీటి సంఘాలకు చట్టపరమైన, పాలనాపరమైన తోడ్పాటు ఉండేలా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. 201819 లో నీటి సెస్సు న రద్దు చేసిన మీదట సాగునీటి సంఘాలు కేవలము కాగితాలకే పరిమితము కావడంతో తాజాగా సంభవించిన వర్షపు ఉధృతికి చిన్న నీటిపారుదల చెరువులు, కుంటలు, కాలువలు దెబ్బతిన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా సాగునీటి చెరువులు, కుంటలు నిర్లక్ష్యానికి గురై పెద్ద ఎత్తున దెబ్బ తినడంతో రైతులు వర్షాకాలంలో భారీగా నష్ట పోతున్నారని ఆయన చెప్పారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న మీదట చెరువులు, కుంటలు, కాలువల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి సాగునీటి సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. సాగునీటి సంఘాల ఏర్పాటుతో సాగు నీటి నిర్వహణతో పాటు చెరువులు, కుంటలు,కాలువలకు భద్రత కలిపించే చర్యలు సాగునీటి సంఘాలకు బాధ్యత ఉండేలా చర్యలు ఉండేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అందుకనుగుణంగా సాగునీటి సంఘాలలో రైతుల ప్రాతినిధ్యం కోసం తెలంగాణా అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి ,కమిషన్ సభ్యుల సమన్వయంతో సాగునీటి సంఘాలను నామినేట్ చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ మేరకు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం చిన్న సాగునీటి చెరువులు నిర్లక్ష్యానికి గురవడంతో పాటు వర్షాలకు చెరువులకు గండ్లు పడి రైతాంగం నష్ట పోతున్న అంశాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నివేదిక రూపంలో అందించారు. అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు వీలుగా సాగునీటి సంఘాలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను ఆ బృందం వివరించింది. మంత్రివర్గ ఆమోదం పొందిన మీదట ఎస్ఎల్‌బిసి పనుల పునరుద్ధరణ ఉంటుందన్నారు.





# కొత్త పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

## లండన్‌లో కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 28:** కొత్త పార్టీ ఏర్పాటుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతానని వ్యాఖ్యానించారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులతో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ జాగృతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలన్నదే తన సంకల్పమని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం తమ సంస్థ పనిచేస్తుందని వెల్లడించారు. ప్రజల జీవితాల్లో మార్పు తేవడంపై తమకు స్పష్టమైన ఆలోచన ఉందని కవిత అన్నారు. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని, తనకు తప్పనిసరిగా అవకాశం వస్తుందని ఆమె వ్యాఖ్యా నించారు. అప్పటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలని కవిత అన్నారు. తన వెనుక ఏ జాతీయ పార్టీ లేదని కవిత పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని, తెలంగాణను భ్రష్టు పట్టిస్తోందని మండిపడ్డారు. ఇక బీజేపీ డీఎన్ఏ తనకు సరిపడదని తెలిపారు.ఇరవై ఏళ్ల పార్టీ కోసం పని చేశానని కవిత తెలిపారు. కొందరిలో స్వార్థం పురుడు పోసుకుందని, వారి వల్ల కోట్లాది మంది బాధపడవద్దనే తన తపన అన్నారు. పార్టీలో చీలికలు రావొద్దనే ఎంతటి ఇబ్బందినైనా తట్టుకొని నిలబడ్డానని, పార్టీలో చాలా అవమానాలు ఎదుర్కొన్నానని అన్నారు. తన ఓటమి మొదలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి వరకు ఎన్నో కుట్రలు జరిగాయని ఆమె ఆరోపణలు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆ తర్వాత మాట్లాడవలసి వచ్చిందని కవిత అన్నారు. పార్టీ తనను వద్దుకున్నదని, అందుకే పార్టీ ఇచ్చిన పదవిని వదులుకున్నానని కవిత అన్నారు. కష్టమవుతుందని తెలిసినా కేసీఆర్ బిడ్డగా ధైర్యంగా పంథాను ఎంచుకుంటానని కవిత అన్నారు. జైలు జీవితం తనలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని కవిత అన్నారు. నిజమైన మార్పు కోసం తెలంగాణ ఉద్యమకారులు ఒక్కటై పనిచేయాలని పిలుపునిచ్చారు.

# బిజెపి బలంగా ఉంది

## స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

## ఎక్కువ సీట్లు గెలుచుకుంటాం

## 42శాతం రిజర్వేషన్‌లకు మద్దతు

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని స్థానాలకు తాము ఒంటరిగా పోటీ చేసి ఎక్కువ స్థానాలను గెలుచుకుంటామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియా మాట్లాడారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ ను స్వాగతిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికలు జరిగితేనే కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు. ఇప్పటికే గ్రామాలలో పాలన కుంటు పడిందన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లకు తాము మద్దతిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ జిఒ గతంలోనే ఇచ్చి ఉంటే సమస్య వచ్చేది కాదన్నారు. ఎన్నికల షెడ్యూల్ నిలబడుతుందని తాను నమ్ముతున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ప్రెసిడెంట్, గవర్నర్, బిజెపి అడ్డు కుంటుందని, కిషన్ రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారని డ్రామాలు ఆడారన్నారు. ఇన్ని రోజులు ఎన్నికలు నిర్వహించకుండా సాకులతో ప్రభుత్వం ఇన్నాళ్ళు కాల యాపన చేసిందని అన్నారు. రాష్ట్రప్రజలు బిజెపితోనే ఉన్నారని అన్నారు.

# బెంచ్‌మార్క్ సూచీల్లో స్వల్పనష్టాలు

## ట్రేడర్లు పెట్టుబడులు విత్‌డ్రాకే ఆసక్తి

**ముంబయి, సెప్టెంబరు 29:** బెంచ్‌మార్క్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఈ వారం చివరలో ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలనుప్రకటిస్తు వడ్డీ రేట్లపై కీలక ప్రకటన చేయనున్నది. ఆర్బీఐ ఎంపిసి సమీక్ష నిర్ణయాలు వెలువడే లోపే విదేశీ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ క్రమంలో మార్కెట్లు స్వల్పంగా అస్థిరతకు గురయ్యాయి. యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి ఏడు పైసలు తగ్గి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి 88.79 వద్ద ముగిసింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 60 పాయింట్లకుపైగా పతనమైంది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం 80,588.77 లాభాల్లో మొదలైంది. మధ్యాహ్నం ఒక్కసారిగా మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరి సెషన్‌లో మార్కెట్లు కోలుకోవడంతో నష్టాలు తగ్గాయి. ఇంట్రాడేలో 80,851.38 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్,అత్యల్పంగా 80,248.84 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 61.52 పాయింట్ల నష్టంతో 80,364.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 19.80 పాయింట్లు తగ్గి 24,634.90 వద్దకు ముగిసింది. స్టాక్ ఇండెక్స్ విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాల కారణంగా నిఫ్టీ వరుసగా ఏడు ట్రేడింగ్ సెషన్లలో 3శాతానికి పైగా పడిపోయింది.

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 29:** తెలంగాణ దేశంలో ఉత్తమ రాష్ట్రంగా ఎదిగేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ సోమవారం సాయంత్రం ఓ కార్యక్రమంలో పాల్గొంటూ హైదరాబాద్‌ను ప్రపంచంలోనే ఓ ఉన్నత నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మెట్రోను ఎల్ అండ్ టీ ఆధీనంలో నుంచి తీసుకొనేందుకు ఒక చారిత్రక అడుగు ముందుకు వేశామని పేర్కొన్నారు. మెట్రోను వేగంగా విస్తరించి ప్రజలకు వరల్డ్ క్లాస్ అర్బన్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్‌ను అందజేయబోతున్నామన్నారు. మూసీ పునర్జీవనం ద్వారా హైదరాబాద్‌ను కాలుష్య

# తెలంగాణ రైజింగ్, 2047 విజన్ లక్ష్యంగా పనిచేస్తున్నాం: సిఎం రేవంత్

రహిత నగరంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో సీపోర్ట్ సమస్య తీర్చేందుకు డ్రైపోర్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, సీ పోర్టు కోసం మచిలీపట్నం వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డును నిర్మిస్తున్నామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రైల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇదే సమయంలో శంషాబాద్ నుంచి బెంగుళూరు వరకు, చెన్నై వరకు బులెట్ ట్రైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మౌలిక సదుపాయాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ పెట్టుబడులను తెస్తాయని, దీంతో లక్షలాది మంది ఉద్యోగాలు,ఉపాధి లభిస్తుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ తెలంగాణ భవిష్యత్‌ను,పటిష్టతను పెంచుతుందని ఇదంతా తెలంగాణలో ప్రతి పౌరుడికి ఉపాధి అవకాశాలు పెంచుతుందన్నారు.

# పదేళ్లపాటు మానసిక వ్యథ, పరువుపోయింది

## పది కోట్లు నష్టపరిహారం చెల్లించాలి: జెరుషలెం మత్తయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఓటుకు నోటు కేసులో దశాబ్ద కాలంగా తాను తీవ్రమైన బాధలకు, అవమానాలకు, పరువు నష్టాలకు గురైనాయని ఈ కేసులో ఎ-4 బాధితుడిగా ఉండి ఇటీవల సుప్రీంకోర్టు నుంచి క్లిన్ చీట్ పొందిన జెరూషలెం మత _య్య చెప్పారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎసిబి కోర్టులు, సివిల్ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు, వివిధ పోలీస్ స్టేషన్‌లు, టిడిపి కార్యాలయం చుట్టు తిరగడం వల్ల విలువలైన సమయంతోపాటు చాలా డబ్బులు ఖర్చు అయినాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాను త్వరలో నాంపల్లి కోర్టులో, మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్ సన్ మీద పరువు నష్టం దావాతోపాటు తెలంగాణ ఎసిబి, పోలీస్ అధికారులపైన పరువు నష్టం దావా వేయనున్నట్లు ఆయన హెచ్చరించారు.

# పవన్‌కల్యాణ్ ఓజి సినిమా టిక్కెట్ ధరలను వెంటనే తగ్గించాలి

## పోలీస్ శాఖ ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 29:** పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ చిత్రం టిక్కెట్ ధరల పెంపును తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ జీవో విడుదల చేసింది. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ చిత్రానికి సంబంధించిన టిక్కెట్ ధరల పెంపును తెలంగాణ హైకోర్టు సస్పెండ్ చేసిన విషయాన్ని, తదనంతర పరిణామాలను జీవోలో ప్రస్తావించింది. చిత్రం విడుదల సందర్భంగా ప్రీమియర్ షో ప్రదర్శనతో పాటు, సినిమా విడుదలైన సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 4 వరకు టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం జారీ చేసిన ఈ మెమోను సవాల్ చేస్తూ మహేశ్ యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ నెల 24న ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.సినిమా టిక్కెట్ రేట్లపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ 26న స్టే విధించింది. రివ్యూ పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం టిక్కెట్ ధరలు పెంచడానికి వీల్లేదని స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని హైకోర్టు తేల్చి చెప్పింది. తదుపరి విచారణను అక్టోబర్ 9వ తేదీకి వాయిదా వేస్తూ, టిక్కెట్ ధరలు ఎందుకు పెంచాలనుకుంటున్నారో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# లుఫ్తాన్సాలో 4వేల కొలువుల కోత

## భారీ లేఆఫ్‌లు ప్రకటిస్తున్న విమాన సంస్థ




**బెర్లిన్, సెప్టెంబరు 29:** జర్మనీకి చెందిన ప్రముఖ విమానయాన సంస్థ లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ కూడా భారీ లేఆఫ్‌లు ప్రకటిస్తోంది. రానున్న ఐదేండ్లలో వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించ నుంది. 4,000 ఉద్యోగాలను తగ్గించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఖర్చులను తగ్గించి కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తన కార్యకలాపాల విస్తృత సమీక్షలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లుఫ్తాన్సా తెలిపింది. సంస్థ పునర్నిర్మాణంతోపాటూ 2028 నుంచి 30 వరకు కొత్త ఆర్థిక లక్ష్యాలను కూడా నిర్దేశించుకుంది. ఈ కాలంలో 8 శాతం నుంచి 10 శాతం వరకూ ఆపరేటింగ్ మార్జిన్‌ను సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా సంస్థ నిర్ణయంతో ఈ లేఆఫ్స్ ప్రధానంగా అడ్మినిస్ట్రేటివ్ రోల్స్‌పై ప్రభావం చూపనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో దాదాపు 1,03,000 మంది ఉన్నారు. జర్మనీ వరుసగా రెండో ఏడాది కూడా తీవ్ర ఆర్థిక మాంద్యం ఎదుర్కొంటున్నట్లు నివేదికలు వెల్లడిస్తు న్నాయి.

నిరుద్యోగం పదేళ్లలో అత్యధిక స్థాయికి చేరుకుంది. దేశంలోని పెద్ద కంపెనీలు పెరుగుతున్న ఇంధన ఖర్చులు, చైనా నుంచి పోటీ, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడంలో పురోగతి లేకపోవడం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లునిపుణులు చెపుతున్నారు. ఈ క్రమంలోనే జర్మనీలోని పలు సంస్థలు ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం బోష్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 13,000 ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో 3 శాతం మందిని తొలగిస్తోంది.

# అక్టోబరు 6న టాటా క్యాపిటల్ ఐపిఒ

## రూ.17,200 కోట్ల నిధుల వేటకు రెడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా చెబుతున్న.. ఇన్వెస్టర్ల నుంచి అత్యంత ఆసక్తి ఉన్న ఐపీఓ రాబోతుంది. అదే టాటా గ్రూప్ నుంచి టాటా క్యాపిటల్ లిమిటెడ్. సెబీ నిబంధనల ప్రకారం ఇది ఐపీఓకు వస్తుంది. వచ్చే సోమవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. అక్టోబర్ 6,8 మధ్య ఈ ఐపీఓలో షేర్లు దక్కించుకోవచ్చన్నమా ట. రూ. 10 ముఖ విలువతో షేర్లు కొనుగోలు చేయాలి. ఇక ధరల శ్రేణి కూడా ఖరారైంది. ఒక్కో ఈక్విటీ షేరుకు కనీస ధర రూ. 310 కాగా గరిష్ట ధర రూ. 326 గా ఉంది. అక్టోబర్ 9న షేర్ల కేటాయింపు జరగనుండగా అక్టోబర్ 13న బిఎస్‌సి, ఎన్ఎస్ఇల్లో లిస్ట్ కానున్నట్లు తెలుస్తోంది. ఒక్కో లాట్ కింద కనీసం 46 ఈక్విటీ షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన కనీసం రూ. 31046, రూ. 14,260 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. గరిష్ట ధర వద్ద అంటే రూ. 326 వద్ద చూస్తే రూ. 14,996 పెట్టుబడి పెట్టాలి. ఇక ఐపీఓ ద్వారా ఏకంగా రూ. 17,200 కోట్ల నిధుల్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓలో 50 శాతం క్వాలిఫైడ్ సంస్థాగత ఇన్వెస్టర్లకు కేటాయించగా, 35 శాతం కంటే తక్కువ రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. ఎంప్లాయీ పోర్షన్ కింద 12 లక్షల షేర్లు కేటాయించారు. ఈ ఐపీఓలో భాగంగా టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ 23 కోట్ల షేర్లను విక్రయించనుంది. టాటా క్యాపిటల్‌లో టాటా సన్స్‌కు ప్రస్తుతం 88.6 శాతం వాటా ఉంది.

# తులం పసిడి మరింత ప్రియం


## పది గ్రాములు రూ.1.16,400లు

## వెండి కిలో ఒక్కింటికి..రూ.1,58,900లు

**ముంబయి, సెప్టెంబరు 29:** బులియన్ మార్కెట్‌లో బంగారంధరలు జోరుగా సాగుతు న్నాయి. గ్రాముధర ధర ఏకంగా రూ.92 పెరిగి రూ.11,640 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 10,670 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.8,730 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.9,200 పెరిగి రూ. రూ.11,64,000 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ. 10,67,000 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.8,73,000 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను పరిశీలిస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,16,400 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,06,700 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.87,300 గా నమోదైంది. చెన్నైలో బంగారం ధరలను చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,16,730 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,07,000 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.88,600 గా నమోదైంది. ముంబైలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,16,400 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,06,700 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.87,300 గా నమోదైంది. ఇక ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,16,550 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,06,850 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.87,450 గా నమోదైంది. బెంగుళూరులో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,16,400 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,06,700 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.87,300 గా నమోదైంది. కలకత్తా విషయానికి వస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,16,400 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,06,700 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.87,300 గా నమోదైంది.



ఇక బంగారంతోపాటే వెండిధరలు కూడా పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1,58,900 పలుకుతుంటే ఢిల్లీలో1.,48,900, చెన్నైలో కిలో ఒక్కింటికి రూ.1,58,900, కోల్‌కత్తాలో రూ.1,48,900, ముంబయిలో రూ,1,58,900, బెంగళూరులో 1,48,900 చొప్పున ధరలు పలుకుతున్నాయి.



# స్పెషల్ ఎఫ్‌డిల పేరుతో బ్యాంకుల ఆఫర్లు

**ముంబయి, సెప్టెంబరు 29:** నెలాఖరు వచ్చిందంటే చాలు కొన్ని స్కీంలకు గడువు ముగుస్తుంది. కొత్తనెలనుంచి కొత్త రూల్స్ వస్తుంటాయి. అలాగే ఈనెలాఖరులోపు ఆర్థికసేవల రంగంలో పలు మార్పులుచేసుకోవాల్సి వస్తోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డి)లపై ఉన్న ప్రత్యేక ఆఫర్లు, ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లు ముగుస్తాయి. ఇండియన్ బ్యాంక్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ వంటి అనేక బ్యాంకులు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందించే స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డి) స్కీమ్‌లను అందిస్తున్నాయి. ఇండియన్ బ్యాంక్ 444రోజుల, 555 రోజుల స్పెషల్ ఎఫ్‌డి స్కీమ్‌లను అందిస్తున్నాయి. ఈ స్పెషల్ ఎఫ్‌డిలలో పెట్టుబడి పెట్టడానికి గడువు సెప్టెంబర్ 30, 2025 వరకు మాత్రమే ఉంది. ఐడిబిఐ బ్యాంక్ 444, 555, 700 రోజుల స్పెషల్ ఎఫ్‌డిలకు కూడా సెప్టెంబర్ 30 వరకే గడువు ఉంది. ఇక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్ నుంచి యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)కి మారడానికి ఈనెల 30వరకే వరకు గడువు ఉంది. ఈ మార్పు మీ భవిష్యత్తు పెన్షన్ ప్రయోజనాలను ప్రభావితం చేస్తుంది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించిన ప్రకారం, 10 సంవత్సరాలు పూర్తి చేసిన చాలా జన్ ధన్ ఖాతాలకు రీకేవైసి అవసరం. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి, పబ్లిక్ సెక్టర్ బ్యాంకులు ఈనెలాఖరు వరకు పంచాయతీ స్థాయిలో రీకేవైసి పూర్తి చేయాలి. మీ ఖాతా యాక్టివేట్‌లో ఉండేందుకు ఈ గడువు లోపల రీ రీద్రి పూర్తి చేసుకోండి మరి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) మాన్‌సూన్ బొనాంజా 2025 రిటైల్ లోన్ క్యాంపెయిన్‌లో హోమ్ లోన్, కార్ లోన్, ఇతర రిటైల్ లోన్ ఆఫర్లను ప్రారంభించింది. ఈ ఆఫర్ కూడా ఈనెలాఖరు వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

# గ్రాండ్ చెస్ టూర్ సెమీఫైనల్స్‌లో ప్రజ్ఞానంద డ్రా




**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్ 2025, సెమీఫైనల్స్ లో వాచియర్‌లాగ్రేవ్ తో ప్రజ్ఞానంద మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. బ్రెజిల్‌లోని సావో పాలోలో సోమవారం జరిగిన గ్రాండ్ చెస్ సెమీఫైనల్స్ లో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద ఆలస్యంగా తడబాటు నుంచి తప్పించుకుని ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్‌తో మ్యాచ్ డ్రా గా ముగించాడు. ఆటపై పట్టు కోల్పోవ డానికి కేవలం ఒక సెకను మిగిలి ఉండగానే ప్రజ్ఞానంద పేలవమైన ఎత్తుగడ వేశాడు. కానీ వాచియర్‌లాగ్రేవ్ దానిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవడం ప్రజ్ఞానందకు కలిసొచ్చింది. కాగా మరో సెమీఫైనల్లో, ఫాబియానో కరువానా లెవాన్ అరోనియన్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. ఈ టోర్నమెంట్ మిశ్రమ సమయ నియంత్రణలతో సింగిల్ ఎలిమినేషన్ నాకౌట్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ప్రతి టైలో రెండు క్లాసికల్ గేమ్‌లు, రెండు రాపిడ్ గేమ్‌లు మరియు నాలుగు బ్లిట్జ్ గేమ్‌లు ఉంటాయి.

# ఐపిఎల్‌లో 'అండర్ 19'కు నో ఎంట్రీ

## ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడితేనే ఛాన్స్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టోర్నమెంట్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇందులో సెలెక్ట్ అయి ఒక్క మ్యాచ్ ఆడితే చాలు ఆ క్రికెటర్ స్టార్ అయిపోతాడు. అలా చాలామంది స్టార్లై ఇప్పుడు ఇండియన్ క్రికెట్ టీంను ఏలుతున్నారు. అభిషేక్ శర్మ, అర్ష్ దీప్, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశి, గిల్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది క్రికెటర్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్




ద్వారా టీమిండియాలోకి వచ్చారు. ఐపిఎల్ లో రాణిస్తే చాలు నేరుగా టీమిండియాలోకి వస్తున్నారు. అయితే ఇలాంటి నేపథ్యంలో ఐపీఎల్ ఆడేందుకు ప్రయత్నాలు చేస్తున్న యువ క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ఊహించని షాక్ ఇచ్చింది. అండర్ 19 ఉన్న ప్లేయర్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ లో ఆడాలంటే కచ్చితంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాల్సిందేనని తాజాగా కొత్త రూల్ తీసుకువచ్చింది. అంటే అండర్ 19 ఉన్న ప్లేయర్ కచ్చితంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్ మ్యాచ్ ఒకటైన ఆడాలి. అప్పుడే ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ వేలం లేదా మ్యాచ్‌ల్లో ఆడవచ్చు. ఇప్పటివరకు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఏ వయసు వారైనా ఆటగాళ్లను తీసుకునే వీలుండేది.

కానీ ఈ సారి ఐపీఎల్ నుండి ఆ ఆటగాడు ఇండియన్ కోల్ట్స్ తరపున ఆడినప్పటికీ కనీసం ఒక ఫస్ట్‌క్లాస్ ఆట ఆడిన తర్వాత మాత్రమే నగదు అధికంగా ఉండే లీగ్‌లో ఆడటానికి అర్హత పొందుతాడు. ఈ నిర్ణయం ఫ్రాంచైజీల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రధానంగా రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్‌లో ఆడిన అతి పిన్న వయస్కుడైన బీహార్ యువకుడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ గురించే. అయితే సూర్య గత ఏడాది రంజీ ట్రోఫీలో ఐదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లతో సహా అన్ని ఫార్మాట్లలో దేశవాళీ క్రికెట్‌లో బీహార్‌కు ప్రాతినిధ్యం వహించినందున, ఐపీఎల్‌లో అతని భాగస్వామ్యంపై దీని ప్రభావం ఉండదు. ఇక చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతూ ఐపీఎల్‌లో అందరినీ ఆకట్టుకున్న మరో అండర్ 19 ఆటగాడు ఆయుష్ మాత్రేకు ఎదురు దెబ్బ తప్పనిసరి కానుంది. ఏడు ఇన్నింగ్స్‌లలో 206 పరుగులు చేసి తన ప్రతిభను, హిట్టింగ్ సామర్థ్యాన్ని ప్రపంచం గమనించేలా చేశాడు. ఇప్పుడు ఇలాంటి అండర్ 19 ప్లేయర్లకు బిసిసిఐ గట్టి షాక్ ఇచ్చినట్లయింది.




# నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో.. మణికంఠకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో మాజీ జాతీయ రికార్డు హోల్డర్ మణికంఠ హోబ్లిధర్ స్వర్ణం సాధించాడు. బిర్సా ముండా స్టేడియంలో సోమవారం 24 ఏళ్ల మణికంఠ పురుషుల 100 మీటర్ల టైటిల్‌ను 10.19 సెకన్లలో గెలుచుకుని తన సొంత మీట్ రికార్డును బద్దలు కొట్టాడు. ఇది ఒక భారతీయ స్ప్రింటర్ సాధించిన రెండవ వేగవంతమైన సమయం. సెమీఫైనల్లో తన మునుపటి మీట్ రికార్డు 10.23 సెకన్లను సమం చేశాడు. ఫైనల్‌లో క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ నాణ్యమైన ఫీల్డ్‌ను అధిగమించి ప్రణవ్ గురవ్ (10.31 సెకన్ల) హర్ష్ రౌత్ (10.38 సెకన్ల) కంటే ముందు నిలిచాడు. మణికంఠ గెలిచిన సమయం అనిమేష్ కుజుర్ జాతీయ రికార్డు 10.18 సెకన్ల కంటే కేవలం 0.01 సెకన్ల దూరం తేడాలో ఉంది. అయితే, ఆ రోజు ఇద్దరు ఆశావహ అథ్లెట్లకు గాయాలు అయ్యాయి. ఇప్పటికే 1.79 మీటర్ల క్లియరెన్స్‌తో స్వర్ణం సాధించిన హై జంపర్ గోబికా ఎక్కువ మార్కు సాధించే ప్రయత్నంలో కుడి మోకాలికి తీవ్రమైన గాయమైంది. 2గా మహిళల 100 మీటర్ల పరుగులో స్నేహ ఎస్ఎస్ (11.62) సుధేష్ణ శివాంకర్ (11.64), అభినయ రాజరాజన్ (11.67) లను ఓడించింది. కానీ అభినయ బాధతో కుప్పకూలిపోవడంతో ట్రాక్ నుంచి బయటకు తీసుకెళ్లాల్సి వచ్చింది.

# షూటింగ్ ప్రపంచ కప్‌లో ఛాంపియన్‌గా ఓజస్వి

## హిమాన్షుకు స్వర్ణం




**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్ 2025, మహిళల విభాగంలో భారత్ అద్భుత ప్రదర్శనతో క్లీన్ స్వీప్ చేసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఛాంపియన్‌గా భారత్ షూటర్ ఓజస్వి ఠాగూర్ నిలిచింది. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో సోమవారం జరిగిన ఎయిర్ రైఫిల్ జూనియర్ మహిళల ఈవెంట్‌లో భారత్ అద్భుతమైన ఆధిపత్యంతో పోడియంను కైవసం చేసుకుంది. ఓజస్వి రెండు అద్భుతమైన 8వ మరియు 16వ షాట్‌లలో 10.9 సెకన్లలో 252.7 స్కోరుతో కొట్టి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. మిగిలిన భారత్ షూటర్లు హృదయ శ్రీ కొండూర్ 250.2 పాయింట్లతో రజతం సాధించగా, అర్హత లీడర్ శాంభవి ఎస్. క్షీర్‌సాగర్ 229.4 పాయింట్లతో అఖిల భారత పోడియంను పూర్తి చేసింది. అర్హత సమయంలో భారత త్రయం ఇప్పటికే తమ అధికారాన్ని చాటుకుని మొదటి మూడు స్థానాల్లో నిలిచింది. శాంభవి 632.0తో ముందంజలో, ఓజస్వి 631.9తో దగ్గరగా, మరియు హృద్య 629.8తో మూడవ స్థానంలో నిలిచారు. ఇక పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ ఫైనల్లో, 633.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన భారతదేశానికి చెందిన హిమాన్షు తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి 250.9 పాయింట్లతో స్వర్ణం సాధించాడు. వ్యక్తిగత తటస్థ అథ్లెట్ దిమిత్రి పిమెనోవ్ 249.9 పాయింట్లతో రజతం సాధించగా, భారతదేశానికి చెందిన అభినవ్ షా 228.4 పాయింట్లతో కాంస్యం సాధించాడు. తోటి భారత షూటర్ నరెయిన్ ప్రణవ్ వనితా సురేష్ 187.0తో ఐదవ స్థానంలో నిలిచింది.



# జపాన్ ఓపెన్‌లో ఫైనల్‌కు బోపన్న, యుజుకి జోడీ

**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ డబుల్స్ ఫైనల్‌కు ఇండో జపనీస్ ద్వయం రోహన్ బోపన్న-టకేరు యుజుకి దూసుకెళ్లింది. ఉత్కంఠభరితమైన టోక్యో షోడౌన్‌లో టోక్యోలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో టాప్‌సీడ్ అమెరికన్లను ఓడించడానికి ఇండో జపనీస్ ద్వయం 3మ్యాచ్ పాయింట్లను కాపాడుకుంది. ఏటా జరిగే ఎటిపి 500 ఈవెంట్ అయిన జపాన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి సింగిల్స్ మరియు డబుల్స్ ఆటగాళ్ళు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో భారత డబుల్స్ దిగ్గజం 45 ఏళ్ల బోపన్న ఈ మ్యాచ్‌లో నైపుణ్యం మరియు అనుభవాన్ని ప్రదర్శించి మెరిశాడు. జపాన్‌కు చెందిన స్థానిక టెకెరు యుజుకి (27)తో కలిసి, బోపన్న మొదటి రౌండ్‌లో నార్వేకు చెందిన కాస్పర్ రూడ్ మరియు ఆస్ట్రేలియాకు చెందిన జోర్డాన్ థాంప్సన్‌పై 6-3, 6-4 తేడాతో విజయం సాధించి తమ ప్రచారాన్ని ప్రారంభించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో బోపన్న మరియు యుజుకి మూడవ సీడ్ అర్జెంటీనా జంట మాక్సిమో గొంజాలెజ్ మరియు ఆండ్రెస్ మోల్టెనితో తలపడ్డారు. అరియాక్ కొలిసియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో వైల్డ్‌కార్డ్ ద్వయం 7-6(5), 7-6(4)తో విజయం సాధించడంతో, రెండు టైబ్రేకర్లకు దారితీసింది.

# చైనా ఓపెన్ సెమీఫైనల్లోకి సిన్నర్



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2025, సెమీఫైనల్లోకి జానిక్ సిన్నర్ దూసుకెళ్లగా, 16వ రౌండ్‌లోకి ఇగా స్వియాటెక్ చేరుకుంది. బీజింగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో సిన్నర్ తన ప్రత్యర్థి ఫాబియన్ మరోజ్సాన్‌ను వరుస సెట్లలో ఓడించి మూడో చైనా ఓపెన్ సెమీఫైనల్ స్థానాన్ని దక్కించుకున్నాడు. అలాగే స్వియాటెక్ తన ప్రత్యర్థి గాయంతో రిటైర్ అయినప్పుడు చివరి 16కి చేరుకుంది. ఇటాలియన్ సిన్నర్ బీజింగ్‌లో ఒక గంటా 19 నిమిషాల్లో ప్రపంచ 57వ ర్యాంకర్ హంగేరియన్‌ను 6-1, 7-5 తేడాతో ఓడించి, తర్వాత మూడో సీడ్ అలెక్స్ డి మినార్‌తో తలపడ్డాడు. సిన్నర్ మొదటి సెట్‌ను సులభంగా గెలుచుకున్నాడు కానీ రెండవ సెట్‌లో మరోజ్సాన్ దానిని మరింత కష్టతరం చేసినా 5-4 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. చివరి నాలుగు ఆటలలో కేవలం ఒక డ్రాప్ పాయింట్‌తో సిన్నర్ తదుపరి మూడు ఆటలను గెలుచుకున్నాడు. ఇక మహిళల డ్రాలో, పోలాండ్‌కు చెందిన టాప్ సీడ్ స్వియాటెక్, కామిలా ఒసోరియోపై మొదటి సెట్‌ను 6-0తో గెలుచుకుంది. స్వియాటెక్ తదుపరి అమెరికాకు చెందిన ఎమ్మా నవారోతో తలపడనుంది. అలాగే ఉక్రెయిన్‌కు చెందిన మార్తా కోస్ట్యుక్, రష్యాకు చెందిన మిర్రా ఆండ్రీవా కూడా చివరి 16కి చేరుకుని సెమీఫైనల్స్‌కు దగ్గరగా ఉన్నారు. నాల్గవ సీడ్ ఆండ్రీవా 6-4, 6-1 తేడాతో స్పెయిన్‌కు చెందిన జెస్సికా బౌజాస్‌ను ఓడించగా, కోస్ట్యుక్ 6-4, 6-2 తేడాతో బెలారస్‌కు చెందిన అలియాక్సాండ్రా సస్నోవిచ్‌ను ఓడించింది.



# 'థామా' ఆడియన్స్‌ను అలరిస్తుంది

## ప్రెస్ మీట్ లో హీరో ఆయుష్మాన్ ఖురానా

**ఆయుష్మాన్ ఖురానా,** రష్మిక హీరో హీరోయిన్స్‌గా తెరకెక్కిన సినిమా 'థామా'. హారర్ కామెడీగా రూపొందిన ఈ సినిమాకి ఆదిత్యా సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. పరేష్ రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రలు పోషించారు. మాడాక్ ఫిల్మ్స్ సమర్పణలో దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ మూవీ అక్టోబరు 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో హీరో ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ...'మాడాక్ ఫిల్మ్స్ యూనివర్స్‌లో భాగమవడం చాలా ఆనందంగా ఉంది. మాడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ యూనివర్సిటీలో వస్తున్న నెక్స్ట్ చాప్టర్ థామా. బేతాళ్ కి హెడ్ థామా. రష్మిక గారితో ఫస్ట్ టైం కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. రష్మిక బ్రిలియంట్ పెర్ఫార్మర్. ఫస్ట్ టైం హైదరాబాద్ ఫిలిం ప్రమోషన్ కోసం వచ్చాను. అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాని తమిళనాడు, ఊటీలో కూడా షూట్ చేసాము. ఇది ఫుల్ పాన్ ఇండియా ఫిలిం. నేను ప్రతి సినిమాకి ఒక కొత్త కాన్సెప్ట్ ఉండేలాచూస్తుంటాను. ఈ సినిమా కాన్సెప్ట్ కూడా ఆడియన్స్‌ని అలరిస్తుంది. అందరూ 21 అక్టోబర్ థియేటర్స్‌కి వచ్చి ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు. హీరోయిన్ రష్మిక మందన మాట్లాడుతూ... 'మాడాక్ హారర్ కామెడీ ఫిలిమ్స్‌లో చాలా మంచి కాన్సెప్ట్ ఉంటుంది. కథకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. పర్ఫార్మెన్స్‌లో అమేజింగ్‌గా ఉంటాయి. ఈ యూనివర్స్‌ కి ఆడియన్స్ నుంచి చాలా మంచి ఆదరణ ఉంది. అలాంటి సినిమా చేస్తున్నప్పుడు కచ్చితంగా మనపై రెస్పాన్సిబిలిటీ ఉంటుంది. ఈ అవకాశం ఇచ్చిన మాడాక్ ఫిలింస్ కి థాంక్యూ. ప్రతి సినిమాకి ఒక కొత్త క్యారెక్టర్ చేయాలని ప్రయత్నిస్తుంటాను. ఈ సినిమాతో కూడా ఆడియన్స్‌ని సర్ప్రైజ్ చేస్తానని భావిస్తున్నాను. ఈ సినిమా 21 అక్టోబర్ రిలీజ్ అవుతుంది. అందరూ థియేటర్స్‌లోచూసి మీబ్లెస్సింగ్స్ అందిస్తారని కోరుకుంటున్నాను అన్నారు.

# కాంతార: చాప్టర్ 1 బ్లాక్ బస్టర్ అవుతుంది

## ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్

**కాంతారతో** పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ అందుకున్న రిషబ్ శెట్టి మోస్ట్ ఎవైటెడ్ ప్రీక్వెల్ కాంతార: చాప్టర్ 1తో రాబోతున్నారు. ఈ చిత్రాన్ని ఆయన స్వయంగా దర్శకత్వం వహించి, నటించారు. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ అన్ని భాషలలో హ్యూజ్ బజ్ క్రియేట్ అంచనాలను భారీగా పెంచింది. ప్రఖ్యాత పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న దసరాకు విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది.

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ... 'మా అమ్మమ్మ నాకు చిన్నప్పుడు నుంచే కొన్ని కథలు చెప్పడం మొదలు పెట్టింది. అప్పుడు నిజంగా జరుగుతుందా ఈ కథ నిజమేనా కాదా? ఇలా ఎన్నో డౌట్లు. కానీ అవి బాగా నచ్చేవి. ఆవిడ చెప్పినప్పుడల్లా చాలా ఇంట్రెస్ట్ వచ్చేది. ఆ పింజుల్లి, గుడి ఘాట్ చిన్నప్పుడు నుంచి నాటుకు పోయింది. కానీ ఏనాడు అనుకోలేదు. చిన్నప్పుడు నేను విన్న ఆ కథల గురించి ఒక దర్శకుడు సినిమా తీస్తాడని. అతను మరెవరో కాదు నా బ్రదర్ రిషబ్ శెట్టి. నేను చిన్నప్పుడు విన్న కథ తెరపై చూసినప్పుడు నాకు మాటలు రాలేదు. కథ తెలిసిన నేనే అంత ఆశ్చర్య పోతే ఆ కథ తెలియని వాళ్లు చూసి ఏమయ్యారో అదే కాంతార రిజల్ట్. చాలా అరుదైన దర్శకుడు రిషబ్. 24 క్రాఫ్ట్‌లో అన్ని క్రాఫ్ట్స్‌ని ఆయన డామినేట్ చేయగలరు. రిషబ్ గారే లేకపోతే నిజంగా ఈ సినిమాని ఈ లెవెల్‌లో తీయగలిగేవారా అనిపిస్తుంది. ఈ సినిమా తీయడం అంత ఈజీ కాదు. ఒక గుడికి తీసుకెళ్లారు. నిజానికి ఆ గుడికి వెళ్లడానికి మార్గమే లేదు. అలాంటి మార్గాన్ని క్రియేట్ చేసుకున్నారు. కాంతార రిషబ్ శెట్టి గారి డ్రీమ్. ఈ డ్రీమ్‌ని ఫుల్ ఫిల్ చేయడానికి హోంబలే ఫిల్మ్స్ సపోర్ట్ చేశారు. ఇండియన్ ఫిలిమ్స్‌లో ఒక గొప్ప బ్లాక్ బాస్టర్ చిత్రంగా ఈ చిత్రం ప్రస్ఫుటంగా కనబడాలని మనస్ఫూర్తిగా దేవున్ని కోరుకుంటున్నాను. ఇక్కడికి వచ్చిన రిషబ్ గారిని కాంతారా టీంని ఆశీర్వదించినందుకు మీ అందరికీ మనస్ఫూర్తిగా నా ధన్యవాదాలు. ఈ సినిమా బిగ్‌బిగ్ బ్లాక్ బస్టర్ అవుతుంది. అక్టోబర్ 2న తప్పకుండా థియేటర్ కి వెళ్లి చూడండి. దయచేసి థియేటర్స్‌లో ఎంజాయ్ చేయండి. మా రిషబ్ గారికి ఆయన పడిన కష్టానికి మీరందరూ ఆశీర్వాదం అందించండి' అన్నారు.

హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి మాట్లాడుతూ.. 'ఈ వేడుక వచ్చిన అందరికీ థాంక్యూ సో మచ్. ఎన్టీఆర్ గారు నాకు ఫ్రెండు, బ్రదర్. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు నాకు ఒక బ్రదర్‌తో ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ వేడుక హైదరాబాదులో జరుపుకోవడం, ఈవేడుకకు ఎన్టీఆర్ గారు రావడం చాలా ఆనందంగాఉంది. తెలుగు ఆడియన్స్‌కి హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకి వచ్చిన ఎన్టీఆర్ గారికి థాంక్యూ సో మచ్. ఈ సినిమాకి మీరందరూ సపోర్ట్ చేసి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను. తప్పకుండా అక్టోబర్ 2న ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను' అన్నారు.




మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవి మాట్లాడుతూ... 'కాంతార ఎక్స్ట్రార్డినరీ. రిషబ్ గారి లుక్ మైండ్ బ్లోయింగ్. ట్రైలర్ చూసిన తర్వాత ఇప్పుడే సినిమా చూడాలనే ఫీలింగ్ కలిగింది. ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్‌లో చాలా పెద్దనెంబర్స్ కలెక్ట్ చేస్తుందని బలంగానమ్ముతున్నాను. రుక్మిణి ఎన్టీఆర్‌గారితో మేము చేస్తున్న సినిమాల్లో కూడా హీరోయిన్. హోంబలే ఫిలింస్ ఎక్స్ట్రాడినరీ సినిమాలు తీస్తున్నారు. ఎన్టీఆర్‌గారు రిషబ్‌గారు బ్రదర్స్‌లాగా ఉంటారు. ఎన్టీఆర్‌తోచేస్తున్న సినిమా వేరే లెవల్. ఈ అవకాశం ఇచ్చిన అందరికీ థాంక్యు సో మచ్' అన్నారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. 'హోంబలే ఫిల్మ్స్ ఫస్ట్ సలార్ ఇచ్చారు ఇప్పుడు కాంతార 1 ఇస్తున్నారు. తప్పకుండా వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. కాంతారా సినిమా అందులో పాటలు చాలా ఎనర్జీ ఇచ్చేవి. ఈ సినిమాని ఆశీర్వదించడానికి ఎన్టీఆర్ గారు రావడం చాలా సంతోషంగా ఉంది. తప్పకుండా ఈ సినిమాని థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు.

హీరోయిన్ రుక్మిణి వసంత్ మాట్లాడుతూ.. 'ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ కి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఎన్టీఆర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఆయన సొంత సినిమా లాగా సపోర్ట్ చేశారు. తెలుగు ఆడియన్స్ అందరికీ థాంక్యూ. నా ప్రతి సినిమాని మీరు సపోర్ట్ చేశారు. అక్టోబర్ రెండున ఈ సినిమా రిలీజ్ అవుతుంది. అందరూ థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను' అన్నారు.



# గ్రాండ్‌గా 'హైలెస్సో' లాంచ్

**సుడిగాలి సుధీర్‌గా** అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ బుల్లితెర, వెండి తెర రెండింటిలోనూ తనదైన ముద్రవేస్తున్నారు. అతని కొత్త చిత్రం ఈరోజు అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంను వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో శివాజీ విలన్‌గా కనిపించబోతున్నారు. ఈచిత్రానికి 'హైలెస్సో' అనే ఆకట్టుకునే టైటిల్ పెట్టారు. హీరో నిఖిల్ టైటిల్‌ను లాంచ్ చేశారు. బన్నీ వాసు స్క్రిప్ట్‌ను అందజేశారు. దర్శకులు వశిష్ట, చందూ మొండేటి, మెహర్ రమేశ్ కెమెరాను ఆన్ చేయగా, ముహూర్తపు షాట్‌కు వి.వి.వినాయక్ క్లాప్ కొట్టారు. దర్శకుడు ప్రసన్న కుమార్ స్వయంగా యాక్షన్ చెప్పారు. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటించగా, ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు.



# ఆకట్టుకుంటోన్న 'శశివదనే' ట్రైలర్

**రక్షిత్ అట్లూరి,** కోమలి ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్స్ కంపెనీ, ఎస్.వి.ఎస్ స్టూడియోస్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల సినిమాను నిర్మించారు. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అక్టోబర్ 10న రిలీజ్ కానున్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే..'గలగల పారే గోదావరి గట్టుతో కళ కళలాడే అందమైన పల్లెటూరులో ఓ అమ్మాయిని చూడగానే తొలి చూపులోనే అబ్బాయికి ప్రేమ పడుతుంది. ప్రేమ ఆ చూపుతో మొదలైంది.. కాలం బొమ్మలా ఆగిపోయింది. ఆమెతో పాటే నా మనసుకూడా మాయమైంది' అనే డైలాగ్ హీరోయిన్‌పై హీరోకి లవ్ డెప్త్ ఏంటో చెబుతోంది. 'లంకలోని సీత కోసం రాముడు సముద్రాలు దాటినట్లు.. నీ సైకిల్ పాప కోసం నువ్వు ఈ గోదారి దాటుతున్నావన్నమాట' ఈ డైలాగ్ చూస్తే తన మనసుకి నచ్చిన ప్రేయసి కోసం హీరో గోదారి దాటి వెళ్లి అన్వేషిస్తాడని. దానికి తగినట్లుగానే సన్నివేశాలను చూపించారు. 'ఆడపిల్లలు మన జీవితంలోకి కోరికలతోను, ఆశలతోను రారురా..జీవితంలో తోడుగా ఉంటామని భరోసాతో వస్తారు...', 'నాకు ఊహ తెలియని వయసు నుంచి నా అనుకున్నబంధం నాన్న.. ఊహ తెలిసిన తర్వాత నా అనుకున్న బంధం మీరు' అంటూ హీరోయిన్‌కి హీరో తన ప్రేమను చెబితే, 'ఇంత ప్రేమ నా నుంచి ఎప్పటికీ దూరం కాదుగా రాఘవ' అంటూ హీరోయిన్ ప్రేమగా హీరోని రిక్వెస్ట్ చేసే సన్నివేశం ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ గాఢతను తెలియజేస్తోంది. 'ప్రేమించాలని డిసైడ్ అయితే ఎన్నొచ్చిన యుద్ధం చేయాల్సిందే' అని హీరోకి తండ్రి చెప్పటం చూస్తే ప్రేమలో హీరోకి ఎదురైన సమస్య గురించి తెలుస్తుంది. అక్కడి నుంచి మనకు విలన్ పాత్ర ఎలా ఉండబోతుంది.. తన వల్ల హీరో పడ్డ ఇబ్బందులను ట్రైలర్‌లో చూపించే ప్రయత్నం చేశారు. "జాగ్రత్తగా వెళ్లి.. జాగ్రత్తగా తిరిగిరా' అంటూ హీరోకి హీరోయిన్ జాగ్రత్త చెప్పటం, 'ప్రేమతో వెళ్తున్నా.. వచ్చాక ప్రపంచాన్నే గెలుద్దాం' అని హీరో చెప్పటం.. దానికి హీరో నుంచి హీరోయిన్ ప్రామిస్ తీసుకోవటంతో ట్రైలర్ ముగిసింది. గోదావరి నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథలోని సన్నివేశాలు ట్రైలర్‌లోనే హృదయాలను హత్తుకుంటుంటే సినిమాలో ఎమోషన్స్ ఎలా ఉండబోతున్నాయనే క్యూరియాసిటీ అయితే కలుగుతోంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. సాయికుమార్ దారా అందించిన విజువల్స్ చాలా రిచ్‌గా ఉన్నాయి.



# సంప్రదాయాల పండగ సద్దుల బతుకమ్మ

ప్రపంచ వ్యాప్తంగా ఒక్కో ప్రదేశంలో ఒక్కో విశిష్టత సంతరించుకొని ఉంటుంది. ముఖ్యంగా సంస్కృతి, సంప్రదాయాలలో భారతదేశం పేరెన్నికగలది. విభిన్న మతాలు ఉన్నప్పటికీ మేటికవే తమ సంస్కృతిని, సంప్రదాయాలలో భారతదేశం పేరెన్నికగలది. విభిన్న మతాలు ఉన్నప్పటికీ వెటికవే తమసంస్కతిని, సంప్రదాయాల్ని కాపాడుకుంటూ వస్తున్నవి. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్రంలో అన్ని రకాల తెలుగువారి పండుగలలో ఘనంగా ప్రకృతి సహవాసంతో జరుపుకునే పండుగగా బతుకమ్మ పండుగ పేరెన్నికగన్నది.

సద్దుల బతుకమ్మరోజు ఐదు రకాల సద్దులను నైవేద్యంగా పెడతారు. అందుకే ఇది 'సద్దుల బతుకమ్మ' దద్దోజనం, చింతపండుపులిహోర, నిమ్మకాయ పులిహోర, కొబ్బరన్నం నువ్వులన్నం, పల్లీ, నువ్వులు,కొబ్బరి పుట్నాలను పొడిచేసి అన్నంతో కలుపుతారు. బియ్యపిండితోగాని సజ్జపిండివతోగాని రొట్టెలుకాలుస్తారు. వేడివేడి రొట్టెలకుపంచదార లేదా బెల్లం కలిపి దంచుతారు. ఈ పొడిని ముద్దలు చేస్తారు. వీటిని మలిజముద్దలు అంటారు. మలిజముద్దలు, పొడుల సద్ది, పెరుగుసద్ది పులిహోరతో కలిపి మొత్తం ఐదు నుంచి తొమ్మది రకాల సద్దులను నైవేద్యంగా ఇస్తారు.

తెలంగాణ ప్రాంతంలో చెప్పుకోదగ్గ ఆటపాటల పండుగ బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా వెలుగొందే బతుకమ్మ పండుగ వేడుకలు ఆశ్వయుజ మహాలయ అమావాస్యంతో 'ఎంగిలి పూల రకరకాల పూలతో గమ్మిడి పువ్వులు, తంగేడు, బీర, గన్నేరు, గునుగు, బంతి వంటి పువ్వులతో బతుకమ్మను పేర్చి పైన పసుపు ముద్దతో గౌరమ్మను ఉంచి కుంకుమ పెట్టి పూజిస్తారు. పెళ్ళికాని అమ్మాయిలు అయితే మంచి భర్త రావాలని, పెళ్ళైన స్త్రీలు నిండు నూరేళ్లు తన భర్త ఆయురారోగ్యాలతో బాగుండాలని బతుకమ్మని పూజించడం ఈ పండుగ ప్రత్యేకత తొమ్మిది రోజులపాటు బతుకమ్మను రకరకాల పేర్లతో పూజించడం విశేషం. మొదటిరోజు ఎంగిలిపువ్వుల బతుకమ్మ, రెండోరోజు అటుకుల బతుకమ్మ. మూడువరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగోరోజు నానబియ్య బతుకమ్మ, ఏదోరోజు అట్ల బతుకమ్మ ఆరోరోజు అలిగిన బతుకమ్మ ఏడోరోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదోరోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మ ఇలా తొమ్మిది రోజుల పాటు రకరకాల పూలతో, ప్రసాదాలతో పూలపండుగ చేసుకోవడం. తెలంగాణలోని సంస్కృతిలో ఒక ప్రత్యేకత అనే చెప్పవచ్చును. పూజాది కార్యక్రమాలు అయ్యాక బతుకమ్మలను చెరువులు, నదులలో నిమజ్జనం చేస్తారు. ప్రకృతికి, మనిషికి మధ్య అవినాభావ సంబంధం ఉంది అనడానికి బతుకమ్మ పూలపండుగే సాక్ష్యం. బతుకమ్మల పండుగకోసం సేకరించే పూలతో చేసిన బతుకమ్మను చెరువులు, నదులలో నిమజ్జనం చేయడం వలన కొత్తనీరు శుద్ధతను సంతరించుకొంటుంది. రోగకారక క్రిములు వంటివి కూడా నశిస్తాయి. అంతేకాకుండా ఈ తొమ్మిది రోజులపండుగ సందర్భంగా తయారుచేసే ప్రసాదాలు అన్నీ కూడా శారీరక ఆరోగ్యానిచ్చే వరప్రదాయినిగానే చెప్పవచ్చును.

బతుకమ్మ పండుగ పూలపండుగగా ప్రకృతితో మమేకమైన పండుగగా ప్రత్యేకత ఉన్నప్పటికీ పాటల పండుగ అని కూడా ప్రత్యేకంగా చెప్పవచ్చు. బతుకమ్మ పండుగకు స్త్రీలు అనేక రకాల పాటలు పాడుతారు. ఒక స్త్రీ పాట పాడగా మిగతా వాళ్ళంతా ఆ పాటకి వంతపాడుతారు. ఉయ్యాల, కోలో, వలలో, కోయిలా, తమ్మెద, రామచిలుకా ఓ రాచగుమ్మడి, చెలియా మొదలైన వంత పదాలు పాడి, ఆ పాటను రక్తి కట్టిస్తారు. చప్పట్ల లేదా కోలోటంతో స్త్రీలు సామూహిక స్వరాలతో వినసొంపుగా ఉంటుంది. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ-ఏమేమి కాయొప్పునే గౌరమ్మ గుమ్మడి పువ్వొప్పునే గౌరమ్మ-గుమ్మాడి కాయొప్పునే గౌరమ్మ గుమ్మాడి చెట్టుకింద గౌరమ్మా – ఆట సిలకాలార గౌరమ్మ అంటూ..

పూల ప్రాధాన్యతను తెలిపే బతుకమ్మపాటు శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో-చేయబూనితినమ్మా ఉయ్యాలో
కాపాడు ముమ్ములా ఉయ్యాలో-కైలాసరాణివి ఉయ్యాలో
శ్రీలలితవు నీవు ఉయ్యాలో-సరిలనిచ్చే తల్లినీ ఉయ్యాలో చదువుల
నిత్తుమా ఉయ్యాలో – శ్రీ సరస్వతివి నీవు ఉయ్యాలో అంటూ



బతుకమ్మను పార్వతీదేవిగా భావిస్తూ స్త్రీలు పాడే పాటలు బతుకమ్మ పండుగ విశిష్టతను ఇనుమడించేలా పాడడం విశేషం.

ఒక్కేసి పువ్వేసి సందమామ   ఒక్క జాములయె సందమామ
రెండేసి పువ్వేసి సందమామ   రెండు జాములయె సందమామ
మూడేసి పువ్వేసి సందమామ   మూడు జాములయె సందమామా

అంటూ బతుకమ్మల చుట్టు తిరుగుతూ పాడడం వలన పండగ వైశిష్ట్యాన్ని మరింతగా ఇనుమడింపచేస్తుంది.

రామా రామా రామా ఉయ్యాలో
శ్రీరామరామ ఉయ్యాలో
శ్రీలక్ష్మీదేవియు ఉయ్యాలో సృష్టిబతుకమ్మయె
ఉయ్యాలో భరతుని దేశమున ఉయ్యాలో
ధర్మాంగుడనురాజు ఉయ్యాలో
ఆరాజు భార్యయూ ఉయ్యాలో, అతివ
సత్యవతి ఉయ్యాలో నూరు నోములనోచి
ఉయ్యాలో నూరుమందిని కనియె ఉయ్యాలో

అంటూ ప్రకృతిలోని పూలతో గౌరిదేవిని నిత్యం పూజించడం వలన మానవాళి బంగారు భవిష్యత్తును ఎటువంటి ఆపద రాకుండా నిండునూరేళ్ళు పచ్చని పంటలతో, ప్రకృతితో, బతుకు పండుగలా. సాగాలని గౌరీమాతను పూజిస్తూ పాటలు పాడుతారు. అంతేకాకుండా తెలంగాణలోని బతుకమ్మ పండుగ విశిష్టతను తెలిపే మరొక బతుకమ్మ పాటను పరికించి చూస్తే.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో తంగేడు గునుగులో ఉయ్యాలో తరలివచ్చేను ఉయ్యాలో గౌరమ్మ రూపానివే ఉయ్యాలో బంగారు తేజానివే ఉయ్యాలో బీర ఆకులతోటి ఉయ్యాలో పూలపందిరివోలె ఉయ్యాలో ఎత్తయిన బుతకమ్మ ఉయ్యాలో తెలంగాణ సొగసమ్మ ఉయ్యాలో వీర తెలంగాణ ఉయ్యాలో .. అంటూ సాగే ఈ పాట బతుకమ్మ పండుగను, ప్రాధాన్యతను ఇనుమడించేలా చేసింది. ఎంతోగొప్ప చరిత్రను, ఘనతను కలిగిన భారతదేశం తరతరాలకు ఆస్తులను వారసత్వంగా ఇవ్వకుండా సంస్కృతి, సంప్రదాయాలను వారసత్వ సంపదగా ఇవ్వడం గొప్ప విషయం. తీరాలు మారినా సంస్కృతి, ఆచారాలు వన్నె తగ్గవన్నది సత్యం. ఆధునిక యుగంలో కూడా బతుకమ్మ పండుగను పల్లెపల్లెల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా వీధివీధుల్లో పెద్దఎత్తున జరుపుకోవడం విశేషం. అంతేకాకుండా ప్రవాస భారతీయులు కూడా మాతృదేశాన్ని వదిలి వృత్తిరీత్య వెళ్ళినా అక్కడ కూడా బతుకమ్మ పండుగ సంబురాలు చేసుకోవడం ఎంతో గొప్పవిషయం. ఎంతో చారిత్రమైన ఘనతకు కలిగి, జానపదుల పండుగగా వెలిసిన బతుకమ్మ నేడు తెలంగాణాలో దశదిశలా బతుకమ్మ ఆటపాటలతో పల్లె, పట్నం, చిన్నా, పెద్దా, ఆడా, మగా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ. ప్రకృతితో, పూలతో ఆట పాటలతో మమేకమై జరుపుకునే పండుగ బతుకమ్మపండుగ. పూలపండుగగా.. ప్రభుత్వం రాష్ట్రపండుగా అధికారికంగా నిర్వహించడం బతుకమ్మ పండుగ ఘనతను వినూతికెక్కించడమే కదా! ఒక తరం నుండి మరొక తరానికి వారసత్వంగా వెలుగొందుతున్న బతుకమ్మ పండుగను మరింతగా ఇనుమడించేలా జరుపుకుందాం.

- డా॥ఓరుగంటి సరస్వతి

## నేటి అలంకరణ

# శ్రీ దుర్గాదేవి



అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ !
చాలా పెద్దమ్మ సురారులమ్మ కడుపారడి బుచ్చినయమ్మ !!
తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ !
దుర్గ మాయమ్మ కృపాబ్ది నిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్ !!
" విద్యుద్దామ సమప్రభాం మృగపతి స్కంధస్థితాం భీషణాం
కన్యాభిః కరవాలఖేట విలద్దస్తా భిరాసేవితాం!
హస్తైశ్చక్రగదాసిఖేట విసిఖాంశ్చాపం గుణం తర్జనీం
బిభ్రాణా మనలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే "

దుర్గమ్మ ఈ అవతారములోనే దుర్గముడనే రాక్షసుడ్ని సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పంచప్రకృతి మహాస్వరూపాల్లో దుర్గ రూపం మొదటిది. భవబంధాలలో చిక్కుకున్న మానవుడిని ఈ మాత అనుగ్రహించి మోక్షాని న్ప్రసాదిస్తుంది. కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను అర్చిస్తే అర్చిస్తే శత్రుబాధలు నశిస్తాయి. విజయం కలుగుతుంది. దుర్గతుల నుండి రక్షించే తల్లిగా దుర్గమ్మను వేదవిధులు కీర్తిస్తారు. సకల గ్రహ బాధలు దుర్గమ్మ నామాన్ని జపిస్తే తొలగిపోతాయి. ఆరాధకులకు దుర్గాదేవి శీఘ్ర అనుగ్రహకారిణి.

**అలంకారం :** అమ్మవారిని ఎరుపు వర్ణంతో కూడిన పట్టుచీరతో అలంకరిస్తారు.

**వస్త్రం :** ఎరుపు వస్త్రం, ఎరుపు అక్షతలు,
పుష్పాలు : ఎర్రని పుష్పాలు

**నివేదన :** అమ్మవారికి పులగాన్నం నివేదన చేయాలి.

**మంత్రం :** "ఓం దుం దుర్గాయైనమః" అనే మంత్రాన్ని 108 సార్లు పఠించాలి. దుర్గా, లలిత అష్టోత్తరాలు, దుర్గాసూక్తం పారాయణం చేస్తూ అమ్మవారిని పూజించాలి.

. - భట్టిప్రోలు నటరాజ కుమార్

# మీ డెస్క్ దగ్గర ఈ బోర్డ్ ఉందా!



**పని ఏదైనా తమదైన శైలిలో దూసుకుపోతూ... ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆశించని ఉద్యోగినులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో.** ఆయా సంస్థలూ ఇదే విధమైన మెరుగుదలని కోరుకుంటాయి. అందుకే ముందస్తు సమావేశాలు పెట్టి, ఉత్పాదకత పెంచాలని సూచించారు. అందుకు అనుగుణంగా ప్రణాళికల్ని వేసుకోమని సలహాలు ఇస్తుంటాయి. అయితే, పైవాళ్ల కోరుకునే మెరుగుదల మీకు భారం కాకూడదన్నా... ఒత్తిడీ ఆందోళనలకు దారితీయకూడదన్నా మనకంటూ ఓ వ్యూహం ఉండాల్సిందే. ఇందుకు ఏం చేయాలి అంటే.. మనం చేసిన, చేయాల్సిన పనులను బేరీజు వేసుకుని... ఓ చోట రాసుకుని డెస్క్ దగ్గర మీకు కనపడేలా అమర్చుకోండి. దాన్ని చూడటం వల్ల మనం చేస్తున్న పనిలో లోటుపాట్లు తెలుస్తాయి. ఎక్కడ ఏ విధంగా నైపుణ్యాలను పెంచుకోవచ్చో అవగాహన వస్తుంది. లక్ష్యాల గురించి ప్రస్తావిస్తే... బర్నవుట్ తప్పదు. అందుకే దీన్లో ఇంకోవైపు విజయాల్ని కూడా రాయాలి. డీలా పడిన సమయాల్లో అవి బూస్టర్స్ ఉపయోగపడతాయి. ఇలా ప్రతి విషయంలో మంచి చెడుల్ని ఉటంకిస్తూ తయారుచేసుకునే ఆ బోర్డు మీకు దిక్సూచిగా, ప్రేరణగా ఉంటుంది. నిరంతరం మీ లక్ష్యాలను గుర్తుచేస్తుంది. దానితో మీ మరింత మెరుగ్గా దినచర్యకు అవకాశం లభిస్తుంది. ప్రయత్నించారు కదూ! ◻

# ఎక్కువగా స్పందించారట ..



కొన్ని రకాల కీటకాలకు అమ్మాయిలు భయపడుతుంటారుని తెలుసు. అయితే, ఈ భయాలు పెరిగి పెద్దయ్యాక ఏర్పడతాయన కుంటాం కానీ,పసి వయసులోనూ అలానే స్పందిస్తారట. 11 నెలల వయసున్న పాప, బాబులకు సాలీడు ఫొటోలను చూపించి స్టడీ చేశారట పెన్సిల్వేనియా లోని శాస్త్రవేత్తలు. పాప వాటిని చూసి భయపడగా, బాబు అంతగా స్పందించలేదట. ◻

# మెరిసే సీతమ్మ పువ్వులు



పూలు మన సంస్కృతి లో ఓ భాగం. అవి లేనిదే ఏ పూజ, పండగా పూరన్తి కాదు. అందులోనూ బతుకమ్మ అంటేనే పూల సంబరం. దీన్ని పేరేనచందుకు వాడే పూలలో సీతమ్మ జడ గంటలు ముందు వరుసలో ఉంటాయి. వీటికే కోడిజుట్టు పువ్వులు, సీతమ్మ జడ బంతులు, ముఖమల్ పువ్వులు, మహారాణీ పువ్వులు.. అనే చాల పేర్లు ఉన్నాయి. ఆంగ్లంలో సెలోలసియా అని పిలిచే ఈ మొక్క ప్రతి కొమ్మకూ సన్నాయి ఆకృతిలో పూలు వికసిస్తాయి. వర్షాకాలంలో మొదలైన ఈ పూల సందడి..చలికాలం దాటేవరకూ ఉంటుంది. ఇక, సూర్య కాంతి వీటిపై ప్రసరించినప్పుడు ఈ పూలు మెరిసిపోతూ ఆకట్టుకకుంటాయి. వీటిల్లో ఎక్కువగా రాణీరంగు పుష్పాలే ఎక్కువగా కనిపించినా ఎరుపు, పసుపు, ఉదా.. వంటి మరెన్నో వర్ణాల్లోనూ దొరుకుతున్నాయి. సెలోసియా మొక్కను పాశ్చాత్య దేశాల్లో ఎండబెట్టి పూల అలంకరణల్లో వాడతారు.సంప్రదాయ ఆయుర్వే వైద్యంలో రక్తసావ సమస్యలకు, గ్యాస్ సంబంధిత ఇన్ఫెక్షన్ల నివారణకు, అతిసారం, తల నొప్పి చికిత్సల్లోనూ వాడతారు. ◻

# పువ్వుల్లో ఆయుర్వేద గుణం



ఏమేమి పువ్వ పునే గౌరమ్మ.. ఏమేమి కాయప్పునే.. అంటూ పూలలో పూవుగా ప్రతిఒక్కరూ మెరిసిపోయే పండుగ బతుకమ్మ. పువ్వుల్లోనూ ఒక ఆయుర్వేద గుణము తప్పకుండా ఉంటుంది. మన చర్మ ఆరోగ్యాన్ని చక్కగా సంరక్షించరుకోవచ్చు. అందాన్ని కూడా ద్విగుణీకృతం చేసుకోవచ్చు. బతుకమ్మలో ఉపయో గించే ప్రతి పువ్వులోనూ ఏదో ఒక ఆయు ర్వేద గుణం తప్ప కుండా ఉంటుంది. ఇవి మన శరీరాన్ని వివిధ ఆరోగ్య సమస్యల నుంచి దూరం చేయడమే కాదు.. చర్మాన్ని అందంగా మెరిపించడంలోనూ ఉపయోగపడతాయని చెబుతున్నారు నిపుణులు.

**తంగేడుతో తళతళ..** బతుకమ్మ అనగానే ముందుగా గుర్తొచ్చే పువ్వు తంగేడు పువ్వు. శాస్త్రానికి కనీసం ఒక్క తంగేడు పువ్వేవా లేకుండా బతుకమ్మను పేర్చకూడదంటారు పెద్దలు.. అంతటి ప్రాముఖ్యం ఉంటుంది. తంగేడు పువ్వుకు.. ఈ పువ్వు సౌందర్యాన్ని కాపాడడంలోనూ ఎంతో ఉపయోగపడుతుంది. దీన్ని ఎండబెట్టి, రేకలను పొడిచేసి, ఆ పొడిని ప్రతిరోజూ ఉపయోగిస్తే మంచి చర్మఛాయ సొంతమవుతుందట. దీనికోసం ఈ పూరేకల పొడిని మెత్తగా జల్లించుకొని అందులో శనగపిండి, రోజ్ వాటర్ కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టించి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచి, ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే చక్కటి చర్మ ఛాయను సొంతం చేసుకోవ చ్చంటున్నారు నిపుణులు. అలాగే తంగేడు పూల పొడితో స్క్రాబ్ని కూడా తయా రు చేసుకోవచ్చు. దీనికోసం నిమ్మతొక్కల పొడి, పెసర పిండి, శెనగపిండి, గులాబీ రెక్కల పొడి సమాన మొత్తాల్లో తీసుకొని బాగా మెత్తగా చేసుకొని జల్లించుకోవాలి. దీన్ని రోజూ స్నానం చేస్తే ముందు శరీరానికి పట్టిస్తే చర్మం కాంతి మంత మయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు అంటున్నారు.



**మెరిపించే మందార..** మందారం చర్మ ఆరోగ్యానికే కాదు.. జుట్టు పట్టులా మెరిసేం దుకు కూడా చక్కగా ఉపయోగపడు తుంది. దీనికోసం మందార పూలను ఎండబెట్టి ఆ పొడిని నూనెలో వేసుకొని తలకు పట్టించవచ్చు. దీనితో జుట్టు బాగా పెరిగే వీలుంటుంది. ఇక చర్మ సౌందర్యం కోసం కూడా మందారను ఉపయోగించవచ్చు. దీనికోసం మందార పూరేకులు పొడి, బియ్యప్పిండి సమాన మొత్తాల్లో తీసుకొని, దానికి విటమిన్ ఇ ఆయిల్ కలుపుకోవాలి. ఈ పేస్ట్ని రాసుకుని కొద్దిసేపు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత తడి గుడ్డతో తుడిచి, కడిగేసుకోవాలి, దీన్ని ఉపయోగించడం వల్లమొటిమలు, మచ్చలు తగ్గడంతో పాటు చర్మం కూడా కాంతిమంత మయ్యే అవకాశం ఉంటుందంటు న్నారు నిపుణులు. ప్రస్తుతం ఆయా పూలతో చేసిన ప్రత్యేకమైన పౌడర్లు, స్క్రాబ్స్, ప్యాక్.. తదితరాలు అందుబాటులో ఉన్నాయి. నిపుణుల సలహాతో వాటిని ఉపయోగించవచ్చు. ◻

# వడ లాంటి ఇడ్లీ

**వడ లాంటి ఇడ్లీ**

ఇడ్లీ, వడ తరచుగా చేసుకునేవే కానీ, ఇడ్లీ లాంటి వడ లేదా వడ లాంటి ఇడ్లీ ఎప్పుడైనా తిన్నారా? అయితే ఇప్పుడు ప్రయత్నించి చూడండి. పసుపుకోసం.. అటుకులు కప్పు, పెరుగు, ఉప్మారవ్వ అర కప్పు చొప్పున, ఉప్పు రుచికి తగినంత, పచ్చిమిరపకాయలు 2, కొత్తిమీర తరుగు గుప్పెడు, అల్లంపచ్చిమిర్చి ముద్ద చెంచా, పుదీనా తరుగు 2 చెంచాలు, నూనె రెండు చెంచాలు, కరివేపాకు రెబ్బలు 2 చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే. అటుకులను కడిగి, నీళ్ల లేకుండా గట్టిగా పిండేయాలి. అందులో పుదీనా తరుగు, రవ్వ, పెరుగు, ఉప్పు, అల్లంపచ్చిమిర్చి ముద్ద, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో గారెలు చేసి.. సిలికాన్ కోటెడ్ పేపర్ పరిచిన ఇడ్లీ పాత్రలో సుమారు పావుగంట ఉడికించాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు వేయాలి. అవి చిటపటలాడాక సాగానికి చీల్చిన పచ్చిమిరపకాయలను జోడించాలి. అవి వేగాక.. కరివేపాకు, పసుపు వేయాలి. అర తర్వాత నిమిషం ఉడికించిన గారెలను జతచేయాలి. వాటిని నాలుగైదు నిమిషాలు వేయించి.. పైన కొద్దిగా కొత్తిమీర చల్లాలి. అంతే వెరైటీ వంటకం తయారైపోతుంది. వీటిలోకి పల్లీ, కొబ్బరి, టొమాటో ఏ పచ్చడైనా బాగుంటుంది. టొమాటో లేదా చిల్లీ సాస్ నూ తినొచ్చు. ◻



# మొక్కలకు చీమలా?

**చీమలు ఇంట్లో ఉండే** ఆహారపదార్థాల చుట్టూ చేరి చిరాకు పెడు తుంటాయి. ఇంతేకాకుండా తోటలో మొక్కలపై చేరి వాటికీ హాని చేస్తాయి. వీటి బెడద తగ్గించే చిట్కాలివి... బేకింగ్ సోడా... వంటగదిలో దొరికే బేకింగ్ సోడాతో చీమలను రాకుండా చేయొచ్చు. వేపనూనెలో స్పూన్ బేకింగ్ సోడా వేసి రెండింటినీ కలిపి చీమలు ఉండే ప్రదేశంలో రాయాలి. ఇలా చేయడం వల్ల మొక్కలకు పట్టిన చీమలు పోతాయి. వైట్ వెనిగర్ వైట్ వినెగర్, నీళ్ల సమాన పరిమాణంలో తీసుకుని సీసాలో పోసు కోవాలి. దీన్ని ఇంటి తోటలోని మొక్కల దగ్గర చేరిన చీమలపై పిచికారీ చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు ఈ నటిని పిచికారీ చేయం వల్ల చీమలు పోతాయి. నిమ్మరసంలో.. సిట్రస్ వాసన చీమలను అరికట్టడానికి సాయ పడుతుంది. లీటరు నీటిలో రెండు చక్కల లవంగ నూనె, కాస్త నిమ్మరసం కలిపి మొక్కలపై స్ప్రే చేస్తే ఈ వాసనకు చీమలు పారిపోతాయి. ◻



# బతుకమ్మ ఉయ్యాలో ..



ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాలో
ఊరు వాడల ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో ॥ ఊ ॥
ఆకాశంలో చుక్కలు ఉయ్యాలో
పూవులై పొద్దు పొడిచే ఉయ్యాలో
వానలు కురియంగ ఉయ్యాలో
పూవులు పూయంగ ఉయ్యాలో
తీరొక్క పూలతో ఉయ్యాలో
వనమంత మెరిసింది ఉయ్యాలో ॥ఊ॥
రంగు రంగుల పూలు ఉయ్యాలో
భూదేవి సిగలో ఉయ్యాలో
సింగిడి రంగులతో ఉయ్యాలో
ముగ్గులే వేసిరి ఉయ్యాలో ॥ఊ॥
అమ్మలక్కలు చేరి ఉయ్యాలో
బతుకమ్మ పేర్చిరీ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
భాగ్యమై వచ్చింది ఉయ్యాలో. ॥ ఊ ॥
ఆడపడుచులంత ఉయ్యాలో
ఆడి పాడిరి ఉయ్యాలో
దేవ లోకం నుంచి ఉయ్యాలో
దేవతలు తిలకించిరి ఉయ్యాలో
దీవెనలెన్నో ఇచ్చిరి ఉయ్యాలో
ఒక్కొక్క బతుకమ్మ ఉయ్యాలో
ఒక్కొక్క రీతిగా ఉయ్యాలో
చిన్ని క్రిష్ణుడు ఎత్తిన ఉయ్యాలో
గోవర్ధన గిరియే ఉయ్యాలో. ॥ఊ॥
బతుకమ్మ సందడితో ఉయ్యాలో
ఊరువాడ బృందావనమే ఉయ్యాలో
గోపికలందరు వచ్చిరి ఉయ్యాలో
గౌరమ్మను కొలిచిరి ఉయ్యాలో ॥ఊ॥
నీళ్ళపై తేలేటి బతుకమ్మ ఉయ్యాలో
మందర పర్వతం ఉయ్యాలో
నీళ్ళన్నీ మారేను ఉయ్యాలో
అవనిపై అమృతంగ ఉయ్యాలో ॥ఊ॥
తొమ్మిది రోజుల పండుగ ఉయ్యాలో
మా వాళ్ళు వచ్చిరి ఉయ్యాలో
మీ వాళ్ళు వచ్చిరి ఉయ్యాలో
ఎనుకటి జ్ఞాపకాలు ఉయ్యాలో
ఎరుక జేసుకొంటిమి ఉయ్యాలో ॥ఊ॥
పొద్దు గూకే వేళాయే ఉయ్యాలో
గంగ దరి చేరాలి ఉయ్యాలో
ఏడాది కొకసారి సారి ఉయ్యాలో
వచ్చి పోవమ్మ ఉయ్యాలో ॥ఊ॥
ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాలో
ఊరు వాడల ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో

-పట్లొళ్ళ బక్కారెడ్డి




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.